సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 5.50
సంపుటి: 16
సంచిక: 179
సోమవారం 18-9-2023
'ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరి గొంతు వినడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉండాలి'
SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



వినాయక చవితి ప్రత్యేకం

ఒజ్జ గణపతికి వందనాలు



"ఓ బొజ్జ గణపయ్య! నీ బంటు నేనయ్య! ఉండ్రాళ్ళ మీదికి దండు పంపు."

అంటూ పిల్లలు సంబరంగా జరుపుకునే పండగ వినాయక చవితి. యావద్భారత దేశం వేడుకగా జరుపుకునే పండగ ఇది. కలియుగంలో అతి త్వరగా అనుగ్రహించే దైవం వినాయకుడు.

ఋుగ్వేద కాలం నుండి కీర్తించబడి పూజించబడుతున్న దేవత ఒక్క గణపతి మాత్రమే.

దేవతలలో ప్రథముడు, జ్యేష్ఠుడు ఐన గణపతిని అన్ని సందర్భాలలోను పూజించటమే కాదు దేవతలందరూ త్రిమూర్తులతో సహా పూజించినట్లు ఆధారాలున్నాయి. గణపతి కున్న నామాలలో బాగా ప్రసిద్ధమైనవి వినాయకుడు, గజాననుడు. గణనాథుడికి ఉన్న పన్నెండు నామాలలో ప్రతి దాని వెనక ఒక చరిత్ర ఉంది. ముఖ్యంగా వినాయకోత్పత్తి, వినాయకుడు గజాననుడు కావటానికి గల కారణాలు ఒక్కొక్క పురాణంలో ఒక్కొక్క విధంగా ఉన్నాయి. అంతే కాదు ఒక్కొక్క యుగంలో ఒక్కొక్క రూపంలో అవతరించినట్టు కనపడుతుంది.

సృష్టికార్యం ప్రారంభించే ముందు బ్రహ్మ ప్రార్థించిన గణపతి ఓంకార స్వరూపుడు. కృత యుగంలో కశ్యపునికి అదితికి జన్మించి 'మహోత్కటుడు' అనే పేరుతో దేవాంతక నరాంతక రాక్షసులను సంహరించి లోకకల్యాణం గావించాడు. త్రేతాయుగంలో, మయూరేశుడుగా అవతరించి త్రిమూర్తులకు వారు కోల్పోయిన స్థానాలను తిరిగి ఇప్పించాడు. అప్పుడే బ్రహ్మ తన కుమార్తెలైన సిద్ధి, బుద్ధిలను వినాయకుడికిచ్చి, వివాహం చేస్తాడు. ఈ అవతారంలో వినాయకుడి వాహనం నెమలి. ద్వాపరయుగంలో గజాననుడుగా అవతరించి, సింధూరుడనే రాక్షసుని సంహరించాడు. మనం వినాయకవ్రత కల్పంలో చదివే కథ ఈ గజాననునిదే. కలియుగంలో ధూమ్రకేతువుగా అవతరించి, అశ్వారూఢుడై ప్రతిప్రాణిలో పెచ్చుపెరిగిన రాక్షసప్రవృత్తిని నశింప చేస్తూ ఉన్నాడట.

వివిధ పురాణాలలో గణపతి వినాయకుడి ఆవిర్భావం, రూపు రేఖలు విభిన్నంగా ఉన్న కారణంగా శిల్పులు వాటికి గణపతి తత్త్వాన్ని, తమ సృజనాత్మకతను జోడించి రకరకాల గణపతులను మన ముందు ఉంచుతున్నారు. మిగిలిన లక్షణాలను ఏరకంగా చూపించినా అన్నింటిలోనూ సామాన్యంగా ఉండేవి – గజ ముఖం, కురచ మెడ, పెద్ద బొజ్జ, నాగయజ్ఞోపవీతం, చేతిలో మోదకం, మూషిక వాహనం మొదలైనవి. గజముఖంలో తొండం, పెద్ద చెవులు, చిన్న కళ్ళు భాగాలు.

ప్రపంచ సాహిత్యంలో మొదటిది అయిన ఋుగ్వేదంలో గణపతిగానే పేర్కొనటం జరిగింది. బ్రహ్మాండ పురాణంలో ''కామేశ్వర ముఖాలోక కల్పిత శ్రీ గణేశ్వరా'' అని లలితాదేవి కల్పించినది గణేశ్వరుణ్ణే అని తెలుస్తోంది. తరువాత విఘ్నాలకి అధిపతి అయి విఘ్నేశ్వర నామాన్ని పొందటం జరిగింది. గణాలకు అధిపతి కనుక గణపతి, గణాధిపతి అనే నామాలు కలిగాయి. ఏవైనా గణములు అంటే గుంపులు, సముదాయాలు ఉంటే వాటి మీద అధికారం కలిగి, అవన్నీ ఏకోన్ముఖంగా పని చేసేట్టు చేయించ కలిగిన ప్రజ్ఞయే గణపతి. ఏకాత్మతా భావన కలిగించ గలవాడు గణపతి. ఆ ప్రజ్ఞ లేనట్టయితే సృష్టిలోని అన్ని భాగాలు దేనికవే ఉండేవి. కనుకనే సృష్టి చేసే సమయంలో బ్రహ్మ గణపతిని ప్రార్థించాడట!

డా. ఎస్.అనంతలక్ష్మి

దేవతారూపాలన్నీ ఆయా తత్త్వాలకి ప్రతీకలు. ముఖ్యంగా ప్రత్యేక రూపాలున్న మూర్తులు. గణపతి అనగానే గుర్తు వచ్చేది పెద్ద పొట్ట. దాని నిండా ఉన్నవి విద్యలు. "కోరిన విద్యలకెల్ల నొజ్జయయి యుండెడి ఓయి గణాధిప నీకు మ్రొక్కెదన్" అంటాము కదా! వొజ్జ అంటే గురువు అని అర్థం. అందుకే గణపతి పూజలో పిల్లల చేత పుస్తకాలు పెట్టించుతాము. పనిలో పనిగా గుంజీలు తీయిస్తాము. గుంజీలు తీయటం వల్ల కుదురు వస్తుంది. మెదడు చురుకుగా పని చేస్తుంది. పెద్ద చెవులు బాగా వినమని చెపుతున్నాయి. చిన్న కళ్ళు సూక్ష్మ మైన అంశాలని ఎంత నిశితంగా ఏకాగ్రతతో చూడాలో తెలియ చేస్తాయి. తొండం, ఎప్పుడు నోటిని మూసుకుని ఉండాలని తెలియ చేస్తుంది.

చంద్రుణ్ణి చూసిన దోషం తొలగటానికి శమంతకోపాఖ్యానం చదవుకోవాలనటం కూడా విశేషమే. ఆ కథని అర్థం చేసుకుంటే సమాజం ఎంత బాగుంటుందో కదా! ఏదైనా ఒక వరం ఒకరికి ఇస్తే దాన్ని వారు మాత్రమే ఉపయోగించాలి. ఇతరులకి అది ఉపయోగ పడక పోగా ప్రాణాంతకం కూడా కావచ్చును అని సత్రాజిత్తు తమ్ముడు ప్రసేనజిత్తు వృత్తాంతమ్ తెలుపుతుంది. ప్రభుత్వం వద్ద కాక వ్యక్తుల దగ్గర ధనం పోగు అయితే ప్రాణాలకే మోసం జరుగుతుందని సత్రాజిత్తు మరణం తెలుపుతుంది. ఎంతటి అవతార పురుషుడికి అయినా దోషఫలం అనుభవించక తప్పదు అని కృష్ణుడికి నీలాపనిందలు రావటం తెలియ చేస్తుంది. సర్వ మానవుల మూలాధారంలో కుండలినీ శక్తిగా ఉన్న జగన్మాతకి గుమ్మం దగ్గర కాపలా కాస్తూ ఉంటాడు. అదే పార్వతీ దేవి గుమ్మంలో కాపలా పెట్టింది అని కథలో చదువుకుంటాం. విఘ్నాధిపతి కనుక మనం చేసే పనుల్లో ఎటువంటి అడ్డంకులు రాకుండా చూడమని అన్ని కార్యాలకి ముందుగా విఘ్నేశ్వరుణ్ణి పూజించటం సంప్రదాయంగా మారింది.



గణపతి పూజ మనకి ఏం చెపుతోంది?

1 మాతా పితృభక్తి అది ఉంటే లోకాలన్నీ చుట్టి రావచ్చు. విజయం సాధించవచ్చు.



2 భౌతిక బలం కన్న బుద్ధి బలం మిన్న తమ్ముడు నెమలి వాహనం మీద ఎగురుతూ వెళ్ళాడు. తాను ఎలుకనెక్కి వెళ్ళి గెలవటం ఎంత కష్టం? కనుక బుద్ధిబలాన్ని ఉపయోగించాడు.

3 ఆకుపచ్చని ఆహారం తింటే తెలివితేటలు పెరుగుతాయి. ఆకుపచ్చరంగులో ఉన్న ఆహారం తింటే తెలివి తేటలు పెరుగుతాయి. చూపు మెరుగుగా ఉంటుంది. అందుకే గరిక తనకి పరమప్రీతి అని చెప్పాడు. బుద్ధి కావాలంటే ఆరాధించవలసింది గణపతినే. గణపతి నక్షత్రమైన హస్తకి అధిపతి బుధుడు. బుద్ధి కారకుడు బుధుడే కదా!

4 ఏకవింశతి 21 రకాల పత్రితో పూజ చేయటం ఒక్క గణపతి పూజలో మాత్రమే కనిపిస్తుంది. పిల్లలకి పత్రి సేకరణ పేరుతో చెట్లని, పర్యావరణాన్ని పరిచయం చేయటం జరుగుతుంది. అవన్నీ ఆ సమయంలో వచ్చే తరుణ వ్యాధులకి ఔషధాలు. ప్రత్యేకంగా గరిక పూజ ద్వారా గరికకి ఉన్న ప్రాధాన్యాన్ని గుర్తు చేస్తున్నాడు. గరిక పవిత్రమైనదే కాదు, భూమి ఆకృతిని పరిరక్షిస్తుంది.

5 రెండు సార్లు ఆవిరిమీద ఉడకబెట్టిన ఆహారం వానా కాలంలో మంచిది. బలం కలిగిస్తుంది. నూనెలో వేయించిన ఆహారం వానలు పడుతున్నప్పుడు అరగటం కూడా కష్టం.





6 మనలో సామర్థ్యం ఉండాలే కాని పరికరాలు ప్రధానం కాదు అని ఎలుక వంటి అతి చిన్న వాహనం ఎక్కి లోకాలన్నిటిని జయించి చూపించాడు.

సినిమా

ఈ వినాయక చవితి చాలా ప్రత్యేకం

– వైష్ణవీ చైతన్య



"నాకు చాలా చాలా ఇష్టమైన పండగ వినాయక చవితి. వినాయక విగ్రహాన్ని ఇంటివద్దకు తీసుకొచ్చేటప్పుడు, నిమజ్జనానికి తీసుకెళ్లేటప్పుడు బ్యాండ్‌కి తగ్గట్టు ఫుల్‌గా డ్యాన్స్ చేసి అలిసిపోయేదాన్ని. 'బేబీ' చిత్రంలో ఓ పాటలో వినాయకుడి విగ్రహం ముందు డ్యాన్స్ చేస్తున్నప్పుడు నాకు చిన్నతనం గుర్తొచ్చింది. ఇప్పటికి కూడా వినాయకుడి వద్ద ఉండే బ్యాండ్ సౌండ్‌కి డ్యాన్స్ చేయకుండా ఆగలేను" అని హీరోయిన్ వైష్ణవీ చైతన్య అన్నారు. 'బేబీ' సినిమాతో సూపర్‌హిట్ అందుకున్నారు తెలుగమ్మాయి వైష్ణవీ చైతన్య. నేడు వినాయక చవితి సందర్భంగా 'సాక్షి'తో ప్రత్యేకంగా ముచ్చటించారామె.. ఆ విశేషాలు...

● **ఈ ఏడాది వినాయక చవితిని ఎలా ప్లాన్ చేస్తున్నారు?**

గతంలో ప్రతిసారి నేను, తమ్ముడు ప్లాన్ చేసేవాళ్లం. కానీ, ఈ సారి మా అమ్మ, నాన్న ప్లాన్ చేస్తున్నారు. ప్రతి ఏడాది తొమ్మిది రోజులు వినాయకుణ్ణి ఇంట్లో పెట్టి పూజ చేసేవాళ్లం.. కాలనీ వాళ్లని పిలిచి అన్నదానం చేసేవాళ్లం. ప్రతి రోజూ సాయంత్రం భజనలు చేసేవాళ్లం. కుటుంబ సభ్యులు, స్నేహితులు కలిసి ఫుల్ హంగామా చేస్తూ ట్యాంక్ బండ్‌కి తీసుకెళ్లి నిమజ్జనం చేసేవాళ్లం. ఈ సారి అలాగే చేయాలనుకుంటున్నాం.

● **గత ఏడాదికీ, ఈ ఏడాదికీ మీ స్థాయిలో మార్పు వచ్చింది. గతంలో వైష్ణవీ చైతన్య అంటే ఎవరికీ పెద్దగా తెలియకపోవచ్చు. కానీ, ఇప్పుడు 'బేబీ' హీరోయిన్ అని తెలుసు.. దాన్ని ఎలా చూస్తారు?**

ప్రతి ఏడాది కొంచెం ప్రత్యేకంగా ఉంటుంది. అయితే ఈ ఏడాది ఇంకా ఎక్కువ ప్రత్యేకం. ఎందుకంటే 'బేబీ' సినిమా చేశాం.. చాలా పెద్ద హిట్ అయింది. ఎంతో మంది నుంచి యూనిట్‌కి అభినందనలు వచ్చాయి. దాంతో మేము చాలా మోటివేషన్ (ప్రేరణ) జోన్‌లో ఉన్నాం. ఇంకా అదే సంతోషంలోనే ఉన్నాం.. కాబట్టి ఈ ఏడాది ఇంకా ప్రత్యేకం అని చెప్పాలి.

● **వినాయక చవితి అంటే అమ్మాయిలు ప్రత్యేకించి లెహంగా వంటి బట్టలు కుట్టించుకోవడం చేస్తుంటారు. ఈసారి కూడా అలాంటివి ఏమైనా కుట్టించుకున్నారా?**

నా చిన్నప్పటి నుంచి నా బట్టలన్నీ మా అమ్మే కుట్టేది.. ఈసారి కూడా అమ్మే కుడుతుంది. తొమ్మిది రోజులు వినాయకుడికి ఇంట్లో పూజలు చేస్తాం కాబట్టి తొమ్మిది జతల బట్టలు కుడుతుంది. నవరాత్రులకు కూడా అలాగే చేస్తాం. నా కోసం తొమ్మిది హాఫ్ శారీస్ రెడీ చేసి పెడుతుంది మా అమ్మ.

● **హాఫ్ శారీస్ కట్టుకోవడం మీకు ఇష్టమేనా?**

చాలా ఇష్టం. ఇంట్లో ఖాళీగా కూర్చుని ఉన్నా సంప్రదాయంగా హాఫ్ శారీస్, చీరలు కట్టుకుంటాను. అవి అంటే నాకు అంత పిచ్చి. నేను జీన్స్ వేసుకోవడం చాలా తక్కువ. ఎప్పుడైనా వేసుకున్నా బొట్టు మాత్రం కచ్చితంగా పెట్టుకుంటా. మన సంప్రదాయం, బొట్టు అనేవి నాకు మంచి ప్రేరణ, నమ్మకాన్ని ఇస్తాయి.

● **చవితికి పిండి వంటలు చేయడం మీకు వచ్చా?**

నేను చేస్తాను.. నాకు బాగా వస్తాయి. పిండి వంటలు, ఉండ్రాళ్లు, పులిహోర నేను చేస్తాను. స్వీట్స్ మాత్రం అమ్మ చేస్తుంది. స్వీట్స్ అంటే నాకు ఎక్కువ ఇష్టం లేదు కాబట్టి నేను చేయను. వంటలన్నీ బాగా వండుతాను.

● **మీ అమ్మ మన సంప్రదాయాల గురించి చెబుతూ మిమ్మల్ని పెంచారా?**

మన ఇంట్లో వాళ్లు ఎలా ఉంటే మనం కూడా అలా ఉంటాం కదా! మా అమ్మ ఎప్పుడూ పూజలు, వంటలు చేస్తూ పాజిటివ్ వైబ్స్‌తో ఉండేది. ఆమెను చూస్తూ నేను కూడా నేర్చుకున్నా. నన్ను అయితే నేర్చుకో అంటూ ఎప్పుడూ ఒత్తిడి చేయదు.

● **ఇప్పుడు హీరోయిన్‌గా బిజీగా ఉన్నారు కాబట్టి వంట గదిలోకి వెళ్లే సమయం ఉండదేమో?**

అవును. 'బేబీ' తర్వాత ఆశిష్‌కి జోడీగా ఓ సినిమా, సిద్దు జొన్నలగడ్డకి జతగా ఓ చిత్రం చేస్తున్నా.

● **ఖైరతాబాద్ వినాయకుడు అంటే బాగా ఫేమస్.. అక్కడికి వెళుతుంటారా?**

ప్రతి ఏడాది వెళుతుంటాం. గత ఏడాది కూడా వెళ్లాను. ఈ ఏడాది కూడా వెళ్లాల్సిందే. 'బేబీ' సినిమా తర్వాత నేను ఎక్కడికి వెళ్లినా గుర్తు పడుతున్నారు. నన్నే కాదు.. మా కుటుంబ సభ్యులను కూడా గుర్తు పట్టి మాట్లాడటం సంతోషంగా ఉంది.

● **చిన్నప్పటి నుంచి హీరోయిన్ కావాలనే లక్ష్యం ఉండేదా? లేకుంటే వేరే ఏదైనా..?**

నాకు పదిహేనేళ్ల నుంచి సినిమా అంటే ఇష్టం ప్రారంభమైంది. సినిమా అంటే ఏంటో తెలియని వయసులో ప్రారంభమైన ఇష్టం ఇప్పుడు సినిమానే నా జీవితం అయింది.

● **మీకు సినిమా నేపథ్యం లేదు. చిత్ర పరిశ్రమలో ఎలా రాణించగలుగుతామనిపించింది? పైగా తెలుగమ్మాయి అంటే అవకాశాలు తక్కువగా ఉంటాయి కదా...**

తెలుగమ్మాయిలకు అవకాశాలు ఇవ్వరనే మాట ఎలా వచ్చిందో నాకు తెలియదు. కానీ, నేనయితే సినిమాలపై ఇష్టం, ప్రేమతో ప్రయత్నాలు చేయడం ప్రారంభించా.. ఆడిషన్స్‌కి వెళ్లేదాన్ని. నమ్మకం కోల్పోకుండా అలా ప్రయత్నించగా అవకాశాలు వచ్చాయి. దేనికైనా సమయం పడుతుంది. అది నటనే కాదు.. వేరే ఏ కెరీర్ అయినా కూడా. మనం కోరుకున్నది వచ్చే వరకు ప్రయత్నిస్తూనే ఉండాలి.

● **నటన ఒక్కటేనా? లేకుంటే డైరెక్షన్, ఇతర ఆలోచనలేమైనా ఉన్నాయా?**

నాకు చిన్నప్పటి నుంచి డ్యాన్స్ అంటే ఇష్టం. కూచిపూడి, వెస్ట్రన్ డ్యాన్స్ నేర్చుకున్నాను.

● **మీ జీవితంలో మరచిపోలేని వినాయక చవితి ఏది?**

స్కూల్‌లో చదువుతున్న సమయంలో అందరూ నిద్రపోయాక కాలనీలోని వినాయక మండపం వద్ద ఉన్న లడ్డును దొంగతనం చేయాలనుకునేవాళ్లం. తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో మండపం వద్దకు వెళ్లి లడ్డు దొంగతనం చేసి అందరికీ పంచేవాళ్లం (నవ్వుతూ).

ప్రేక్షకుల వల్లే అది సాధ్యమైంది

– నవీన్ పొలిశెట్టి



● పి.మహేశ్‌బాబు, నాగ్‌అశ్విన్, నవీన్ పొలిశెట్టి, మారుతి, విక్కీ

''మిస్‌శెట్టి మిస్టర్ పొలిశెట్టి' విడుదల రోజే ఓ పెద్ద హిందీ సినిమా(జవాన్) రిలీజ్ అవుతోందని తెలిసినప్పుడు ఆందోళన చెందాం. కానీ ఈ నెల 7 నుంచి మొదలైన ప్రీమియర్స్ నుంచి ఇప్పటి వరకూ మా సినిమాకు మంచి స్పందన లభిస్తుండటం చాలా సంతోషంగా ఉంది. ప్రేక్షకుల మౌత్‌టాక్‌తోనే ఇది సాధ్యమైంది.. మాకు పెద్ద హిట్ ఇచ్చిన వారికి ధన్యవాదాలు'' అని హీరో నవీన్ పొలిశెట్టి అన్నారు. అనుష్కా శెట్టి, నవీన్ పొలిశెట్టి జంటగా పి.మహేశ్‌బాబు దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'మిస్‌శెట్టి మిస్టర్ పొలిశెట్టి'. వంశీ, ప్రమోద్, విక్కీ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 7న విడుదలైంది. ఈ సినిమా విజయోత్సవంలో నవీన్ మాట్లాడుతూ– ''మా సినిమాను అందరికంటే ముందు చూసిన చిరంజీవిగారు హిట్ అవుతుందన్నారు.. ఆయన మాటే నిజం అయింది'' అన్నారు. ''నాకు వచ్చిన ఓ ఐడియాను నవీన్, అనుష్కలతో పాటు నిర్మాతలు నమ్మకుంటే ఈ సినిమా ఇంత సక్సెస్ అయ్యేది కాదు'' అన్నారు పి.మహేశ్‌బాబు. దర్శకులు మారుతి, నాగ్ అశ్విన్, అనుదీప్ కేవీ, నందినీ రెడ్డి, బుచ్చిబాబు, మేర్లపాక గాంధీ, ప్రొడ్యూసర్స్ అభిషేక్ అగర్వాల్, ఎస్‌కేఎన్ మాట్లాడారు.

యువతకు సందేశం

– ఎమ్మెల్యే రాజాసింగ్



● సత్యనారాయణ, రాజాసింగ్, గూడూరు నారాయణరెడ్డి, అనుశ్రేయ త్రిపాఠి

''నేటి యువతకు సందేశం ఇవ్వడానికే 'రజాకార్' సినిమా తీశారు. ఇలాంటి చిత్రం తీసే ధైర్యం చేసిన మా డైరెక్టర్ సత్యనారాయణకి థ్యాంక్స్'' అని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. బాబీ సింహా, వేదిక, అనుశ్రేయ త్రిపాఠి, ప్రేమ, ఇంద్రజ, మకరంద్ దేశ్ పాండే కీలక పాత్రల్లో యాటా సత్యనారాయణ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'రజాకార్'. సమర్ వీర్ క్రియేషన్స్‌పై గూడూరు నారాయణ రెడ్డి నిర్మించారు. ఈ సినిమా టీజర్‌ను రాజాసింగ్ విడుదల చేసి, మాట్లాడుతూ–''ఈ సినిమా టీజర్ చూస్తేనే ఎంతో కోపం వస్తోంది.. ఇక సినిమా చూస్తే ఇంకెలా ఉంటుందో ఊహించుకోండి'' అన్నారు. ''తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటకకు స్వాతంత్ర్యం వచ్చిన సెప్టెంబర్ 17 మా సినిమాకి కథా వస్తువుగా మారింది. ఆ రోజు జరిగిన విముక్తి పోరాటంతో ఈ సినిమా తీశాను'' అన్నారు యాటా సత్యనారాయణ. ''ఈ చిత్రం మన చరిత్ర గురించి అందరికీ తెలియజేస్తుందనుకుంటున్నాను'' అన్నారు గూడూరు నారాయణ రెడ్డి.

రాజ్యంకోసం మహిళ పోరాటం



● మోనిక, దేవిప్రసాద్

మోనికా రెడ్డి ప్రధాన పాత్రలో రాకేష్ రెడ్డి యాస దర్శకత్వంలో ఓ సినిమా షురూ అయింది. సుధ క్రియేషన్స్‌పై రూపొందుతున్న ఈ చిత్రం ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి అంజిరెడ్డి కెమెరా స్విచ్చాన్ చేయగా, షేడ్స్ స్టూడియో ఫౌండర్ దేవీ ప్రసాద్ బలివాడ క్లాప్ ఇచ్చారు. మోనికా రెడ్డి మాట్లాడుతూ– ''పీరియాడిక్ మైథలాజికల్‌గా రూపొందనున్న చిత్రమిది. కథ అంతా నా పాత్ర చుట్టూ తిరుగుతుంది'' అన్నారు. ''రాజ్యం కోసం ఓ మహిళ ధైర్యసాహసాలతో ఎలా పోరాడింది? అన్నదే ఈ చిత్రం కథాంశం'' అన్నారు రాకేష్ రెడ్డి యాస. ''నయనతార, అనుష్కగార్లలా మోనికకు మంచి పేరు రావాలి'' అన్నారు ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ భాస్కర్ రెడ్డి.

ఆ నమ్మకం ఉంది

– ఏయం రత్నం

''7/జీ బృందావన కాలనీ' సినిమా ఎంత హిట్ అయిందో తెలిసిందే. ఇప్పుడు మళ్లీ రీ రిలీజ్‌లో కూడా అంతే పెద్ద విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది. రవి హీరోగా సెల్వారాఘవన్ దర్శకత్వంలోనే '7/జీ బృందావన కాలనీ' రెండో భాగాన్ని అక్టోబర్ నుంచి ప్రారంభిస్తున్నాం'' అని నిర్మాత ఏయం రత్నం అన్నారు. రవికృష్ణ, సోనియా అగర్వాల్ జంటగా నటించిన చిత్రం '7/జీ బృందావన కాలనీ'. సెల్వారాఘవన్ దర్శకత్వంలో ఏయం రత్నం నిర్మించిన ఈ చిత్రం 2004లో విడుదలై సూపర్ హిట్‌గా నిలిచింది. ఈ సినిమాను ఈ నెల 22న రీ రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా రీ రిలీజ్ ట్రైలర్ లాంచ్ వేడుకలో రవికృష్ణ మాట్లాడుతూ– ''ట్రైలర్ చూడగానే మళ్లీ రవి పాత్రలోకి వెళ్లిపోయాను. ఈ సినిమా రెండో భాగానికి ముందు మరోసారి '7/జీ బృందావన కాలనీ' మ్యాజిక్ చూపించేలా ఈ చిత్రం రీ రిలీజ్ జరుగుతోంది'' అన్నారు. ఈ కార్యక్రమంలో హీరో సోనియా అగర్వాల్, నటుడు సుమన్ శెట్టి మాట్లాడారు.



● సుమన్ శెట్టి, రవికృష్ణ, ఏయం రత్నం, సోనియా

అతని తెలివితేటలు అపారం!



● హర్ష సాయి, మిత్ర, బాలచంద్ర


హర్ష సాయి హీరోగా నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'మెగా'. మిత్ర ఈ మూవీలో హీరోయిన్‌గా నటిస్తూ, నిర్మిస్తున్నారు. తాజాగా సినిమా టీజర్‌ను విడుదల చేశారు. 'ఈ కథ రాక్షసులతో నిండిన సముద్రాన్నే కుదిపేసే రాజైన మనిషిది', 'అతని తెలివితేటలు అపారం' వంటి డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి. హర్ష సాయి మాట్లాడుతూ– ''మంచి కథలు చెప్పడానికి ప్రస్తుతం ఉన్న పెద్ద మాధ్యమం సినిమా. నేను చిత్రాలను ఎంచుకోవడానికి ఇదే తొలి కారణం. అలాగే యువ ప్రతిభను ప్రోత్సహించాలనుకోవడం మరో కారణం'' అన్నారు. హీరోయిన్, నిర్మాత మిత్ర మాట్లాడుతూ– ''చిన్న ఆలోచనగా మొదలైన ఈ ప్రాజెక్ట్ చాలా భారీ స్థాయికి వెళ్లింది. 2024లో ఈ సినిమాను విడుదల చేస్తాం'' అన్నారు. ఈ సినిమాకు సంగీతం: వికాస్ బాడిసా, కెమెరా: కార్తీక్ పళని, సమర్పణ: కల్వకుంట్ల వంశీధర్‌రావు, సహ నిర్మాత: పడవల బాలచంద్ర.

నీతోనే నేను..



● మనోజ్‌కుమార్, బుచ్చిబాబు, బాబా పీఆర్


సూర్య భరత్ చంద్ర, విషిక కోట జంటగా బాబా పీఆర్ దర్శకత్వంలో మనోజ్ కుమార్ అగర్వాల్ నిర్మించిన చిత్రం 'అష్టదిగ్బంధనం'. 'ఎ గేమ్ విత్ క్రైమ్' అనేది ఉపశీర్షిక. ఈ సినిమా ఈ నెల 22న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమాలోని 'ఐ యామ్ విత్ యూ' (నీతోనే నేను) పాట లిరికల్ వీడియోను దర్శకుడు బుచ్చిబాబు విడుదల చేసి, మాట్లాడుతూ – ''ఈ పాట కమర్షియల్‌గా ఉంది. సూర్య, విషిక చాలా బాగా చేశారు. సినిమా హిట్ కావాలి'' అన్నారు. ''మా సినిమాను ప్రేక్షకులు ఆదరించాలి'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: జాక్సన్ విజయన్.


'తెలుగువారి గుండెచప్పుడు
వినగలిగే ఆత్మీయుడిగా ఉంటే చాలు...
నా జన్మ ధన్యమైనట్టే'

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 5.50
సంపుటి: 16
సంచిక: 179


సోమవారం 18-9-2023
పాఠకులు, ఏజెంట్లు, ప్రకటనకర్తలు, శ్రేయోభిలాషులకు
సాక్షి
వినాయక చవితి శుభాకాంక్షలు

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



నేటి నుంచి పార్లమెంట్ భేటీ
పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. కీలక బిల్లులు సభ ముందుకు రానున్నాయి.
వివరాలు 6లో ▸



అమెరికాలో భూమికి పగుళ్లు!
అమెరికాలో నేలపై పుట్టుకొస్తున్న మైళ్లకొద్దీ పొడవైన భారీ పగుళ్లు వెన్నులో వణుకు పుట్టిస్తున్నాయి.
వివరాలు 6లో ▸



సువర్ణాక్షరాలతో రాసే రోజు..
హైదరాబాద్ విమోచన దినోత్సవం సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ రోజని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు.
వివరాలు 5లో ▸



'స్కిల్' సూత్రధారి చంద్రబాబే
ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో ప్రధాన సూత్రధారి అని తేలినందునే చంద్రబాబును అరెస్ట్ చేశామని ఏపీ సీఐడీ స్పష్టం చేసింది.
వివరాలు 12లో ▸

ఆదివారం సాయంత్రం రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలో 'కాంగ్రెస్ విజయభేరి' బహిరంగ సభకు హాజరైన ప్రజలకు అభివాదం చేస్తున్న సోనియా, రాహుల్ గాంధీ



మీకు మిగిలింది 100 రోజులే!

బీఆర్ఎస్ గద్దె దిగడం ఖాయం: రాహుల్

తుక్కుగూడ 'విజయభేరి' సభలో కాంగ్రెస్ అగ్రనేత ప్రసంగం

కాంగ్రెస్‌ను అడ్డుకునేందుకు బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం కుట్ర

ఆ మూడు పార్టీలూ ఒకటే.. కలిసే పనిచేస్తున్నాయి

- ➤ ప్రజల సొమ్మును దోచుకుంటున్న బీఆర్ఎస్, సీఎం కేసీఆర్‌పై చర్యలేవి?
- ➤ ప్రజల ఆకాంక్షలను గుర్తించి కాంగ్రెస్ ప్రత్యేక రాష్ట్రం ఇచ్చింది
- ➤ కానీ అన్ని ప్రయోజనాలూ ఒక్క కేసీఆర్ కుటుంబానికే అందుతున్నాయి
- ➤ మేం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు హామీలు అమలు చేస్తాం

2లో

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం నా కల

అన్ని వర్గాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ పనిచేస్తుంది: సోనియాగాంధీ

ప్రజలంతా తమకు అండగా నిలవాలని విజ్ఞప్తి

మహిళల సాధికారత కోసం 'మహాలక్ష్మి' పథకం అమలు చేస్తామని హామీ



మోదీ, కేసీఆర్ ఇద్దరూ ఒక్కటే : ఖర్గే
- అంతర్గతంగా కలిసిపోయారు.. బయటికి మాత్రం విమర్శలు
- మేం ఓట్ల కోసం తెలంగాణ ఇవ్వలేదు.. ఇక్కడి ప్రజల ఆకాంక్షను అర్థం చేసుకుని ఇచ్చాం 2లో
- తెలంగాణలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తెద్దామని పిలుపు

ఎన్నికలకు సై..!
- త్వరలో ఎన్నికలు జరిగే ఐదు రాష్ట్రాల్లో విజయం ఖాయం
- ఏప్రిల్, మేలో జరిగే లోక్‌సభ ఎన్నికలకూ సిద్ధంగా ఉన్నాం
- సీడబ్ల్యూసీ సమావేశాల్లో ఐదు రాష్ట్రాల ఎన్నికలపై చర్చ
- గెలుపు ధీమాతో ముగిసిన కాంగ్రెస్ కీలక భేటీ 3లో

కాంగ్రెస్ 6 గ్యారంటీలు

1 మహాలక్ష్మి
- మహిళలకు ప్రతి నెలా రూ.2,500 ఆర్థిక సాయం. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం
- రూ.500కే వంట గ్యాస్ సిలిండర్

2 రైతు భరోసా
- రైతులు, కౌలురైతులకు ఏటా ఎకరాకు రూ.15 వేల పంట పెట్టుబడి సాయం
- వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12,000 ఆర్థిక సాయం
- వరికి మద్దతు ధరపై అదనంగా ప్రతి క్వింటాల్‌కు రూ.500 బోనస్

3 గృహ జ్యోతి
- ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్

4 ఇందిరమ్మ ఇళ్లు
- ఇల్లు లేనివారికి ఇంటి స్థలం
- ఇల్లు కట్టుకోవడానికి రూ.5 లక్షలు ఆర్థిక సాయం
- ఉద్యమకారుల కుటుంబాలకు 250 చదరపు గజాల స్థలం. ఇల్లు నిర్మాణం

5 యువ వికాసం
- విద్యార్థులకు రూ.5 లక్షల వడ్డీ రహిత విద్యా భరోసా కార్డు: కాలేజీ, హాస్టల్, పరీక్షలు, కోచింగ్ ఫీజులు, విదేశీ చదువుల ఖర్చులు, పుస్తకాలు, ల్యాప్‌టాప్, పరిశోధన, విద్యా పరికరాలు వంటివాటి కొనుగోలు, ఇతర విద్యా సంబంధిత చెల్లింపులు చేసుకొనే సదుపాయం
- ప్రతీ మండలంలో తెలంగాణ ఇంటర్నేషనల్ స్కూల్స్ ఏర్పాటు

6 చేయూత
- నెలకు రూ.4,000 చొప్పున సామాజిక పింఛన్లు..
- రూ.10 లక్షల వరకు రాజీవ్ ఆరోగ్యశ్రీ బీమా

అలవికాని హామీలు.. అబద్ధపు ఆరోపణలు



- విజయభేరి సభపై మంత్రి హరీశ్‌రావు విమర్శలు
- కాంగ్రెస్‌కు ఓట్లు పడతాయనే గ్యారంటీనే లేదని ఎద్దేవా
- అధికారంలోకి వచ్చే అవకాశం లేకనే బూటకపు హామీలిచ్చారని ధ్వజం
- కాంగ్రెస్ గ్యారంటీలన్నీ కేసీఆర్ అమలు చేస్తున్న పథకాల నుంచి కాపీ కొట్టినవేనని విమర్శ

- వివరాలు 2లో

సెలవు
వినాయక చవితి సందర్భంగా నేడు (సోమవారం) సాక్షి కార్యాలయానికి సెలవు. కావున మంగళవారం సంచిక వెలువడదు. పునర్దర్శనం బుధవారం.


ఆదివారం అసెంబ్లీ వద్దనున్న గన్‌పార్క్‌లో అమరవీరుల స్తూపానికి నివాళులర్పిస్తున్న సీఎం కేసీఆర్

ప్రగతి నిరోధక శక్తులకు.. పరాజయమే

మన సమైక్యతే మనకు బలం.. బంగారు తెలంగాణ సాధనకు ఒక్కటై కృషి చేద్దాం: సీఎం కేసీఆర్

అనేక రంగాల్లో దేశంలోనే నంబర్ వన్‌గా తెలంగాణ

మరో మూడు నాలుగేళ్లలో ప్రాజెక్టుల మిగులు పనులన్నీ పూర్తి

లక్ష్యం మేరకు కోటీ 25 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తాం

రాష్ట్రంలో పేదరికం తగ్గింది.. వ్యవసాయం పండుగగా మారింది

నిరంతరంగా డబుల్ బెడ్రూం ఇళ్ల పథకం కొనసాగుతుందని వెల్లడి

తెలంగాణ జాతీయ సమైక్యతా దినోత్సవం పేరిట వేడుకలు

పబ్లిక్ గార్డెన్స్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించి ప్రసంగించిన సీఎం

సాక్షి, హైదరాబాద్: దేశంలో ఏనాడో స్థిరపడిన పెద్ద రాష్ట్రాలను తలదన్నేలా తెలంగాణ ప్రగతి రథచక్రాలు దూసుకుపోతున్నాయని.. దేశంలో ఎక్కడ, ఎవరినోట విన్నా తెలంగాణ మోడల్ మార్మోగుతోందని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు చెప్పారు. తెలంగాణ ప్రజలందరి చల్లని దీవెనలతో ఈ ప్రగతి రథచక్రాలు మరింత జోరుగా ముందుకు సాగుతూనే ఉంటాయని.. దీనికి అడ్డుపడాలని ప్రయత్నించే ప్రగతి నిరోధక శక్తులు పరాజయం పాలుకాక తప్పదని పేర్కొన్నారు. మన సమైక్యతే మనకు బలమని.. జాతీయ సమైక్యతా దినోత్సవ వేళ బంగారు తెలంగాణ సాధనకు ఒక్కటిగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. హైదరాబాద్ స్టేట్ భారత యూనియన్‌లో కలసిన 'సెప్టెంబర్ 17' సందర్భంగా ఆదివారం రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ జాతీయ సమైక్యతా దినోత్సవం పేరిట వేడుకలు నిర్వహించింది. ఇందులో భాగంగా సీఎం కేసీఆర్ తొలుత అసెంబ్లీ ఎదుట ఉన్న గన్‌పార్క్‌లోని అమరవీరుల స్తూపం వద్ద

మిగతా 5వ పేజీలో ▶

మరో నాలుగేళ్లలో 1.25 కోట్ల మాగాణగా..

తెలంగాణ వచ్చాక రాష్ట్ర ప్రభుత్వం నెట్టెంపాడు, భీమా, కల్వకుర్తి, కోయిల్‌సాగర్ వంటి ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేసి, 10 లక్షల ఎకరాలకు నీరందిస్తోంది. వీటితోపాటు కాళేశ్వరం, పాలమూరు, సీతమ్మసాగర్, సమ్మక్కసాగర్ వంటి ప్రధాన ఎత్తిపోతల పథకాల ద్వారా 75లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఇతర భారీ, మధ్యతరహా ప్రాజెక్టులు, చెరువుల ద్వారా మరో 50 లక్షల ఎకరాలు సాగవుతాయి. మొత్తంగా మరో నాలుగేళ్లలో కోటీ 25 లక్షల ఎకరాలకు నీరందించాలన్న లక్ష్యం నెరవేరుతుంది. రాష్ట్రంలో ఇప్పటికే 24 గంటల ఉచిత విద్యుత్, విత్తనాలు, ఎరువుల సరఫరా, రైతుబంధు, రైతు బీమా, రుణమాఫీతో వ్యవసాయం పండుగగా మారింది.

సిరాజ్ సిక్సర్

6 వికెట్లతో చెలరేగిన పేస్ బౌలర్

ఒకే ఓవర్లో 4 వికెట్లు తీసిన హైదరాబాదీ

ఆసియా కప్ ఎనిమిదోసారి గెలుచుకున్న భారత్

ఫైనల్లో శ్రీలంక 50 ఆలౌట్

10 వికెట్లతో టీమిండియా ఘన విజయం

- వివరాలు 10లో




ఆదివారం ఢిల్లీలోని 'యశోభూమి'లో ఏర్పాటు చేసిన ఓ స్టాల్ వద్ద ప్రధాని మోదీ

'పీఎం విశ్వకర్మ'కు శ్రీకారం
- రూ. 13 వేల కోట్లతో పథకాన్ని అమలు చేస్తామన్న ప్రధాని మోదీ
- సంప్రదాయ వృత్తి కళాకారులు, కార్మికులకు అండగా నిలుస్తామని వెల్లడి
- పూచీకత్తులేని రుణాలతో వారికి మరింత తోడ్పాటు అందిస్తామని ప్రకటన
- దేశ ప్రజల జీవనంలో విశ్వకర్మల పాత్ర కీలకమని వ్యాఖ్య
- 'మేకిన్ ఇండియా'కు విశ్వకర్మలు గర్వకారణమని కితాబు - 6లో

వచ్చే నెల మొదటివారంలో రాష్ట్రానికి మోదీ?
ఉమ్మడి మహబూబ్‌నగర్, నిజామాబాద్ జిల్లాల్లో అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం -5లో

చరిత్రను తప్పుగా చిత్రీకరిస్తే ప్రజలే బుద్ధి చెబుతారు

వాస్తవాలను మరుగున పడేస్తే చరిత్రే ఉండదు: అమిత్ షా

దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక 399 రోజుల వరకు హైదరాబాద్ స్టేట్‌లో రజాకార్ల అరాచకం సాగింది. వీటి నుంచి విముక్తికి సర్దార్ పటేల్ 1948 ఆగస్టు 10న సంకల్పించి సెప్టెంబర్ 17 నాటికి మిషన్ పూర్తి చేశారు -అమిత్ షా



విమోచనను అధికారికంగా నిర్వహించకపోవడం సరికాదు

మన పూర్వీకులు కలలుగన్న తెలంగాణ నిర్మాణమే లక్ష్యంగా పనిచేద్దామని పిలుపు

కాళోజీ, మర్రి చెన్నారెడ్డి, పీవీ, బూర్గుల పేర్ల ప్రస్తావన

విమోచన దినోత్సవంలో పాల్గొన్న కేంద్ర హోంమంత్రి

సాక్షి, హైదరాబాద్: సంతుష్టీకరణ రాజకీయాల కోసం వాస్తవాలను మరుగున పడేస్తే చరిత్రే ఉండదని బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. తెలంగాణ చరిత్రను తప్పుగా చిత్రీకరించేందుకు యత్నిస్తున్న వారికి ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. హైదరాబాద్ స్టేట్‌కు స్వాతంత్ర్యం రాకుండా స్వతంత్ర రాజ్యంగా ఉంటే.. భారతమాత కడుపులో కేన్సర్ ఉన్నట్లేనని గుర్తించిన సర్దార్ వల్లభాయ్ పటేల్ ఈ ప్రాంతానికి రజాకార్ల నుంచి విముక్తి కల్పించేందుకు 'ఆపరేషన్ పోలో'కు నడుం బిగించారన్నారు. రక్తం చుక్క చిందకుండానే.. నిజాం మెడలు వంచి హైదరాబాద్ స్టేట్‌కు స్వాతంత్ర్యం ఇప్పించారన్నారు. కేఎం మున్షీ నేతృత్వంలో, పటేల్ ఆదేశాలతో ఈ ఆపరేషన్ జరిగిందని చెబుతూ వారికి నివాళులు అర్పిస్తున్నామన్నారు. పటేల్ కృషి లేకపోతే భారత్‌లో హైదరాబాద్ స్టేట్‌తో సహా వందలాది సంస్థానాల విలీనం ఆలస్యమై ఉండేదన్నారు.

ఈ సందర్భంగా తెలంగాణతోపాటు కల్యాణ కర్ణాటక, మరాఠా మహారాష్ట్ర ప్రాంత ప్రజలకు శుభాకాంక్షలు చెబుతున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక కూడా రాజకీయాల కారణంగా విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించకపోవడం సరికాదని చెప్పారు. ఆదివారం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో 75వ హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని అమిత్‌షా జాతీయజెండాను ఎగురవేశారు. సీఆర్‌పీఎఫ్, సీఐఎస్ఎఫ్ తదితర కేంద్ర బలగాల నుంచి పోలీసు వందనాన్ని స్వీకరించారు.

రావి, ఎల్లారెడ్డి పేర్ల ప్రస్తావన

హైదరాబాద్ స్టేట్ విమోచన కోసం పోరాడి, ఎన్నో త్యాగాలు చేసిన

మిగతా 5వ పేజీలో ▶


పరేడ్ గ్రౌండ్స్ వేడుకల్లో సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అమిత్ షా



ఆరు గ్యారంటీ పథకాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రాహుల్ గాంధీ, ఖర్గే. చిత్రంలో మధుయాష్కీ గౌడ్, అంజన్ కుమార్ యాదవ్, దామోదర రాజనర్సింహ, అశోక్ గెహ్లోత్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి, సుబ్బరామిరెడ్డి, కేసీ వేణుగోపాల్, ఠాక్రే, భట్టి విక్రమార్క, పొన్నాల లక్ష్మయ్య, జీవన్‌రెడ్డి తదితరులు



రాహుల్ గాంధీతో గద్దర్ కుటుంబం

సోనియా త్యాగంతోనే తెలంగాణ వచ్చింది

కేసీఆర్ నిరాహారదీక్షలతో రాష్ట్రం సిద్ధించలేదు: గద్దర్ సతీమణి విమల

లక్డీకాపూల్ (హైదరాబా ద్): సోనియా గాంధీ త్యాగంతోనే ప్రత్యేక తెలంగాణ వచ్చిందని దివంగత ప్రజాగాయకుడు గద్దర్ సతీమణి విమల అన్నారు. ఆమె త్యాగనిరతి ఏంటో తనకు తెలుసని స్పష్టం చేశారు. సీడబ్ల్యూసీ సమావేశాలలో పాల్గొనేందుకు హైదరాబాద్ వచ్చిన సోనియా గాంధీ ఆదివారం గద్దర్ కుటుంబాన్ని ఓదార్చారు. ఆరోగ్య కారణాల రీత్యా సోనియా తాను బస చేసిన తాజ్ కృష్ణా హోటల్‌కే విమలను పిలిపించుకున్నారు. ఆమెతో పాటు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలు కూడా గద్దర్ కుటుంబాన్ని ఓదార్చారు. ఈ సందర్భంగా సోనియా గాంధీ మాట్లాడుతూ.. ప్రజల హక్కుల కోసం గద్దర్ చేసిన పోరాటాలను కొనియాడారు. రాహుల్ స్పందిస్తూ.. గద్దర్ తనకు అత్యంత ప్రియమైన వ్యక్తి అని సోనియా, ప్రియాంకలకు చెప్పారు. ఆయన గద్దర్ కుటుంబానికి ధైర్యం చెప్పారు. అనంతరం విమల మీడియాతో మాట్లాడుతూ.. త్యాగమంటే ఏంటో సోనియాకు తెలుసు కాబట్టే ఆమెను కలవాలనుకున్నానని చెప్పారు. ఆ త్యాగం కేసీఆర్‌కు తెలియదని, ఆయన నిరాహార దీక్షలతో తెలంగాణ సిద్ధంగా లేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ మాత్రమే రాజ్యాంగాన్ని పరిరక్షిస్తుందని విమల స్పష్టం చేశారు.

నేటి భవితలో..

- యూపీఎస్సీ ఈఎస్ఈ 2024: ఇంజనీరింగ్ సర్వీస్.. సక్సెస్ ఇలా
ఇంజనీరింగ్ సర్వీసెస్ ఎగ్జామినేషన్.. సంక్షిప్తంగా ఈఎస్ఈ! కేంద్ర ప్రభుత్వ శాఖల్లో.. గ్రూప్-ఎ, గ్రూప్-బి హోదాలో ఉన్నత స్థాయి ఇంజనీరింగ్ పోస్టుల భర్తీకి యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) నిర్వహించే పరీక్ష! తాజాగా ఈఎస్ఈ–2024 నోటిఫికేషన్ విడుదలైంది. యూపీఎస్సీ మూడంచెల్లో ఎంపిక ప్రక్రియ నిర్వహించనుంది. ఈ నేపథ్యంలో.. ఈఎస్ఈ పోస్టుల వివరాలు, అర్హతలు, ఎంపిక విధానం, సిలబస్ విశ్లేషణ, ప్రిపరేషన్ తదితర వివరాలు..
- గ్రూప్స్ ప్రత్యేకం-కరెంట్ అఫైర్స్: పోటీ పరీక్షల అభ్యర్థులకు ఉపయోగపడేలా.. అంతర్జాతీయం, జాతీయం, రాష్ట్రీయం, వార్తల్లో వ్యక్తులు, క్రీడలు తదితర ముఖ్యాంశాలతో వీక్లీ కరెంట్ అఫైర్స్ రౌండప్.
- విద్య, ఉద్యోగ సమాచారం

నేటి భవిత పేజీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి



..ఊరుకోండి సార్! వాళ్లకు లేనిపోని ఐడియాలిస్తున్నారు!

మీకు మిగిలింది 100 రోజులే!

మేం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు హామీలు అమలు చేస్తాం: రాహుల్

అన్ని వర్గాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ పనిచేస్తుంది: సోనియాగాంధీ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో బీఆర్ఎస్‌కు బీజేపీ, ఎంఐఎం సహా ఎవరు మద్దతుగా వచ్చినా సరే వంద రోజుల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం దిగిపోవడం ఖాయమని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ కేవలం బీఆర్ఎస్‌తోనే కొట్లాడటం లేదని.. బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎంలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తోందని చెప్పారు. ఈ మూడు పార్టీలు కలిసే పనిచేస్తున్నాయని.. కాంగ్రెస్‌ను అడ్డుకునేందుకు కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలో ఆదివారం సాయంత్రం జరిగిన 'కాంగ్రెస్ విజయభేరి' సభలో రాహుల్ గాంధీ ప్రసంగించారు. అటు కేంద్రంలోని బీజేపీ, మోదీ ప్రభుత్వ విధానాలతోపాటు రాష్ట్రంలో కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ పాలనపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దేశంలో బీజేపీ విస్తరింపజేస్తున్న హింసను, విద్వేషాన్ని అడ్డుకుని ప్రేమను పంచేందుకు తాము 'విద్వేషపు మార్కెట్లో ప్రేమ దుకాణం' తెరిచామని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది తామేనని.. ఆ వెంటనే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని ప్రకటించారు. విజయభేరి సభలో రాహుల్ గాంధీ ప్రసంగం ఆయన మాటల్లోనే..

''బీఆర్ఎస్ అంటే బీజేపీ రిష్తేదార్ (బంధువుల) సమితి. పార్లమెంటులో బీజేపీకి అవసరమైన ప్రతీ సందర్భంలో బీఆర్ఎస్ మద్దతు పలకడం నా కళ్లతో చూశాను. కిసాన్ బిల్లులు, రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికలు, జీఎస్టీ తదితరాలపై నరేంద్ర మోదీ ఒక్క సైగతోనే బీఆర్ఎస్ మద్దతు పలికింది. ఈ రోజు తుక్కుగూడ బహిరంగ సభ జరుపుతుంటే ఆ మూడు పార్టీలు ఒకేసారి సభలు నిర్వహించి కాంగ్రెస్‌కు అంతరాయం కలిగించాలనుకున్నారు. కానీ తెలంగాణలో కాంగ్రెస్ బలంగా ఉండటం వల్ల మా బహిరంగ సభ విజయవంతమైంది. రాజకీయాల్లో ఎవరితో కొట్లాడుతున్నామో, మనకు వ్యతిరేకంగా నిలిచే శక్తులేంటో పూర్తి అవగాహనతో ఉండాలి.

కేసీఆర్‌పై కేసులు పెట్టడం లేదేం?

కాంగ్రెస్‌ను అడ్డుకునేందుకు కొత్త మార్గాల కోసం బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం మూడు పార్టీలు పరస్పరం ఫోన్లు చేసుకుంటాయి. మేం ఎక్కడ బీజేపీతో కొట్లాడుతామో ఆయా రాష్ట్రాలకు ఎంఐఎం వచ్చి అంతరాయం కలిగిస్తుంది. ఈ మూడు పార్టీలు భాగస్వాములుగా మారి ప్రజలకు నష్టం చేస్తున్నాయి. ఈడీ, సీబీఐ, ఐటీ వంటి సంస్థలను అడ్డుపెట్టుకుని ప్రతిపక్ష నేతలపై కేసులు నమోదు చేస్తున్న మోదీ ప్రభుత్వం.. అవినీతిలో అన్ని రికార్డులు బద్దలుకొట్టిన కేసీఆర్‌కు వ్యతిరేకంగా ఒక్క కేసూ పెట్టడం లేదేం? ఎంఐఎం నేతలపైనా ఎలాంటి కేసులు పెట్టడం లేదేం? కేవలం విపక్షాలపైనే దాడులు ఎందుకు జరుగుతున్నాయి? కేసీఆర్‌ను, ఎంఐఎంను తనవారిగా భావిస్తున్నందునే ప్రధాని మోదీ వారిపై ఎలాంటి కేసులు నమోదు చేయడం లేదు.

ఒక్క కుటుంబం కోసం ఇవ్వలేదు

కేసీఆర్ లాభం కోసం, ఒక్క కుటుంబం కోసం మేం తెలంగాణ రాష్ట్రాన్ని ఇవ్వలేదు. పేదలు, రైతులు, మహిళలు, కూలీల కోసం తెలంగాణ ఇచ్చాం. కానీ ఇక్కడ అన్ని ప్రయోజనాలు సీఎం కుటుంబానికే అందుతున్నాయి. కానీ కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రజల గురించి ఆలోచిస్తుంది. ఎన్ని అవాంతరాలు వచ్చినా ఇచ్చిన మాటకు కట్టుబడి సోనియా తెలంగాణ ఇచ్చారు. ఇటీవలే పొరుగు రాష్ట్రం కర్ణాటకలో ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను కూడా కాంగ్రెస్ అధికారంలోకి రాగానే నెరవేర్చింది. తెలంగాణలో ఇచ్చిన ఆరు హామీలను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే అమలు చేస్తాం'' అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం నా కల: సోనియా

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని చూడటం తన కల అని, తెలంగాణలోని అన్ని వర్గాల కోసం కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందని కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ చెప్పారు. కాంగ్రెస్‌కు ప్రజలంతా మద్దతుగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. ఆదివారం తుక్కుగూడ విజయభేరి సభలో సోనియాగాంధీ మాట్లాడారు. కాంగ్రెస్ గ్యారంటీల్లో ఒకటైన 'మహాలక్ష్మి' పథకాన్ని ప్రకటించిన ఆమె.. కొన్ని నిమిషాల్లోనే తన ప్రసంగాన్ని ముగించారు. ''నా సహచర నేతలతో కలసి తెలంగాణ వంటి గొప్ప రాష్ట్రానికి జన్మనివ్వడం ఎంతో సంతోషంగా ఉంది. ఈ రాష్ట్రాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్లడం ఇప్పుడు మా విధి. ఈ చారిత్రక దినోత్సవ సందర్భంలో మీతో ఉన్నందుకు ఎంతో సంతోషిస్తున్నాను. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు ఆరు గ్యారంటీలు ఇస్తున్నాం. అందులో 'మహాలక్ష్మి' పథకం మొదటిది. తెలంగాణ సోదరీమణులకు సాధికారత కల్పించే ఈ ప్రకటన చేస్తున్నందుకు ఎంతో సంతోషిస్తున్నా. 'మహాలక్ష్మి' పథకం ద్వారా మహిళలకు ప్రతీ నెలా రూ.2,500 ఆర్థిక సాయం అందిస్తాం. రూ.500కే వంట గ్యాస్ సిలిండర్‌ను ఇవ్వబోతున్నాం. మహిళలకు ఆర్టీసీ బస్సులలో రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తాం'' అని సోనియా హామీ ఇచ్చారు. తెలంగాణ సోదర సోదరీమణులారా అంటూ ప్రసంగం ప్రారంభించిన సోనియా.. 'జై హింద్.. జై తెలంగాణ' నినాదంతో ముగించారు.

ప్రజల సొమ్మంతా కేసీఆర్ కుటుంబం చేతిలోకి..

దేశంలో అదానీ లబ్ధికోసం మోదీ ప్రభుత్వం పనిచేస్తోంది. ఈ విషయాన్ని లోక్‌సభలో మాట్లాడినందుకు నా పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేశారు. ఇక్కడ సీఎం కేసీఆర్ తెలంగాణ ప్రభుత్వ సొమ్మును తన కుటుంబానికి కట్టబెడుతున్నారు. కేసీఆర్ తన మద్దతుదారు కాబట్టే ఇక్కడ జరుగుతున్న అవినీతిపై మోదీ విచారణ జరిపించడం లేదు. కేసీఆర్ ప్రభుత్వం ఏళ్లుగా ప్రజల సొమ్మును దోపిడీ చేస్తోంది. కాళేశ్వరంలో రూ.లక్ష కోట్ల దోపిడీ జరిగింది. ధరణి పోర్టల్ తెచ్చి ప్రజలు, దళితుల భూములు లాక్కున్నారు. రైతుబంధుతో పెద్ద రైతులకే లాభం జరుగుతోంది. పేదలకు ఇళ్లు నిర్మించలేదు, పబ్లిక్ సర్వీస్ కమిషన్ పేపర్లను లీక్ చేశారు, 2 లక్షల ఉద్యోగ ఖాళీల భర్తీ ఊసే లేదు. ఇవన్నీ ప్రజల సొమ్మును దోపిడీ చేసేందుకు కేసీఆర్ ప్రభుత్వం ఎంచుకున్న మార్గాలు. మేం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజల సొమ్మును వాపస్ చేస్తాం.

అలవికాని హామీలు.. అబద్ధపు ఆరోపణలు

కాంగ్రెస్ ఇచ్చే గ్యారంటీలు దేవుడెరుగు.. అసలు కాంగ్రెస్ గెలుస్తుందన్న గ్యారంటీయే లేదు

- విజయభేరి సభపై మంత్రి హరీశ్‌రావు విమర్శలు



సాక్షి, హైదరాబాద్: అలవికాని హామీలు.. అబద్ధాల ఆరోపణలు.. చరిత్ర వక్రీకరణలతో కాంగ్రెస్ సభ సాంతం పరనిందగా సాగిందని రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీశ్‌రావు అన్నారు. కాంగ్రెస్ ఇచ్చే గ్యారంటీలు దేవుడెరుగు, అసలు కాంగ్రెస్‌కే ఓట్లు పడతాయనే గ్యారంటీ లేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన విజయభేరి బహిరంగసభపై హరీశ్‌రావు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. అధికారంలోకి వచ్చే అవకాశం లేదు కాబట్టే కాంగ్రెస్ నాయకులు బూటకపు హామీలను ఇస్తున్నారని, ఆ పార్టీ ఇస్తున్న గ్యారంటీలు అన్నీ సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న పథకాల్లో నుంచి కాపీ కొట్టినవేనని విమర్శించారు. కాంగ్రెస్ జాతీయ పార్టీ అయితే..రాష్ట్రానికో మేనిఫెస్టో కాకుండా, హైదరాబాద్ సభలో చెప్పిన గ్యారంటీలు అమలు చేస్తామని ఎందుకు చెప్పలేకపోతున్నారు? సీడబ్ల్యూసీలోనే తీర్మానం చేయవచ్చు కదా.. ఎందుకు చేయలేదు? తెలంగాణలో ఇచ్చినట్టు మీరు దేశవ్యాప్తంగా రైతుబంధు, రైతు బీమా, దళితబంధు పథకాలు ఇస్తారా అని హరీశ్‌రావు ప్రశ్నించారు. 2014లో కాంగ్రెస్ ఇలానే బూటకపు హామీలిస్తే ఆ పార్టీకి దేశవ్యాప్తంగా 44 ఎంపీ సీట్లు వచ్చాయని, 2019లో 52 ఎంపీ సీట్లు వచ్చాయని గుర్తు చేశారు. రాహుల్ గాంధీ అజ్ఞానానికి జోహార్లు అని, రాష్ట్రపతి ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ బీజేపీకి మద్దతు ఇవ్వలేదని, యశ్వంత్ సిన్హాకు మద్దతు ఇచ్చామని చెప్పారు. కావాలంటే పేపర్లు తిరగేసి తెలుసుకోవాలని సూచించారు. 'ఎవరు ఎవరితో కుమ్మక్కయ్యారో తెలియదా? గుజరాత్ ఎన్నికలపుడు భారత్ జోడో యాత్ర గుజరాత్‌కు ఎందుకు వెళ్లలేదు..? హుజూరాబాద్, మునుగోడు అసెంబ్లీకి ఎన్నికలు జరిగితే కాంగ్రెస్ పార్టీ నేరుగా.. సిగ్గులేకుండా బీజేపీకి మద్దతివ్వడం మీకు తెలియదా? ఈడీ, సీబీఐలు వేటకుక్కల్లా మా నేతలను వేధించడం మీకు కనిపిస్తలేదా' అని హరీశ్‌రావు ప్రశ్నించారు. నేషనల్ హెరాల్డ్ కేసు ఎందుకు అటకెక్కిందో చెప్పాలని డిమాండ్ చేశారు. బీజేపీ, కాంగ్రెస్ మిలాఖత్ అవడం అన్నది ప్రపంచానికి తెల్సిన విషయమేనని అన్నారు. తెలంగాణ ఎవరి దయతోనూ రాలేదని, పోరాడి గెలుచుకున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ దయతో ఇచ్చి ఉంటే వందలాది మంది యువకులు ఎందుకు బలిదానం చేసుకున్నారో సమాధానం చెప్పాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

ప్రియాంకా గాంధీ కారును అడ్డగించిన మహిళ

హోటల్ తాజ్‌కృష్ణ వద్ద భద్రత వైఫల్యం



ప్రియాంకా గాంధీ కారుకు అడ్డుపడిన మమతా గుప్తను అదుపులోకి తీసుకున్న పోలీసులు

లక్డీకాపూల్ (హైదరాబాద్): సీడబ్ల్యూసీ సమావేశాల్లో భద్రతలోపం కనిపించింది. ఓ మహిళ నేరుగా లోపలకు వెళ్లడం, ప్రియాంకా గాంధీ కారుకు అడ్డుపడటమే అందుకు నిదర్శనం. వివరాల్లోకి వెళితే.. కొంపల్లికి చెందిన మమతా గుప్త తన కుమారుడితో కలిసి ఆదివారం మధ్యాహ్నం 2.30 ప్రాంతంలో నగరంలోని తాజ్‌కృష్ణ హోటల్ వద్దకు చేరుకుంది. తన వద్ద ఏ పాస్ లేకున్నా సునాయాసంగా లోపలకు ప్రవేశించి జాతీయ మీడియా చానళ్ల ప్రతినిధుల్లో కలిసిపోయారు. విజయభేరీ సభకు సోనియా వెళ్లే సమయం కావడంతో ఆమె రాక కోసం అంతా ఎదురుచూస్తున్నారు. అదే సమయంలో ప్రియాంకగాంధీ బయటకు రావడం గమనించిన మమత, ఆమెనే సోనియాగాంధీ అని భావించి, భద్రతా వలయాన్ని ఛేదించుకుని వెళ్లి ప్రియాంక కారును అడ్డగించారు. తన స్థలం ఎవరో కబ్జా చేశారని, తనకు న్యాయం చేయాలని విలపించారు. ఈ పరిణామంతో ఉలిక్కిపడ్డ పోలీసులు అప్రమత్తమై మమతను అదుపులోకి తీసుకొని ప్రియాంక కారు రూట్ క్లియరెన్స్ ఇచ్చారు. తాను ఏడాది నుంచి సోనియాని కలిసేందుకు ప్రయత్నిస్తున్నానని.. అయినా కుదరటం లేదంటూ మమత ఆవేదన వ్యక్తం చేశారు.

తుక్కుగూడ సభలో కాంగ్రెస్ తుక్కు హామీలు

మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ టూరిస్టుల సభ..పచ్చి అబద్ధాలకు, అమలుకు నోచుకోని హామీలకు వేదికైందని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సీడబ్ల్యూసీ మీటింగ్ పెట్టుకుని తెలంగాణ ప్రజలను మభ్య పెట్టే హామీలను ప్రకటించారని ధ్వజమెత్తారు. ఆదివారం తుక్కుగూడ సభలో చెవులకు వినసొంపుగా తుక్కు హామీలిచ్చారని ఆదివారం ఓ ప్రకటనలో ఎద్దేవా చేశారు. తన మనుగడకే గ్యారంటీ లేని కాంగ్రెస్ పార్టీ గ్యారంటీల పేరిట హామీలు ప్రకటించడం హాస్యాస్పదమన్నారు. సీఎం కేసీఆర్ 'అబ్ కీ బార్ కిసాన్ సర్కార్' నినాదంతో కాంగ్రెస్, బీజేపీలకు ముచ్చె మటలు పడుతున్నాయని, కేసీఆర్‌ను ఎదుర్కొనే ధైర్యం ఆ రెండు పార్టీలకు లేదని ధీమా వ్యక్తం చేశారు.

మోదీ, కేసీఆర్ ఇద్దరూ ఒక్కటే!

అంతర్గతంగా వారు కలిసిపోయారు.. బయటికి మాత్రం విమర్శలు: ఖర్గే

- మేం ఓట్ల కోసం తెలంగాణ ఇవ్వలేదు.. ఇక్కడి ప్రజల ఆకాంక్షను అర్థం చేసుకుని ఇచ్చాం
- వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తెద్దామని పిలుపు
- రైతు భరోసా ప్రకటన చేసిన ఖర్గే



సాక్షి, హైదరాబాద్: ప్రధానమంత్రి మోదీ, సీఎం కేసీఆర్ బయటకు వేర్వేరుగా ఉన్నట్లు కనిపించినా, అంతర్గతంగా ఇద్దరూ ఒక్కటే అని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జునఖర్గే ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ పార్టీ బీజేపీకి బీ–టీమ్ అని వ్యాఖ్యానించారు. ఓట్ల కోసం కేసీఆర్, మోదీ ఎన్నో అబద్ధాలు చెబుతారని, రానున్న ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు తెలివిగా ప్రవర్తించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చేందుకు రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పార్టీ నాయకులంతా కృషి చేస్తున్నారని, కార్యకర్తలు సైతం శ్రమటోడ్చి పనిచేయాలని పిలుపునిచ్చారు. తుక్కుగూడలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన విజయభేరి బహిరంగ సభలో ఖర్గే మాట్లాడారు. తెలంగాణకు స్వాతంత్ర్యం ఇచ్చింది... ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంగా చేసింది కాంగ్రెస్ పార్టీ అని అన్నారు.

మేం మాట ఇస్తే చేసి చూపుతాం

కాంగ్రెస్ వాగ్దానం ఇస్తే.. దాన్ని తప్పక నెరవేరుస్తుందని, ఉపాధి హామీ పథకం, ఆహార భద్రత చట్టం ఇలా ఎన్నింటినో పార్టీ తెచ్చిందని ఖర్గే చెప్పారు. 'కొందరు ఏమీ చేయకుండానే వాళ్లే దేశానికి స్వాతంత్ర్యం తెచ్చినట్టు ఎంతో ప్రచారం చేసుకుంటూ ఉంటారు. కానీ, ఈ దేశంలో పేదలు, ఆదివాసీలు, ఎస్సీలు, పేద రైతుల కోసం కాంగ్రెస్ ఎన్నో పనులు చేసింది. సోనియా వాగ్దానం మేరకే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేసి ఇచ్చారు. ఓట్ల కోసం ప్రత్యేక తెలంగాణ ఇవ్వలేదు. తెలంగాణ ప్రజల ఆకాంక్షను, బాధను అర్థం చేసుకుని సోనియా గాంధీ రాష్ట్రాన్ని ఏర్పాటు చేశారు. ఇప్పుడు మీరు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో ఉన్నారు. కానీ, ఈ రోజు మా కష్టం పదేళ్లు వృథాగా పోయింది. ఈ పదేళ్లలో మేం అనుకున్న రీతిలో ఇక్కడ అభివృద్ధి జరగలేదు' అని అన్నారు. సోనియాగాంధీ చెప్పింది చేస్తారని, కేసీఆర్ చెప్పింది చేయరని పేర్కొన్నారు.

కేసీఆర్ అప్పులపాలు చేశారు

మిగులు బడ్జెట్‌తో ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ ఈ పదేళ్లలో దివాలా తీసే స్థితికి తెచ్చారని ఖర్గే మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీలకు భూమి ఇస్తామని హామీ ఇచ్చిన కేసీఆర్... బడ్జెట్ లేదంటూ చేతులెత్తేశారన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ఓవైపు మోదీ అమ్ముతూ తన స్నేహితులను ధనవంతులను చేస్తున్నారని దుయ్యబట్టారు. మరోవైపు కేసీఆర్ తెలంగాణలోని ప్రభుత్వరంగ సంస్థలను నష్టాల్లోకి నెట్టి వాటిని విక్రయించే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఓట్ల కోసం అబద్ధాలతో మోసగించే మోదీ, కేసీఆర్ విషయంలో తెలంగాణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యకర్తల ఉత్సాహం చూస్తే తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం తప్పకుండా వస్తుందన్న విశ్వాసం కలుగుతోందని ఖర్గే చెప్పారు.

రైతు భరోసా ప్రకటించిన ఖర్గే

తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతు భరోసా పథకం కింద ఏటా రైతులకు, కౌలు రైతులకు ఒక్కో ఎకరాకు రూ.15 వేలు ఆర్థికసాయం ఇస్తామని ఖర్గే ప్రకటించారు. భూమిలేని రైతు కూలీలకు ప్రతి సంవత్సరం రూ.12,000 ఇచ్చి భరోసా ఇస్తామన్నారు. అదేవిధంగా వరికి కనీస మద్దతు ధరకు అదనంగా క్వింటాల్‌కు రూ.500 బోనస్ కూడా ఇస్తామని హామీ చెప్పారు.

తొమ్మిదేళ్ల కష్టాలను తొలగిస్తాం

- కేసీఆర్ పాలనకు చరమగీతం పాడుతాం: రేవంత్‌రెడ్డి
- సోనియా తెలంగాణ ఇచ్చి మాట నిలబెట్టుకున్నారు
- ఇప్పుడు ఇస్తున్న సంక్షేమ హామీలనూ నెరవేరుస్తారు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రజల చిరకాల ఆకాంక్షను నెరవేర్చేందుకు సోనియాగాంధీ పట్టుబట్టి ప్రత్యేక రాష్ట్రం ఇచ్చారని.. కానీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కేసీఆర్ సర్కారు అన్ని వర్గాల ప్రజలను విస్మరించిందని టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. కేసీఆర్ గత తొమ్మిదేళ్లలో అవినీతి, నియంతృత్వ పాలనతో ప్రజలను కష్టాలకు గురిచేశారని.. ప్రజలు ఈ తొమ్మిదేళ్లు పడిన కష్టాలను తాము అధికారంలోకి వచ్చి తొలగిస్తామని పేర్కొన్నారు. ఇకపై కేసీఆర్ ఆటలు సాగనివ్వబోమని.. ఇందుకోసం కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలతో ముందుకు వచ్చిందని చెప్పారు. నాడు కరీంనగర్ గడ్డ వేదికగా సోనియా గాంధీ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేస్తామని గ్యారంటీ ఇచ్చి మాట నిలబెట్టుకున్నారని గుర్తు చేశారు. ఇప్పుడు రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పాలన అందిస్తామంటూ మరోసారి తెలంగాణ గడ్డపై సోనియా కాలుపెట్టారని.. ఈ మాట కూడా నిలబెట్టుకుంటారని రేవంత్ చెప్పారు. ప్రజల్లో కాంగ్రెస్ పార్టీకి వస్తున్న ఆదరణను చూసి కేసీఆర్ ప్రభుత్వంలో వణుకు మొదలైందన్నారు. విజయభేరి సభ పెట్టుకుంటామని తాము అనుమతి కోరితే కేసీఆర్ ప్రభుత్వం ఎన్నోరకాల అడ్డంకులు సృష్టించిందని మండిపడ్డారు. మొదట్లో పరేడ్‌గ్రౌండ్స్‌లో సభ పెట్టుకుంటామంటే కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, పర్యాటక మంత్రి కిషన్‌రెడ్డి కుట్ర చేసి అక్కడ అనుమతులు రాకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. తర్వాత గచ్చిబౌలి స్టేడియంలో సభ కోసం అనుమతి కోరితే రాష్ట్ర ప్రభుత్వం తిరస్కరించిందని.. మహేశ్వరం సమీపంలో సభ జరుపుకొంటామంటే దేవుడి మాన్యం భూముల్లో కుదరదంటూ తిరస్కరించారని చెప్పారు. చివరికి తుక్కుగూడలో రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి స్థలం ఇవ్వడంతో సభ నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రంలో ప్రజలు కేసీఆర్ పాలనపై విశ్వాసం కోల్పోయారని.. అందుకే కాంగ్రెస్‌కు మద్దతుగా నిలుస్తున్నారని చెప్పారు.

కేసీఆర్ మాటలన్నీ అబద్ధాలే



- పేరు మార్పుతోనే బీఆర్ఎస్ దుకాణం బంద్: ఎంపీ కోమటిరెడ్డి
- వారిని గద్దె దింపేందుకు కాంగ్రెస్ సిద్ధంగా ఉందని వ్యాఖ్య

సాక్షి, హైదరాబాద్: సంక్షేమ పథకాల పేరిట సీఎం కేసీఆర్ రాష్ట్ర ప్రజలను నిలువునా మోసం చేశారని కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మండిపడ్డారు. పథకాల విషయంలో కేసీఆర్ చెప్తున్నవన్నీ అబద్ధాలేనని ఆరోపించారు. ''రైతుబంధు అందరికీ ఇవ్వలేదు.. 24 గంటల కరెంటు అంతా ఉత్తిమాటే.. అందరికీ ఇళ్లు కూడా వట్టిమాటలే.. దళితులకు మూడెకరాల భూమి అని మోసం చేశారు. ఇక ఏ మొహం పెట్టుకుని ఓట్లు అడుగుతున్నావ్ కేసీఆర్.. టీఆర్ఎస్ పార్టీని బీఆర్ఎస్‌గా మార్చినప్పుడే కేసీఆర్ దుకాణం బంద్ అయింది. రాష్ట్రంలో ఇంటర్ పరీక్షలు సరిగా నిర్వహించలేని ప్రభుత్వం, ఉద్యోగ అర్హత పరీక్షల పేపర్లు లీక్ చేసే ప్రభుత్వం ఉంది. ఈ కుంభకోణాల ప్రభుత్వాన్ని గద్దె దింపుదాం. ఇందుకోసం కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉంది..'' అని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటై పదేళ్లు కావస్తోందని గుర్తు చేశారు. 2014లో సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్రం ఇచ్చి స్వాతంత్ర్యం ఇస్తే.. ఇప్పుడు కేసీఆర్ అవినీతి పాలననుంచి విముక్తి కల్పించేందుకు మరోసారి తెలంగాణ గడ్డకు వచ్చారని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన సోనియా గాంధీ రుణం తీర్చుకోవాలని.. అందుకోసం వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించి ఆమెకు కానుకగా ఇవ్వాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో వంద సీట్లలో గెలిచి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు.

రైతు భరోసా గొప్ప కార్యక్రమం

ఇది రాష్ట్ర చరిత్రలో నిలిచిపోతుంది: భట్టి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని రైతులకు అండగా నిలిచేందుకు కాంగ్రెస్ పార్టీ తీసుకొస్తున్న రైతు భరోసా గొప్ప కార్యక్రమమని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చెప్పారు. ఇది తెలంగాణ చరిత్రలో చిరస్థాయిలో నిలిచిపోతుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే.. రాష్ట్రంలోని రైతులకు ఎకరాకు ఏటా రూ.15వేల పెట్టుబడి సాయం అందిస్తామని.. కౌలు రైతులకు ఏటా రూ.12వేలు ఆర్థిక సాయం చేస్తామని చెప్పారు. వరి పండించే రైతులకు మద్దతు ధరపై క్వింటాల్‌కు రూ.500 బోనస్‌గా ఇస్తామని ప్రకటించారు. రైతు భరోసా గ్యారంటీ స్కీమ్‌ను ప్రకటించిన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేకు తెలంగాణ రైతాంగం తరపున అభినందనలు తెలుపుతున్నామన్నారు.

బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే బీజేపీకి వేసినట్లే

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే నేరుగా బీజేపీకి ఓటు వేసినట్టుగా భావించాలని సీఎల్పీనేత భట్టి విక్రమార్క ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అంతకు ముందు హోటల్ తాజ్ కృష్ణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్‌కు పడిన ప్రతి ఓటు బీజేపీకి బదిలీ అవుతుందని చెప్పారు. బీఆర్ఎస్ పార్లమెంట్‌లో బీజేపీ ప్రజా వ్యతిరేక నిర్ణయాలకు ఓటు వేసి సమర్థిస్తుందన్నారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్ఎస్‌లు పరస్పరం సహకరించుకుంటూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నాయని దుయ్యబట్టారు. తెలంగాణ ప్రజల జీవితాల్లో మార్పు కోసమే కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలని ప్రకటిస్తోందని తెలిపారు.

దేశ సేవ కోసమే పనిచేస్తున్న గాంధీ కుటుంబం

రాజస్థాన్ సీఎం అశోక్ గెహ్లోత్

సాక్షి, హైదరాబాద్: గాంధీ కుటుంబం దేశ సేవ కోసమే పనిచేస్తోంది. తొలి ప్రధానిగా నెహ్రూ దేశాన్ని ముందుకు నడిపించారు. ఇందిరాగాంధీ బడుగు, బలహీనవర్గాల కోసం పనిచేశారు. రాజీవ్ గాంధీ దేశాన్ని పురోగతి మార్గంలో నడిపారు. తర్వాత సోనియా గాంధీకి, రాహుల్ గాంధీలకు ప్రధానిగా అవకాశం వచ్చినా స్వీకరించలేదు. వారు దేశం కోసం మాత్రమే పనిచేస్తున్నారు.

రాహుల్ ఓ రిజర్వ్ బ్యాంక్

ఆయన సేవలను అవసరాన్ని బట్టి వినియోగించుకోవాలి.. ఖాళీ చేసేయొద్దు..జోడోయాత్ర-2పై ఖర్గే

- నేతలంతా ఏం చేస్తారు..? ప్రజల్లో ఉండి పార్టీని బలోపేతం చేయండి
- అందరినీ సంప్రదించాకే 'ఇండియా' కూటమిలో సీట్ల సర్దుబాటు ప్రక్రియ
- తెలంగాణలో కర్ణాటక మోడల్‌ను అమలు చేద్దాం.. సక్సెస్ అవుతాం
- పార్టీకి, నాయకులకు వ్యతిరేకంగా మాట్లాడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక
- సోనియా మాకు తల్లిలాంటిది, తెలంగాణలో గెలిచి గిఫ్ట్‌గా ఇస్తాం: రాష్ట్ర నాయకులు

సాక్షి, హైదరాబాద్: ''రాహుల్ గాంధీ ఓ రిజర్వ్ బ్యాంక్ లాంటివారు. రిజర్వ్ బ్యాంకును ఖాళీ చేసేస్తే ఎలా?..'' అని కాంగ్రెస్ నేతలతో ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆసక్తికర వ్యాఖ్యలు చేసినట్టు తెలిసింది. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర రెండో విడతను వెంటనే చేపట్టాలని పలువురు సీడబ్ల్యూసీ సభ్యులు ఆదివారం నాటి సమావేశాల్లో కోరగా.. ''రాహుల్ గాంధీ సేవలను అవసరార్థం వినియోగించుకోవాలి. రిజర్వ్ బ్యాంక్ ఖాళీ అయితే ఇబ్బంది కదా.. మీరంతా ఏం చేస్తారు? ఎల్లప్పుడూ ప్రజల్లోనే ఉండండి. పార్టీని బలోపేతం చేయండి..'' అని ఖర్గే హితబోధ చేసినట్టు సమాచారం.దేశంలో ఇండియా కూటమికి అనుకూల వాతావరణం ఉందని, రానున్న ఐదు రాష్ట్రాల అసెంబ్లీలు, పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేసినట్టు తెలిసింది. బీజేపీ ఎజెండా ఉచ్చులో పడకుండా మన సొంత ఎజెండాతో ముందుకు వెళ్లాలని.. ప్రజా సమస్యలపై పోరాటమే ప్రధాన అంశంగా ముందుకు సాగాలని మార్గనిర్దేశనం చేసినట్టు సమాచారం.

కట్టు తప్పితే సహించేది లేదు

పార్టీలో క్రమశిక్షణ కట్టుతప్పితే సహించేది లేదని మల్లికార్జున ఖర్గే స్పష్టం చేశారు. పార్టీకి వ్యతిరేకంగా, పార్టీ నాయకులకు వ్యతిరేకంగా మీడియాకు ఎక్కినా.. బహిరంగంగా ఎలాంటి వ్యాఖ్యలు చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ విషయంలో కఠినంగా ఉంటామని, చర్యలు తీసుకున్నాక నిందించవద్దని పేర్కొన్నారు. ఇక ఇండియా కూటమిలో సీట్ల సర్దుబాటు అంశాన్ని త్వరగా తేల్చాలని కొందరు సీడబ్ల్యూసీ సభ్యులు కోరగా.. ఆ చర్చ వచ్చినప్పుడు రాష్ట్రాల్లోని పార్టీ నేతల అభిప్రాయాలను, సూచనలను తీసుకుంటానని ఖర్గే హామీ ఇచ్చారు. మీరు చేసే సూచనల మేరకే సీట్ల సర్దుబాటు ఉంటుందని, ఆందోళన వద్దని సూచించారు.

కర్ణాటక మోడల్‌తో ముందుకు..

తెలంగాణలో కర్ణాటక మోడల్ అమలు చేస్తామని ప్రజలకు హామీ ఇవ్వాలని, దీనిని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాష్ట్ర నేతలకు ఖర్గే సూచించారు. పార్టీ నేతలంతా కలసికట్టుగా పార్టీ విజయం కోసం కృషి చేయాలని సూచించారు. అంతర్గతంగా సమస్యలు పరిష్కరించుకోవాలే తప్ప.. బహిరంగ వ్యాఖ్యలు చేయొద్దని స్పష్టం చేశారు.



రజాకార్లు మా ఇంటినీ తగలబెట్టారు

మొదట దేశం మొత్తం స్వాతంత్య్రం లభించినా హైదరాబాద్ స్టేట్‌లోని ప్రజలకు స్వాతంత్రం లభించలేదని.. ఆ సమయంలో నిజాం పాలనలో రజాకార్ల అరాచకాలు ఆకాశాన్ని అంటాయని మల్లికార్జున ఖర్గే చెప్పారు. తమ ఇంటిని కూడా రజాకార్లు తగలబెట్టారని తెలిపారు. సెప్టెంబర్ 17న నిజాం పాలనకు చరమగీతం పాడటంలో సర్దార్ పటేల్, కాంగ్రెస్ నేతలు కృషి చేశారని చెప్పారు.

సోనియాకు బహుమతి ఇస్తాం: రాష్ట్ర నాయకులు

సీడబ్ల్యూసీ భేటీలో పాల్గొన్న టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, భట్టి విక్రమార్క, దామోదర రాజనర్సింహ తదితరులు మాట్లాడుతూ..''తెలంగాణ ఇచ్చినప్పటికీ.. గత రెండు దఫాలుగా కాంగ్రెస్‌ను గెలిపించి సోనియమ్మకు బహుమతిగా ఇవ్వలేకపోయాం. ఈసారి తప్పనిసరిగా తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసి ఆమెకు బహుమతిగా ఇస్తాం'' అని పేర్కొన్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి.

అప్పుడే చెప్పాం..
ఎన్నిసార్లు అడుగుతారు?

- ఎల్లోమీడియాకు ఏఐసీసీ అధికార ప్రతినిధి పవన్‌ఖేరా చురకలు
- చంద్రబాబు అరెస్టుపై కాంగ్రెస్ వైఖరేంటని ప్రశ్నించిన ఎల్లోమీడియా ప్రతినిధి
- మొన్ననే చెప్పాం.. నిన్న కూడా ఇదే అడిగారు..ఎన్నిసార్లు అడుగుతారంటూ ఖేరా అసహనం



సాక్షి, హైదరాబాద్: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అడ్డంగా దొరికిపోయి రిమాండ్‌లో ఉన్న టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు అరెస్టుపై నానాయాగీ చేస్తున్న ఎల్లోమీడియాకు సీడబ్ల్యూసీ సమావేశాల్లో షాక్ తగిలింది. చంద్రబాబును అరెస్టు చేయడంతో ఏదో జరిగిపోయిందని, దేశ రాజకీయాలు తలకిందులయిపోతున్నాయనే భావన కలిగించేందుకుగాను కనిపించిన ప్రతి రాజకీయ నాయకుడిని ప్రశ్నించాలని, బాబుకు అనుకూలంగా చెబితే ప్రచురిద్దామని, ఒకవేళ వ్యతిరేకంగా మాట్లాడితే వదిలేద్దామని ఎల్లోమీడియా యాజమాన్యాలు తమ విలేకరులకు దిశానిర్దేశం చేశాయి. దీంతో చేసేదేమీలేక ఇష్టం లేకపోయినా బాబు అరెస్టు గురించి గత వారం రోజులుగా రాజకీయవేదికలపై సదరు మీడియా విలేకరులు ప్రశ్నిస్తూనే ఉన్నారు. అందులోభాగంగానే సీడబ్ల్యూసీ సమావేశాల సందర్భంగా ఆదివారం ఉదయం ఏఐసీసీ అధికార ప్రతినిధి పవన్ ఖేరా విలేకరులతో మాట్లాడుతున్న సమయంలో చంద్రబాబు అరెస్టు గురించి కాంగ్రెస్ వైఖరేంటని ఎల్లోమీడియా ప్రతినిధి ప్రశ్నించారు. ఇందుకు స్పందించిన ఖేరా 'చంద్రబాబు గురించి ఎన్నిసార్లు అడుగుతారు. నిన్న కూడా ఇదే ప్రశ్న అడిగారు. దీనిపై మా సీఎల్పీ నాయకుడు ఇప్పటికే వైఖరి వెల్లడించారు. ఇంకెన్నిసార్లు అడుగుతారు.'అని అసహనం వ్యక్తం చేశారు. ఇక, సమావేశం ముగిసిన తర్వాత ఈ అంశంపై విలేకరులు పిచ్చాపాటి మాట్లాడుకుంటూ వీళ్ల వైఖరి చూస్తుంటే చంద్రబాబు అరెస్టును ఖండిస్తూ సీడబ్ల్యూసీ సమావేశాల్లో ఎందుకు తీర్మానం చేయలేదని కూడా విలేకరులతో ఎల్లో మీడియా అడిగిస్తుందేమోనని చమత్కరించుకోవడం గమనార్హం.

మహిళా రిజర్వేషన్ బిల్లుపై కాంగ్రెస్ దృష్టి

ఏఐసీసీ మీడియా ప్రచార విభాగం చైర్మన్ పవన్ ఖేరా

సాక్షి, హైదరాబాద్: వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదించే విధంగా కాంగ్రెస్ దృష్టి సారించినట్లు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు, ఏఐసీసీ మీడియా ప్రచార విభాగం చైర్మన్ పవన్ ఖేరా చెప్పారు. సీడబ్ల్యూసీ సమావేశాల్లో సైతం మహిళా బిల్లుపై తీర్మానించినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే సోనియా గాంధీ ప్రధాని మోదీకి లేఖ రాసినట్లు గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ మూడు దశాబ్దాలుగా రెండు సభల్లో బిల్లు ఆమోదించే విధంగా ప్రయత్నిస్తూనే ఉందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ పేద, బడుగు వర్గాల పక్షమని, ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు. ప్రధాని మోదీ చైనాకు క్లీన్ చిట్ ఇవ్వడంతో భారత్‌కు భౌగోళికంగా భారీ నష్టం వాటిల్లిందని పవన్ ఖేరా ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి నష్టం ఇప్పటివరకు ఏ ప్రభుత్వం చేయలేదని దుయ్యబట్టారు.

మూడు పక్షాలది చీకటి బంధం

కాంగ్రెస్‌ను అడ్డుకునేందుకు బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీల చీకటి ఒప్పందం కొనసాగుతోందని పవన్ ఖేరా ఆరోపించారు. సీడబ్ల్యూసీ భేటీ నేపథ్యంలో ప్రజలను పక్కదారి పట్టించేందుకు వ్యవహరిస్తున్న తీరుతో వారి నైజం బయటపడిందన్నారు.

మౌన ప్రేక్షకుల్లా ఉండొద్దు

- స్పష్టమైన సందేశం, పునరుత్తేజంతో తెలంగాణ నుంచి వెళుతున్నాం
- ఛత్తీస్‌గఢ్, రాజస్తాన్‌లలో సంక్షేమపాలనపై దేశమంతా విస్తృత ప్రచారం కల్పించాలి
- ప్రజలు ప్రత్యామ్నాయం వైపు చూస్తున్నారని ఫలితాలు చెబుతున్నాయి
- పీసీసీ అధ్యక్షులు, సీఎల్పీ నేతలతో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే



సాక్షి, హైదరాబాద్: 'పదేళ్ల బీజేపీపాలనలో సామాన్య ప్రజల సమస్యలు రెట్టింపయ్యాయి. పేదలు, రైతులు, కార్మికులు, మహిళలు, యువత ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేందుకు మోదీ అంగీకరించరు. తానేం చేస్తున్నారో వెనక్కి తిరిగి చూసుకోరు. ప్రజలు ప్రత్యామ్నాయం వైపు చూస్తున్నారని హిమాచల్‌ప్రదేశ్, కర్ణాటక ఎన్నికల ఫలితాలు స్పష్టంగా చెబుతున్నాయి. ఇలాంటి సమయంలో మనం మౌన ప్రేక్షకుల్లా మిగిలిపోవద్దు. నియంతృత్వాన్ని పారదోలి ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు అందరం ఏకమై పోరాడాలి.' అని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పిలుపునిచ్చారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశాల్లో భాగంగా రెండోరోజు ఆదివారం సీడబ్ల్యూసీ సభ్యులతో పాటు దేశంలోని అన్ని రాష్ట్రాల పీసీసీ అధ్యక్షులు, సీఎల్పీ నేతలతో విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఖర్గే మాట్లాడుతూ దేశం అనేక సమస్యలను ఎదుర్కొంటోందని చెప్పారు. ఈ సమస్యల నుంచి రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడంతోపాటు దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత కాంగ్రెస్ పార్టీ తీసుకోవాలన్నారు. వ్యక్తిగత ప్రయోజనాలు పక్కనపెట్టి కాంగ్రెస్ నేతలందరూ అవిశ్రాంతంగా పనిచేయాలని, వ్యక్తిగత విభేదాల కన్నా పార్టీ ప్రయోజనాలే ముఖ్యంగా ముందుకెళ్లాలని చెప్పారు. సామాజికన్యాయం, సంక్షేమమే ధ్యేయంగా ఛత్తీస్‌గఢ్, రాజస్తాన్ రాష్ట్రాల్లో ప్రజారంజక పాలన అందించామని, ఈ రెండు రాష్ట్రాల మోడల్‌ను దేశ వ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. రెండు, మూడు నెలల్లో ఐదు రాష్ట్రాల్లో ఎన్నికలు జరగబోతున్నాయని, ఆరు నెలల్లో లోక్‌సభ ఎన్నికలు వస్తాయని, వీటితో పాటు జమ్మూ కశ్మీర్‌లో కూడా ఎన్నికలకు పార్టీ సిద్ధం కావాలని ఖర్గే కోరారు.

అదే గాంధీకి నిజమైన నివాళి

2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించడమే లక్ష్యంగా ముందుకెళ్లాలని కాంగ్రెస్ నేతలకు ఖర్గే పిలుపునిచ్చారు. మహాత్మాగాంధీ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పనిచేసిన శతాబ్దం పూర్తవుతున్న తరుణంలో ఈ దేశంలో ప్రత్యామ్నాయ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకుగాను బీజేపీని గద్దె దింపడమే నిజమైన నివాళి అని వ్యాఖ్యానించారు. 'తెలంగాణ నుంచి స్పష్టమైన సందేశం, పునరుత్తేజంతో వెళదాం. తెలంగాణతోపాటు భవిష్యత్‌లో జరిగే అన్ని ఎన్నికల్లో విజయం సాధించాలనే కృతనిశ్చయంతో అందరూ హైదరాబాద్ వదిలి వెళ్లాలి. బీజేపీ దుష్పరిపాలన కారణంగా ఎదురవుతున్న కష్టాల నుంచి దేశ ప్రజలకు ఉపశమనం కలిగించాలి.' అని ఖర్గే దిశానిర్దేశం చేశారు.

అన్ని కమిటీలు పూర్తయ్యాయా?

పార్టీ సంస్థాగత నిర్మాణంపై ఖర్గే మాట్లాడుతూ సంస్థాగతంగా బలంగా ఉన్నప్పుడే రాజకీయ ప్రత్యర్థులను ఓడించగలమని చెప్పారు. కలసికట్టుగా ప్రత్యర్థిపై ఐక్య పోరాటాలు చేసినప్పుడు విజయం సాధిస్తామని కర్ణాటక ఫలితాలే చెబుతున్నాయన్నారు. మండల, బ్లాక్, జిల్లాల స్థాయిలో పార్టీ కమిటీల ఏర్పాటు పూర్తయిందా? స్థానిక నేతలకు కార్యాచరణ ఇస్తున్నామా? గట్టి నాయకులను గుర్తిస్తున్నామా? అనే విషయాల్లో ఆత్మవిమర్శ చేసుకోవాలని పీసీసీ అధ్యక్షులు, సీఎల్పీ నేతలకు ఖర్గే సూచించారు.



సోనియాకు మహాత్మా గాంధీ చిత్రపటాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే సీతక్క.

రాష్ట్ర భవిష్యత్తును తీర్చిదిద్దుకుందాం

తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ విజ్ఞప్తి

- బంగారు తెలంగాణ అని చెప్పి రాష్ట్రాన్ని నిజాం తరహా పాలనలోకి నెట్టారు
- అన్ని వనరులను అధికారంలో ఉన్నవారే అనుభవిస్తున్నారు
- ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షలను, ఆశలను వమ్ము చేశారు
- ఇప్పటికైనా ఆ ఆకాంక్షలను నెరవేర్చుకునే పోరాటంలో మేం కలసి వస్తాం
- అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకే ఓటేయాలని విన్నపం

సాక్షి, హైదరాబాద్: కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వాలు తెలంగాణ ప్రజలను మోసం చేశాయని.. రాష్ట్ర భవిష్యత్తు తీర్చిదిద్దుకోవాల్సిన సమయం వచ్చిందని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) పేర్కొంది. కాంగ్రెస్ అబద్ధాలు చెప్పదని, శుష్క వాగ్దానాలు ఇవ్వదని.. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే కర్ణాటక ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చామని గుర్తు చేసింది. దశాబ్దాల తమ నిబద్ధత, ట్రాక్ రికార్డు ఏమిటో తెలంగాణ ప్రజానీకానికి తెలుసని.. రానున్న అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకే ఓటు వేయాలని తెలంగాణ ప్రజలకు సీడబ్ల్యూసీ విజ్ఞప్తి చేసింది.

సీడబ్ల్యూసీ విజ్ఞప్తిలో ఏముందంటే..?

''ఇక్కడి ప్రజల ప్రత్యేక రాష్ట్ర సాధన పోరాటం 2014లో తెలంగాణ ఏర్పాటుతో విజయవంతమైంది. అందులో కాంగ్రెస్ పార్టీ కీలక పాత్ర పోషించింది. యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ, ప్రధాని మన్మోహన్ అన్ని రాజకీయ అవరోధాలను అధిగమించి, అందరితో చర్చించి తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చారు. ప్రత్యేక రాష్ట్రంలోని వనరులు, నీళ్లు, ఉపాధి ప్రజలందరికీ లభిస్తాయని, నీళ్లు-నిధులు-నియామకాలతో భవిష్యత్తు ఉంటుందని, బంగారు తెలంగాణ ఏర్పడుతుందని అంతా కోరుకున్నారు. కానీ అక్కడ ఢిల్లీలో, ఇక్కడ హైదరాబాద్‌లో ఉన్న ప్రభుత్వాలు ప్రజలను మోసం చేశాయి. ఏ కలతో ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు కావాలని ప్రజలు పోరాడారో తొమ్మిదేళ్లయినా ఆ కల నెరవేరలేదు. రాష్ట్రంలో ప్రజలకు చెందాల్సిన వనరులన్నింటినీ అధికారంలో ఉన్నవారే అనుభవిస్తున్నారు. నిజాం తరహా పాలనలోకి రాష్ట్రాన్ని నెట్టారు.

రాహుల్ యాత్రలో వాస్తవాలు తెలిశాయి

భారత్ జోడో యాత్రలో భాగంగా రాహుల్‌గాంధీ తెలంగాణలోని 8 జిల్లాల మీదుగా 405 కిలోమీటర్ల మేర పాదయాత్ర చేపట్టినప్పుడు వేలాది మంది ప్రజలు ఆయన్ను కలిశారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వాలు పేద, రైతు, దళిత, ఆదివాసీ, ఆదివాసీల ప్రయోజనాలను పణంగా పెట్టి.. తమ వారికే ఎలా లబ్ధి కలిగిస్తున్నాయో తేలింది. తెలంగాణలో రైతాంగం నానాటికీ అప్పుల్లో కూరుకుపోతున్నారు. ఆదివాసీలు, దళితులు, మైనార్టీలు, ఓబీసీలకు ఇందిరాగాంధీ హయాంలో పంపిణీ చేసిన భూములను ధరణి పోర్టల్ పేరుతో లాగేసుకుంటున్నారు. పెద్ద పెద్ద కార్పొరేట్ కంపెనీలకు ఆ భూములను కట్టబెడుతున్నారు. కాళేశ్వరం వంటి ప్రాజెక్టులు బీఆర్ఎస్ అనుబంధ కాంట్రాక్టర్లకు ఆదాయ వనరుగా మారాయి. మరోవైపు పబ్లిక్ సెక్టార్ కంపెనీలను మోదీ ప్రభుత్వం కనీసం కనికరం లేకుండా ప్రైవేటైజేషన్ చేస్తుండటంతో దేశంలోని యువతకు ఉపాధి అవకాశాలు లభించడం లేదు. కాంగ్రెస్ పార్టీ మాత్రమే బలమైన, బహుళ ప్రయోజనకారి అయిన ఆర్థిక వ్యవస్థ కోసం మొదటి నుంచీ పోరాడుతోంది.

ఆకాంక్షలను నెరవేర్చుకుందాం..

తెలంగాణ రాష్ట్ర సాధన ఆకాంక్షలను ఇప్పటికైనా నెరవేర్చుకునే దిశలో తెలంగాణ ప్రజల పోరాటానికి సీడబ్ల్యూసీ తోడుగా నిలుస్తుంది. భూములపై హక్కులు కల్పించడం, ప్రైవేటు సెక్టార్‌ను ప్రోత్సహిస్తూనే.. బలమైన ప్రభుత్వ రంగ వ్యవస్థలను ఏర్పాటు చేయడం, ఉపాధి హామీ పేదలకు అండగా నిలవడంతోపాటు తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేయడం వంటివి కాంగ్రెస్ నిబద్ధత ఏమిటో చెప్తున్నాయి. ప్రజలకు మా ట్రాక్ రికార్డు తెలుసు. కాంగ్రెస్ పార్టీ అబద్ధాలు చెప్పదు. శుష్క వాగ్దానాలు ఇవ్వదు. కర్ణాటక ప్రజలకిచ్చిన హామీలను 100 రోజుల్లో నెరవేర్చిన అక్కడి ప్రభుత్వ పనితీరు దీనిని తెలియజేస్తోంది. తెలంగాణలో కూడా చరిత్ర సృష్టించేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. వరంగల్ వేదికగా రైతులు, హైదరాబాద్‌లో యువకులు, ఖమ్మంలో వృద్ధులకు ఇచ్చిన హామీలతోపాటు ఆరు గ్యారంటీలను ప్రజలకు ఇస్తున్నాం. రానున్న అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓటేయాలని కోరుతున్నాం. బంగారు తెలంగాణ స్వప్నాన్ని మరోమారు గుర్తుచేసుకుంటూ.. రాష్ట్ర ప్రజలు భవిష్యత్తును తీర్చిదిద్దుకునే సమయం ఆసన్నమైంది'' అని సీడబ్ల్యూసీ పేర్కొంది.

కేసీఆర్ అనుచరుడు కిషన్‌రెడ్డి!

మీడియా సమావేశంలో రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: 'సీఎం కేసీఆర్.. బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి వేర్వేరు కాదు.. కేసీఆర్ అనుచరుడు కిషన్‌రెడ్డి.. కేసీఆర్ భాషనే ఆయన మాట్లాడుతున్నారు. బండి సంజయ్‌ను ఎందుకు తొలగించారో .. కిషన్‌రెడ్డిని ఎందుకు నియమించారో ప్రస్తుత రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడికి తెలుసు' అని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఆదివారం సీడబ్ల్యూసీ సమావేశాల సందర్భంగా తాజ్‌కృష్ణ హోటల్లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్‌ను ఎదుర్కోలేక బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం మూకుమ్మడిగా కాంగ్రెస్‌పై దాడికి దిగుతున్నాయని మండిపడ్డారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా సీడబ్ల్యూసీ సమావేశాలు జరుగుతున్నప్పుడే ఆ మూడు పార్టీలు పోటాపోటీగా సెప్టెంబర్ 17న సభలు, కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ సభను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు. బీఆర్ఎస్, ఎంఐఎంలు బయట నుంచి బీజేపీ సంకీర్ణ ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్నాయన్నారు.



మాట్లాడుతున్న రేవంత్ రెడ్డి. చిత్రంలో పొంగులేటి, భట్టివిక్రమార్క, సంపత్‌కుమార్

సానుభూతి కోసం బిడ్డను సైతం..

కాంగ్రెస్‌కు పెరుగుతున్న ఆదరణను తట్టుకోలేక రాబోయే ఎన్నికల్లో సానుభూతి ఓట్ల కోసం సీఎం కేసీఆర్ తన బిడ్డను సైతం జైలుకు పంపేందుకు వ్యూహం పన్నుతున్నారని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. కవితను తీహార్ జైలులో పెట్టేలా మోదీతో కేసీఆర్ ఒప్పందం చేసుకున్నారని, ఇందుకు ప్రధాని కూడా సహకరిస్తున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో బీజేపీ, బీఆర్ఎస్ నాటకాలాడుతున్నాయన్నారు. కేసీఆర్ అవినీతిపై బీజేపీ ఎందుకు విచారణకు ఆదేశించడం లేదని ప్రశ్నించారు. కాళేశ్వర ప్రాజెక్టు నిర్మాణాన్ని సీఎం కేసీఆర్ ఏటీఎంలా వాడుకున్నారని ఆరోపించారు. కాళేశ్వరం అక్రమ సొమ్ముతో ఢిల్లీ లిక్కర్ స్కాంలో పెట్టుబడులు పెట్టిన బీఆర్ఎస్.. ఆ స్కామ్‌లో వాటాలు పొందుతున్న బీజేపీ.. కాంగ్రెస్‌ను నిందించడం తప్ప ఏం చేయగలవని నిలదీశారు. కేజ్రీవాల్ ప్రభుత్వంపై ఈడీ పెట్టిన కేసులో మాత్రమే కవిత ఇరుక్కున్నారని, అంతేగానీ బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఒక్క కేసు కూడా పెట్టలేదన్నారు.

రాష్ట్ర ఏర్పాటు లక్ష్యం నెరవేరేందుకే..

తెలంగాణ ఏర్పాటు లక్ష్యం నెరవేర్చేందుకు కాంగ్రెస్ ఆరు గ్యారంటీల ప్రకటన ఇచ్చిందని రేవంత్‌రెడ్డి చెప్పారు. 2004లో తెలంగాణ ఇస్తానన్న హామీని సోనియా గాంధీ నిలబెట్టుకున్నారని, పార్టీకి నష్టం జరిగినా వెనక్కి వెళ్లలేదన్నారు. తెలంగాణ ఇచ్చిన లక్ష్యం నెరవేర్చడానికి విజయభేరి సభలో ఆరు గ్యారంటీలు ప్రకటిస్తున్నారని, అధికారంలోకి వచ్చిన 30 రోజుల్లో మంత్రివర్గ భేటీలో ఆమోదించి వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పారు. ఆర్భాటం కోసమే కేసీఆర్ పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును ప్రారంభించారని విమర్శించారు.

కాంగ్రెస్‌లో చేరిన యెన్నం



సాక్షి, హైదరాబాద్: మహబూబ్‌నగర్ మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ ఉద్యమకారుడు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. శ్రీనివాస్‌రెడ్డితోపాటు హైదరాబాద్ నగరానికి చెందిన మస్కతి డైరీ చైర్మన్ అలీ మస్కతి, ఖమ్మం కార్పొరేటర్ దొడ్డ నగేశ్, జూబ్లీహిల్స్ నాయకుడు ఉపేందర్‌రెడ్డి కూడా పార్టీలో చేరారు. సీడబ్ల్యూసీ సమావేశాలు జరుగుతున్న తాజ్‌కృష్ణ హోటల్లో మల్లికార్జున ఖర్గే వీరికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

విఘ్నాలు తొలగిపోవాలి

రాష్ట్ర ప్రజలకు గవర్నర్ తమిళిసై, సీఎం కేసీఆర్ వినాయక చవితి శుభాకాంక్షలు

సాక్షి, హైదరాబాద్/అమరావతి: వినాయక చవితి సందర్భంగా గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రం, దేశంలో ఐక్యత, శాంతి, పురోగతి, సంక్షేమం పెంపొందించాలని, వీటికి విఘ్నాలన్నీ తొలగిపోవాలని ఆకాంక్షించారు. శాంతి, సౌభ్రాతృత్వం వెల్లివిరిసేలా రాష్ట్ర ప్రజలందరూ గణపతి నవరాత్రులను జరుపుకోవాలని సూచించారు.

అందరిపై గణనాథుని ఆశీస్సులుండాలి: ఏపీ సీఎం వైఎస్ జగన్

వినాయక చవితి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. అందరిపై గణనాథుని ఆశీస్సులుండాలని, రాష్ట్ర ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సకల సంపదలు సిద్ధించాలని, సకల శుభాలు కలగాలని ఆకాంక్షించారు.

ఎన్నికలకు సై..!

త్వరలో ఎన్నికలు జరిగే ఐదు రాష్ట్రాల్లో విజయం ఖాయం

- ఏప్రిల్, మేలో జరిగే లోక్‌సభ ఎన్నికలకూ సిద్ధంగా ఉన్నాం
- దేశ ప్రజలు మార్పు కోరుకుంటున్నారు... వారి ఆశలను నెరవేరుస్తాం
- సీడబ్ల్యూసీ సమావేశాల్లో ఐదు రాష్ట్రాల ఎన్నికలపై చర్చ.. గెలుపు ధీమాతో ముగిసిన కాంగ్రెస్ కీలక భేటీ

సాక్షి, హైదరాబాద్: దేశంలో ఎప్పుడు, ఎక్కడ ఎన్నికలు జరిగినా ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉన్నామని, త్వరలో జరిగే ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో విజయం సాధిస్తామని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) ధీమా వ్యక్తం చేసింది. తెలంగాణతోపాటు ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, మిజోరం, రాజస్తాన్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు చారిత్రక తీర్పు ఇస్తారనే విశ్వాసాన్ని ప్రకటించింది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే అధ్యక్షతన ఆదివారం హైదరాబాద్‌లోని తాజ్‌కృష్ణ హోటల్లో రెండోరోజు సీడబ్ల్యూసీ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ భేటీలో సోనియా గాంధీ, రాహుల్, ప్రియాంకతోపాటు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు అశోక్‌గహ్లోత్, సిద్ధరామయ్య, భూపేశ్‌భగేల్, సీడబ్ల్యూసీ సభ్యులు, అన్ని రాష్ట్రాల పీసీసీ అధ్యక్షులు, సీఎల్పీ నాయకులు పాల్గొన్నారు. త్వరలో ఐదు రాష్ట్రాల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలు, లోక్‌సభ ఎన్నికలు, పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు, దేశ రాజకీయ పరిస్థితుల గురించి చర్చించారు. ఐదు రాష్ట్రాలకు చెందిన పీసీసీ అధ్యక్షులు, సీఎల్పీ నాయకులు, ఆయా రాష్ట్రాలకు చెందిన ముఖ్య నేతలు ఆయా రాష్ట్రాల్లో ఎన్నికలు ఎదుర్కొనేందుకు అనుసరిస్తున్న వ్యూహాల గురించి వివరించారు. తెలంగాణ నుంచి రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క, దామోదర రాజనర్సింహ, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. తెలంగాణలో ఈసారి తప్పకుండా అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తంచేశారు. విజయం సాధించడమే లక్ష్యంగా వ్యూహాలు రూపొందిస్తున్నామని, ఎన్నికలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. పార్టీ సంస్థాగత నిర్మాణం, పదేళ్ల బీజేపీ పాలనా వైఫల్యాలు, పార్టీ అనుసరించాల్సిన వైఖరి తదితర అంశాలపై ఖర్గే దిశానిర్దేశం చేశారు.

యుద్ధానికి సిద్ధం

చర్చ అనంతరం వచ్చే ఏడాది ఏప్రిల్, మే నెలల్లో జరగనున్న లోక్‌సభ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని సీడబ్ల్యూసీ తీర్మానించింది. ఎన్నికల యుద్ధానికి సంసిద్ధం కావాలని నిర్ణయించింది. దేశ ప్రజలు మార్పును కోరుకుంటున్నారని చెప్పింది. ఆదివారం ఉదయం 10:30 గంటలకు ప్రారంభమైన సీడబ్ల్యూసీ భేటీ మధ్యాహ్నం 4 గంటలకు ముగిసింది. అనంతరం ప్రియాంక ఢిల్లీ వెళ్లిపోగా, సోనియా, రాహుల్, ఖర్గేతోపాటు మిగిలిన సీడబ్ల్యూసీ సభ్యులు, అన్ని రాష్ట్రాల పీసీసీ అధ్యక్షులు, సీఎల్పీ నాయకులు తుక్కుగూడ బహిరంగ సభకు వెళ్లారు.



సమావేశంలో చర్చించుకుంటున్న భూపేశ్ భగేల్, అశోక్ గెహ్లోత్, ప్రియాంకా గాంధీ తదితరులు

జోడో యాత్ర ఉన్నట్టా లేనట్టా?

ఖర్గే చేసిన వ్యాఖ్యలను బట్టి చూస్తే రాహుల్ చేపట్టిన భారత్ జోడో యాత్ర మరోమారు ఉంటుందా లేదా అన్న దానిపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సమావేశంలో భారత్‌జోడో యాత్రపై చర్చించిన సందర్భంగా రాహుల్ అన్ని శక్తులు అప్పుడే ఉపయోగించాల్సిన అవసరం లేదని, సమయం వచ్చినప్పుడు ఆయన శక్తియుక్తులు పార్టీకి ఉపయోగపడతాయని ఖర్గే చెప్పారు. ఈ నేపథ్యంలో అరుణాచల్‌ప్రదేశ్ నుంచి చేపట్టాలని భావించిన 2.0 యాత్రపై ఉత్కంఠ నెలకొంది.

మీరు కాంగ్రెస్‌ను ఎందుకు ఎంచుకున్నారు: ఖర్గేకు రాహుల్ ప్రశ్న

సీడబ్ల్యూసీలో చర్చ సందర్భంగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ మధ్య ఆసక్తికర చర్చ జరిగింది. మీరు యువకుడిగా ఉన్నప్పుడు కాంగ్రెస్‌ను ఎందుకు ఎంచుకున్నారని ఖర్గేను రాహుల్ ప్రశ్నించారు. 'అప్పుడు అందరూ కాంగ్రెస్‌ను వదిలి కాంగ్రెస్(ఓ)లో చేరుతున్నారు. కానీ, పేదలు, బడుగు, బలహీన వర్గాల పక్షాన పని చేసేది కాంగ్రెస్ మాత్రమేనన్న భావనతో కాంగ్రెస్‌లో చేరా. 1969, నవంబర్‌లో పార్టీ బ్లాక్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టా. ఇప్పుడు అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షుడిని అయ్యా' అని ఖర్గే బదులిచ్చారు.

క్షేత్రస్థాయికి 'కాంగ్రెస్'

అసెంబ్లీ నియోజకవర్గాలకు పార్టీ ప్రముఖులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలోని 113 అసెంబ్లీ నియోజకవర్గాలకు కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకత్వం సోమవారం తరలిపోనుంది. ఆదివారం తుక్కుగూడలో జరిగిన విజయభేరి బహిరంగసభలో ప్రకటించిన ఆరు గ్యారంటీ కార్డు స్కీంలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంతోపాటు బీఆర్ఎస్ తొమ్మిదేళ్ల పాలనపై చార్జిషీట్లను పంపిణీ చేసేందుకు కాంగ్రెస్ అగ్రనేతలు క్షేత్రస్థాయికి బయలుదేరుతున్నారు. ఈ మేరకు అన్ని నియోజకవర్గాల్లో సోమవారం పర్యటించనున్న నాయకుల జాబితాను విడుదల చేశారు. ఛత్తీస్‌గఢ్ సీఎం భూపేశ్‌బఘేల్(ఎల్బీనగర్), పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి చరణ్‌జిత్‌సింగ్ చన్నీ(కామారెడ్డి), ఉత్తరాఖండ్ మాజీ సీఎం హరీశ్‌రావత్(తాండూరు), మిజోరం మాజీ సీఎం ఇబోబిసింగ్(షాద్‌నగర్), లోక్‌సభ మాజీ స్పీకర్ మీరాకుమార్(జూబ్లీహిల్స్), రాజస్తాన్ డిప్యూటీ సీఎం సచిన్‌పైలట్ (జడ్చర్ల), సీనియర్ నేత దీపాదాస్ మున్షీ(గోషామహల్), మీనాక్షి నటరాజన్ (చేవెళ్ల) ఈ జాబితాలో ఉన్నారు. వీరితోపాటు సీడబ్ల్యూసీ సభ్యులు, పలు రాష్ట్రాల పీసీసీ అధ్యక్షులు, సీఎల్పీ నాయకులు కూడా క్షేత్రస్థాయికి వెళ్లడం గమనార్హం.

హైదరాబాద్‌పై ప్రత్యేక దృష్టి

ఆరుగ్యారంటీ కార్డు స్కీంలను ప్రజల్లోకి తీసుకెళ్లే విషయంలో కాంగ్రెస్ అధిష్టానం హైదరాబాద్‌పై ప్రత్యేక దృష్టి పెట్టింది. గ్రేటర్ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాలకు అగ్రనేతలను పంపాలని నిర్ణయించింది. ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి భూపేశ్ బఘేల్‌తోపాటు పలువురిని హైదరాబాద్‌లోని అసెంబ్లీ నియోజకవర్గాలకు పంపింది. ఆయా నియోజకవర్గాల్లో వీరంతా సోమవారం పర్యటించి ఆరు హామీల గ్యారంటీ కార్డులతోపాటు బీఆర్ఎస్ పాలనపై చార్జిషీట్లను ప్రజలకు పంపిణీ చేయనున్నారు.



సరైన భోజన సమయం – ధనవంతుడికి చేయాలనుకున్నప్పుడు! పేదవాడికి చేయగలిగినప్పుడు!!

– డైయొజీనీజ్

సాక్షి

సోమవారం, 18 సెప్టెంబర్ 2023

ప్రకృత్యైనమః

గుర్తించాలే కానీ దేవుడు అనేక రూపాల్లో ఉంటాడు. వాటిలో కనిపించనివే కాదు, కనిపించేవీ ఉంటాయి. ఎక్కడో ఉన్నాడనుకునే దేవుడు... మన చేతికందే దూరంలో ఒక మొక్కలోనూ, కొమ్మలోనూ, ఆ కొమ్మకు పూసిన పువ్వులోనూ కూడా ఉన్నాడని గ్రహించడమే లౌకిక, పారలౌకిక సమన్వయంతో కూడిన ఆధ్యాత్మిక ప్రస్థానంలో తొలి ఎరుక. దైవం మానుషరూపేణ అంటారు. అలాగే, దైవం ప్రకృతి రూపేణ కూడా!

రామకృష్ణ పరమహంస ఓసారి ఆకాశంలో రెక్కలు విప్పుకుంటూ ఎగిరే పక్షిని చూసి సమాధిలోకి వెళ్లిపోయారట. చెట్టును, పిట్టను, పువ్వును, పసిపాప నవ్వును, పారే ఏటినీ, ఎగిరే తేటినీ చూసి తన్మయులైతే చాలు; ఆ రోజుకి మీ పూజ అయిపోయిందని ఒక మహనీయుడు సెలవిస్తాడు. షడ్రసోపేతంగా వండిన తన వంటకాలను తృప్తిగా ఆరగిస్తే ఇల్లాలు ఎంత ఆనందిస్తుందో, తన వ్యక్తరూపమైన ప్రకృతిని చూసి పరవశిస్తే దేవుడు అంతే ఆనందిస్తాడని ఆయన అంటాడు. నది ఒడ్డున నిలబడి దాని పుట్టుకను, గమనాన్ని, పోను పోను అది చెందే వైశాల్యాన్ని, అది ప్రవహించిన పొడవునా దానితో అల్లుకున్న మన జీవనబంధాన్ని స్మరించుకున్నా అది పుణ్య స్నానంతో సమానమేనని ఒక కథకుడు రాస్తాడు. కృష్ణశాస్త్రి గారు పల్లవించినట్టు అడుగడుగునా, అందరిలోనే కాదు; ప్రకృతిలో అన్నింటిలోనూ గుడి ఉంది.

అనాది నుంచీ నేటివరకూ మనిషి ఊహలో, భావనలో మనిషీ, దేవుడూ, ప్రకృతీ పడుగూ పేకల్లా అల్లుకునే వ్యక్తమయ్యారు. ఋగ్వేద కవి చూపులో ప్రకృతి పట్ల వలపు, మెరుపు ఎంతో ముగ్ధంగా, సరళంగా, సహజసుందరంగా జాలువారుతాయి. ''వెలుగులు విరజిమ్మే ఓ ఆకాశపుత్రీ, సకల సంపదలకూ నెలవైన ఉషాదేవీ! వస్తూ వస్తూ మాకు ధనరూపంలోని ఉషస్సును వెంట బెట్టుకుని రా'' అని ఒక ఋక్కు అంటుంది. ఋగ్వేద కవి చింతనలో అగ్ని ధూమధ్వజుడు; సూర్యకాంతితో తళతళా మెరుస్తూ ధ్వనిచేసే సముద్రపు అలల్లా వ్యాపిస్తాడు. ''తమసానదీ జలాలు మంచివాడి మనసులా స్వచ్ఛంగా ఉన్నా''యని వాల్మీకి వర్ణిస్తాడు. సుగ్రీవుడితో అగ్ని సాక్షిగా స్నేహం చేసిన రాముడు, ''వర్షాకాలంలో మంచి పొలంలో వేసిన పంట ఫలించినట్టు నీ కార్యాన్ని సఫలం చేస్తా''నంటాడు. ఆ మాటలకు సుగ్రీవుడు, ''నదీవేగంలా హఠాత్తుగా ఉరవడించిన కన్నీటివేగాన్ని ధైర్యంతో నిలవరించుకున్నా''డని రామాయణ కవి అంటాడు.

ఏ కాలంలోనూ మనిషీ, ఋషీ, కవీ ప్రకృతి పొత్తిళ్లలో పసివాడిగానే ఉన్నాడు తప్ప ప్రకృతికి దూరం కాలేదు. ఇతిహాస కావ్య ప్రబంధాలలో ప్రకృతి వర్ణనలు తప్పనిసరి భాగాలు. శారద రాత్రుల్లో ఉజ్వల తారకలు, కొత్త కలువ గంధాన్ని మోసుకొచ్చే సమీరాలూ, కర్పూరపు పొడిలా చంద్రుడు వెదజల్లే వెన్నెల వెలుగులూ, చెంగలువ కేదారాలూ, మావులూ క్రోవులూ పెనవేసుకున్న అడవులూ, పక్షులు బారులు కట్టి ఇంటిముఖం పట్టే సూర్యాస్తమయ దృశ్యాలూ, తలను రెక్కల్లో పొదవుకుని పంటకాలువల దగ్గర నిద్రించే బాతువుల సన్నివేశాలూ... ఇలా కవి ఊహల రస్తాకెక్కని ప్రకృతి విశేషం ఏదీ ఉండదు. పత్రం పుష్పం ఫలం తోయం రూపంలో ప్రకృతి భాగం కాని పూజా ఉండదు. వినాయకుని పూజలో ఉపయోగించే మాచీ, బృహతి, బిల్వం, ధత్తూరం, బదరి, తులసి, మామిడి, కరవీరం, దేవదారు, మరువకం లాంటి ఇరవయ్యొక్క పత్రాల పేర్లే చెవులకు హాయిగొలిపి ఆకుపచ్చని చలవపందిరి వేసి మనసును సేదదీర్చుతాయి. అమ్మవారి స్తుతుల నిండా పూవులూ, వనాలూ పరచుకుంటాయి. చంపకాలు, సౌగంధికాలు, అశోకాలు, పున్నాగాలతో అమ్మ ప్రకాశించిపోతుంది. కదంబ పూలగుత్తిని చెవికి అలంకరించుకుంటుంది. చాంపేయ, పాటలీ కుసుమాలు తనకు మరింత ప్రియమైనవి. శిరసున చంద్రకళను ధరిస్తుంది.

ప్రకృతి వెంటే పర్యావరణమూ గుర్తురావలసిందే. పర్యావరణ స్పృహ ఇప్పుడే మేలుకొందనుకుంటాం కానీ, ప్రకృతిలో భాగంగా మనిషి పుడుతూనే పెంచుకున్న స్పృహ అది. రావణ సంహారం తర్వాత రాముడు అయోధ్యకు వెడుతూ, వానరులు ఎక్కడుంటే అక్కడ చెట్లు సమృద్ధిగా ఉండాలనీ; అవి అన్ని కాలాల్లోనూ విరగ కాయాలనీ; నదుల్లో నీరు నిత్యం ప్రవహిస్తూ ఉండాలనీ ఇంద్రుని వరం కోరాడు. పాండవులు ద్వైతవనంలో ఉన్నప్పుడు ఆ అడవిలోని చిన్న జంతువులు ధర్మరాజుకు కలలో కనిపించి, ''మీరు రోజూ మమ్మల్ని వేటాడి చంపడంవల్ల మా సంఖ్య తగ్గిపోయింది, బీజప్రాయంగా మిగిలాం, మేము పూర్తిగా నశించేలోగా దయచేసి మరో చోటికి వెళ్లం''డని ప్రార్థించాయి. విశ్వనాథవారు తన 'వేయిపడగలు' నవలలో పర్యావరణానికి ప్రతీకగా పసరిక అనే పాత్రనే సృష్టించారు. ఆధునిక వేషభాషల వ్యామోహంలో పడీ, జీవ వైవిధ్యాన్ని దెబ్బతీసే వ్యవసాయ పద్ధతుల వల్ల పర్యావరణ విధ్వంసం ఏ స్థాయిన జరుగుతోందో ఆ పాత్ర ద్వారా గంట కొట్టి చెప్పారు.

పూర్వకాలపు రాజులు అడవిని, అటవీ జనాన్ని, సంపదను పర్యావరణ భద్రతకు తోడ్పడే స్వతంత్ర అస్తిత్వాలుగా చూశారు తప్ప, తమ రాజ్యంలో భాగం అనుకోలేదు. ఇప్పుడా వివేచన అంతరించి అడవులు రాజ్యానికి పొడిగింపుగా మారి బహుముఖ ధ్వంసరచనకు లక్ష్యాలయ్యాయి. ప్రకృతికి పండుగకు ఉన్న ముడి తెగిపోయి ప్రతి పండుగా పర్యావరణంపై పిడికిటిపోటుగా మారడం చూస్తున్నాం. ప్రకృతిని మనం రక్షిస్తే ప్రకృతి మనల్ని రక్షిస్తుందన్న సంగతిని గుర్తు చేసుకోడానికి నేటి వినాయకచవితి కన్నా గొప్ప సందర్భం ఏముంటుంది!

ఒకేసారి ఓటు ప్రజాస్వామ్యానికి చేటు

కామెంట్



కరణ్ థాపర్

'ఒకే దేశం– ఒకే ఎన్నిక'ను సమర్థించే వారి దగ్గర రెండు వాదనలు ఉన్నాయి. మొదటిది – ఖర్చు తగ్గుతుంది. రెండవది – ఒకేసారి ఎన్నికలు జరగడం వల్ల ఎన్నికల నియమావళి ఆంక్షలు దేశవ్యాప్తంగా ఒకే కాలానికి వర్తింపులో ఉంటాయి. దాని వల్ల అభివృద్ధి కుంటుపడదు. ఇక వ్యతిరేక వాదనలు వివేచన, వాస్తవికతల్లోంచి జనించినవి. ఓటు హక్కును 'ప్రజాస్వామ్యంలోని అత్యంత ప్రాథమికమైన భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ' అని చెబుతారు. ఆ హక్కుకు 'ఒకే దేశం–ఒకే ఎన్నిక' విధానం పరిమితులను విధిస్తుంది. పార్లమెంటరీ ఎన్నికలు ఇప్పటికే అధ్యక్ష తరహా ఎన్నికలుగా మారుతున్న పరిస్థితుల్లో, ఈ ఏకకాల ఎన్నికలు పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని మొత్తంగానే నాశనం చేసే ప్రమాదం ఉంది.

'ఒకే దేశం–ఒకే ఎన్నిక' వల్ల ప్రయోజనాలు, నిష్ప్రయోజనాలను నేను సరిగ్గా, సరళంగా, సమతులంగా చెప్పగలనేమో చూద్దాం! 'ఒకే దేశం – ఒకే ఎన్నిక' అనే భావన పైన, ఆ ఆవశ్యకత పైన అవగాహన కోసం ఇది మీకు సహాయకారిగా ఉండవచ్చు.

'ఒకే దేశం – ఒకే ఎన్నిక'ను సమర్థించే వారి దగ్గర రెండు వాదనలు ఉన్నాయి. మొదటిది, ఖర్చు తగ్గుతుంది. కదా మరి, దేశ వ్యాప్తంగా ఒకేసారి ఐదేళ్లకు జరిగే ఎన్నికల ఖర్చు... వివిధ సమయాలలో అనేకసార్లు జరిగే పలు ఎన్నికల మొత్తానికీ అయ్యే ఖర్చు కంటే తక్కువగానే ఉంటుంది. అయితే థరూర్, చక్రవర్తి అదేమంత చెప్పుకోదగిన పొదుపు కాదని అంటున్నారు. ఏడాదికి రూ. 5,000 కోట్ల లోపే ఉండే ఆ పొదుపు మొత్తం లేకున్నా కూడా భారత్ వంటి ఒక పెద్ద ఆర్థిక వ్యవస్థలో అది ఏమంత నిర్ణయాత్మకమైన ఆందోళన కారకం కాదనేది వారి వాదన.

రెండవ అనుకూల వాదన ఏమిటంటే, దేశం మొత్తానికీ ఒకేసారి ఎన్నికలు జరగడం వల్ల ఎన్నికల నియమావళి ఆంక్షలు దేశవ్యాప్తంగా ఒకే కాలానికి వర్తింపులో ఉంటాయి. దాని వల్ల ఎప్పుడూ ఏదో ఒకచోట అమలులో ఉండే ఎన్నికల ఆంక్షల కారణంగా అభివృద్ధి కుంటుపడటం అనే సమస్య ఉండదు. ప్రస్తుతం సార్వత్రిక ఎన్నికల నియమావళి అన్నది దేశవ్యాప్తంగా అమలుకావలసి ఉన్నప్పటికీ రాష్ట్ర స్థాయిలో ఆ నియమావళి అమలు పెద్ద విషయంగా ఉండటం లేదు. అసలు అమలవుతోందా అన్నది కూడా ముఖ్యమైన ప్రశ్న. అక్కడ ఆంక్షల్ని అతిక్రమిస్తున్నది అధికార పార్టీకి చెందినవారైతే నియమావళి నిస్సందేహంగా అమలు కానట్లే!

ఇక వ్యతిరేక వాదనలు వివేచన, వాస్తవికతల్లోంచి జనించే ప్రాథమికమైన స్వభావం కలిగి ఉన్నవి. ఓటు హక్కును ''ప్రజాస్వామ్యంలోని అత్యంత ప్రాథమికమైన భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ'' అని చెబుతారు. ఆ హక్కుకు 'ఒకే దేశం– ఒకే ఎన్నిక' పరిమితులను విధిస్తుంది. ఉదాహరణకు, ప్రభుత్వం తన మెజారిటీ కోల్పోయినప్పుడు కొత్త ప్రభుత్వాన్ని ఎన్నుకునేందుకు ఓటర్లకు ఉన్న హక్కును హరించేలా పార్లమెంటును కొనసాగించే మార్గాల అన్వేషణ జరిగే అవకాశం ఉంటుంది.

అలాగే 'ఒకే దేశం–ఒకే ఎన్నిక' అనే ఈ భావన మనం కోరుకుంటున్న ప్రజాస్వామ్య ప్రయాణ మార్గాన్ని విఘాత పరచనూవచ్చు. ఆ మార్గాన్ని మనం విస్తృతపరచుకోవడానికి, మరింత లోతుకు తీసుకు వెళ్లడానికి 'ఒకే దేశం–ఒకే ఎన్నిక' విధానం అడ్డుపడుతుంది. ఉదాహరణకు, ఓటు వేసి ఎన్నుకున్న నాయకులను తిరిగి వెనక్కు పంపే హక్కు మనకు ఉండాలి. 50 ఏళ్ల క్రితమే 1974లో వాజ్‌పేయి ఈ 'రీకాల్' హక్కు అవసరాన్ని గుర్తించారు. అయితే 'ఒకే దేశం–ఒకే ఎన్నిక' ఈ హక్కుకు విరుద్ధమైనది. ఐదేళ్లకోసారి ఎన్నికలు అనే విధానం... ఓటు వేసి, ప్రభుత్వాలను ఎన్నుకునేందుకు పౌరులకున్న అవకాశాన్ని కుదించడం ద్వారా మన ప్రజాస్వామ్యాన్ని ఇరుకైనదిగా మార్చేస్తుంది.



ఇప్పుడిక 'ఒకే దేశం–ఒకే ఎన్నిక' విధానం అమలుకు అవసరమైన రాజ్యాంగ సవరణల చిక్కుల దగ్గరికి వద్దాం. మొదటిది– ఎన్నికల ఏకకాలీనత కోసం సవరణలు! ఆ సవరణల వల్ల కొన్ని రాష్ట్రాల్లో శాసనసభలు పొడిగింపును పొందుతాయి. మరికొన్ని చోట్ల శాసనసభల కాలపరిమితిని కుదించాల్సి వస్తుంది. అప్పుడది కచ్చితంగా ప్రజాతీర్పునకు వ్యతిరేకంగా ఆడుతున్న ఆట అవదా? ఓటర్లు ఇచ్చిన ఐదేళ్ల కాలాన్ని ఏకపక్షంగా తగ్గించడమో, పెంచడమో చేసినట్లే కదా!

ఐదేళ్ల కన్నా ముందే ప్రభుత్వం పడిపోతే అప్పుడు రెండో రకం సవరణలు అవసరం అవుతాయి. మిగిలిన కాలానికి రాష్ట్రపతి పాలన రాష్ట్ర స్థాయిలో అవాంఛనీయమైనదీ, కేంద్రస్థాయిలో అసాధ్యమైనదీ.

ఇందుకు ఒక పరిష్కారం– జర్మనీ తరహా నిర్మాణాత్మక అవిశ్వాస తీర్మానం. ఎలాగంటే, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే బలం ఉంటే తప్ప అవిశ్వాస తీర్మానంతో ప్రభుత్వాన్ని పడగొట్టడానికి లేదక్కడ. పడగొట్టినవాళ్లే ప్రభుత్వాన్ని నిలబెట్టాలి. వినడానికి బాగుంది కానీ, ఆచరణలో ఎల్లవేళలా ఇది సాధ్యమా? ఉదాహరణకు, పాలకపక్షం నుంచి చీలిపోయిన పక్షం, ప్రతిపక్షం వైపు మొగ్గు చూపడానికి నిరాకరిస్తే అప్పుడేం జరుగుతుంది? ఆ పరిస్థితుల్లో ప్రభుత్వం తన మెజారిటీని కోల్పోతుంది, కానీ ఆ స్థానంలోకి వచ్చేవారెవరూ లేకపోవడం వల్ల అలాగే కుంటుతూ నడుస్తుంది.

లేదా ఒకవేళ సంకీర్ణ కూటమిలోని భేదాభిప్రాయాల వల్ల బడ్జెట్‌కు పార్లమెంటులో ఆమోదం లభించలేదనే అనుకుందాం? అప్పుడిక పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలో అటువంటి ప్రభుత్వం తప్పనిసరిగా రాజీనామా చేయాల్సిందే. కానీ సభ్యుల బలం ఉన్న కారణంగా బడ్జెట్‌కు ఆమోదం పొందలేని ఆ ప్రభుత్వం ఏమీ కుప్పకూలి పోదు.

ఇలాంటి సందర్భాలలో ఐదేళ్ల కాల వ్యవధిలో మిగిలి ఉన్న కాలానికి మాత్రమే ఎన్నికలు నిర్వహించుకోవచ్చని ఎన్నికల సంఘం సూచించింది. అయితే అది ఓటు అనే వనరును నిర్లక్ష్యంగా ఉపయోగించుకున్నట్టు అవదా? ఓటు విలువ కొన్నిసార్లు ఐదేళ్ల కాలానికీ, మరి కొన్నిసార్లు ఐదేళ్లలో మిగిలిన భాగానికీ ఉంటుందా? ప్రజాస్వామ్యంలో రెండు రకాల ఓట్లు ఉండొచ్చా?

ఇవీ 'ఒకే దేశం–ఒకే ఎన్నిక' భావనకు సంబంధించి పైపైన ఆలోచిస్తేనే ఉత్పన్నమయ్యే ప్రాథమిక ఆందోళనలు. భారతదేశ ప్రజాస్వామ్యానికి సంబంధించి మరొక మూడు ఆందోళనకరమైన ప్రశ్నలు కూడా ఉన్నాయి. మొదటిది – పార్లమెంటరీ ఎన్నికలు ఇప్పటికే అధ్యక్ష తరహా ఎన్నికలుగా మారుతున్న పరిస్థితుల్లో, ఈ ఏకకాల ఎన్నికలనేవి ఆ ధోరణిని తీవ్రతరం చేసి మన పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని మొత్తంగానే నాశనం చేసే ప్రమాదం లేదా? రెండవది – ఒక జాతీయ పార్టీ మంచి ఊపులో ఉన్నప్పుడు, ఏక కాల ఎన్నికలు బహుళ పార్టీ వ్యవస్థను ఒకే పార్టీ ఉన్న దేశంగా మార్చకుండా ఉంటాయా? మూడవది – ఎన్నికలు మన ప్రజా శాసన సభ్యులను ప్రతిస్పందించే వారిగా, జవాబుదారీగా ఉండేవారిగా చేస్తాయని మనకొక నమ్మకం. అయితే ఐదేళ్లకోసారి మాత్రమే ఎన్నికలను నిర్వహిస్తే మధ్యలో ఏం జరిగినా వారు తమకు పట్టనట్లుగా, అహంకారంగా ఉండిపోయే అవకాశం లేదా?

ఈ సమస్యల గురించి జాగ్రత్తగా ఆలోచించండి. మరీ ముఖ్యంగా మూడు అంశాలపై మీరు దృష్టి పెట్టవలసిన అవసరం ఉంది: ఏకకాల ఎన్నికల ఆవశ్యకత, వాటిని అమలు చేయడంలో వచ్చే చిక్కులు, అనంతరం వచ్చే పర్యవసానాలు. ఆ తర్వాత 'ఇది సరైనదేనా?' అనే ప్రశ్నకు జవాబు ఇచ్చుకోండి.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

విడిపోయామా?



2014కు ముందు మనం అందరం భారతీయులం. 2014 తర్వాత మనం హిందువులం, ముస్లింలం, క్రైస్తవులం అయ్యాం.

– రేష్మా ఆలమ్, కాంగ్రెస్ సమన్వయకర్త

ఒక పరిష్కారం



నల్లమందు(పాపీ) సమస్యను నియంత్రించాలంటే, దాన్ని చట్టబద్ధం చేయాలి. అప్పుడు ఔషధ పరిశ్రమ కోసమే తప్ప, అక్రమ మాదక ద్రవ్యంగా ఉండదు కాబట్టి, లాభాలు పడిపోతాయి. సమస్య ఏమిటంటే – అధికారిక ధరలు గిట్టుబాటు కాక, చిన్న రైతులు దీని సాగును విరమించుకుంటారు; పెద్ద ఫార్మా కంపెనీలు జొరబడతాయి.

– ప్రదీప్ ఫన్‌జౌబామ్, మణిపూర్ కాలమిస్ట్

అవి నాటొచ్చుగా!



తమిళనాడు ప్రభుత్వ గ్రీన్ మిషన్‌లో భాగంగా 5.5 కోట్ల మొక్కలను సిద్ధం చేశారని వార్త. కానీ ఇందులో పళ్ల మొక్కలు ఎందుకు లేవు? రోడ్డుకు ఇరువైపులా ఉండే వేలాది పళ్ల మొక్కలు ఎంత మందికి ఉపయోగపడతాయో ఊహించండి!

– ఆర్. ప్రసాద్, జర్నలిస్ట్


అది చాలదా?



జాతి వివక్ష కారణంగా క్రికెట్ నుంచి దక్షిణాఫ్రికాను (ఒకప్పుడు) నిషేధించినప్పుడు, రాజ్య ప్రాయోజిత తీవ్రవాదం కారణంగా పాకిస్తాన్‌ను ఎందుకు నిషేధించకూడదు?

– నవరూప్ సింగ్, మేధాహక్కుల న్యాయవాది

అసలు సమస్య



మూర్ఖులను, తప్పడువార్తల వ్యాపకులనూ స్వేచ్ఛా సమాజాలు సహించవలసిందే. 'తప్పడు' వార్తల నుంచి మీ మెదడును శుద్ధి చేయడానికి ప్రభుత్వం పూనుకున్నదంటే, అది నిరంకుశాధికారానికి దారి తీస్తుంది.

– గాడ్ సాద్, బిహేవియరల్ సైంటిస్ట్

విశ్వాసంలో స్వేచ్ఛ



మెజారిటీ సంస్కృతి వల్ల యూదులు పీడనకు గురికాని అతి తక్కువ దేశాల్లో ఇండియా ఒకటి. భారత హిందువులు మత మార్పిళ్లకు బలవంతం చేయకపోవడం యాదృచ్ఛికం కాదు. ఒత్తిడి, బోధన, అప్రతిష్ఠపాలు చేయడం, ఇలా ఏ విధంగానూ... పరస్పరం మతాంతరీకరణకు పూనుకోని జనాల మధ్య సహజమైన గౌరవం ఉంటుంది.

– డేవిడ్ కోహెన్, జియు–జిత్సు ఛాంపియన్

సనాతన ధర్మమా? సమానత్వమా?

తమిళనాడు ముఖ్యమంత్రి కుమారుడు, సినీ నటుడు, స్వయానా మంత్రి అయిన ఉదయనిధి స్టాలిన్ సనాతన ధర్మాన్ని డెంగ్యూ, కలరా, మలేరియా లాంటి వ్యాధులతో పోల్చి దాన్ని నిర్మూలించాలనీ, దాని స్థానంలో రాజ్యాంగ విలువైన సమానత్వాన్ని స్థాపించాలనీ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో తీవ్ర దుమారాన్ని రేపాయి. ప్రస్తుతం దేశాన్ని పరిపాలిస్తున్నది... సనాతన ధర్మాన్నీ, హిందూత్వ భావజాలాన్నీ సమాజంలో నెలకొల్పాలని తీవ్రంగా కృషి చేస్తూ ఉన్నటువంటి ఆర్‌ఎస్ఎస్, దాని రాజకీయ విభాగం అయిన బీజేపీ కనుక సహజంగానే ఈ వ్యాఖ్యల్ని వారు తీవ్రంగా ఖండిస్తూ ఉన్నారు.

అరిషడ్వర్గాలకు దూరంగా ఉంటూ శాంతిని, సాత్విక భావాన్ని ప్రచారం చేయవలసిన సాధు పుంగవులు సైతం ఒక అడుగు ముందుకే వేసి ఉదయనిధి స్టాలిన్ తల నరికి తీసుకువస్తే వారికి కోట్ల రూపాయల నగదు బహుమతిని కూడా ప్రకటించారు. అన్ని స్థాయుల్లోని బీజేపీ నాయకులు ఉదయనిధిపై నిప్పులు చెరుగుతున్నారు. కానీ మణిపూర్‌లో ఇద్దరు స్త్రీలను మానవత్వం సిగ్గుపడేలా, ప్రపంచ దేశాల ముందు మనం తలదించుకునేలా, నగ్నంగా ఊరేగించి అత్యాచారం చేసిన సంఘటన పట్ల ఈ నాయకులంతా, దేశ ప్రధానితో సహా కొన్ని నెలల పాటు మౌనం వహించారు. ఒక్క మాట మాట్లాడలేదు.

ఇంతకీ సనాతన ధర్మం అంటే ఏమిటి? సనాతన ధర్మం అంటే నిత్యమైన, ఎప్పుడూ మారని, శాశ్వతమైన జీవిత విధానం అని అర్థం చెప్పుకోవచ్చు. నిజానికి శాశ్వతమైనది ఏదైనా ఉన్నదీ అంటే, అది కేవలం 'మార్పు' మాత్రమే! మారనిది అంటూ ఈ ప్రపంచంలో ఏదీ లేదు. సనాతన ధర్మానికి వేద ప్రామాణికతే మూలం. అదేం చెప్పింది? ఏ మత గ్రంథం చెప్పని విధంగా వేదాలు, పుట్టుకతోనే మనుషులు అసమానులనీ, నాలుగు వర్ణాలుగా పుట్టారనీ, ఈ అసమానమైన, భేద భావంతో కూడిన సృష్టిని సాక్షాత్తు పరబ్రహ్మే చేశాడనీ, మనుషులు ఎన్నటికీ సమానులు కాలేరనీ చెబుతాయి.

ఈ చాతుర్వర్ణ వ్యవస్థను కేవలం వేదాలు మాత్రమే ప్రామాణికం చేశాయి అనుకుంటే పొరపాటు. ఆనక వచ్చిన రామాయణం, మహాభారతం లాంటి ఇతిహాసాలతో సహా భగవద్గీత లాంటి తాత్విక గ్రంథాలు కూడా ప్రామాణికం చేశాయి. వీటన్నింటినీ మించి మనుస్మృతి చాతుర్వర్ణ వ్యవస్థను శిలా సదృశ్యంగా మార్చడమే కాకుండా ఆ నాలుగు వర్ణాలకు ధర్మాలను, విధులను సైతం నిర్దేశించింది. ఆ విధులను ఉల్లంఘిస్తే వేయవలసిన శిక్షలను కూడా చాలా స్పష్టంగా వివరించింది.

ఈ వర్ణ వ్యవస్థ మెజారిటీ ప్రజలను బానిసలుగా మార్చటానికి ఉపయోగపడిందే తప్ప సమానత్వాన్ని సాధించడానికి కానీ, సమానమైన అవకాశాలను కల్పించడానికి కానీ ఉపయోగపడలేదు. అయినా నేడు ఈ హిందూత్వవాదులు సనాతన ధర్మమే ఉన్నతమైనదనీ, అది శాశ్వతమైనదనీ మానవాళి జీవించడానికి అత్యున్నతమైన జీవిత విధానాన్ని సమకూర్చేది సనాతన ధర్మమే అనీ నిస్సిగ్గుగా నమ్మబలుకుతున్నారు.

తమ మత విశ్వాసాలకు వ్యతిరేకమైన అభిప్రాయాలు వెలిబుచ్చిన వారిని చంపి వేస్తామంటూ ఫత్వాలు జారీ చేసే తాలిబన్లకూ, ఉదయనిధి స్టాలిన్‌ను చంపివేస్తామనీ, చంపివేసిన వారికి కోట్ల రూపాయల నగదు బహుమతిని ఇస్తామనీ ప్రకటిస్తున్న సనాతన వాదులకూ మధ్య తేడా లేదని కూడా మనం గమనించాలి.

పదేళ్ల సనాతనవాదుల పరిపాలన తరువాతైనా ఈ దేశపు మెజారిటీ ప్రజలైన బహుజనులు తమకు సనాతన ధర్మం కావాలో, లేక రాజ్యాంగం ప్రసాదించిన సమానత్వ విలువలు కావాలో తేల్చుకోవలసిన సమయం ఆసన్నమైంది. మేల్కొనకపోతే మనకు రానున్నవి చీకటి రోజులే!

– టి. హరికృష్ణ, మానవ హక్కుల వేదిక
మొబైల్: 94940 37288

పర్సనల్ చట్టాలను క్రోడీకరించినప్పుడే...

విశ్లేషణ



ప్రొ॥ మాడభూషి శ్రీధర్

స్వాతంత్ర్యానంతరం (1955–58) భారత ప్రభుత్వం 'హిందూ వివాహ చట్టం', 'హిందూ వారసత్వ చట్టం', 'హిందూ మైనారిటీ–సంరక్షకత్వ చట్టం', 'హిందూ దత్తత–నిర్వహణ' వంటి చట్టాలను తీసుకువచ్చి 'హిందూ కోడ్'గా క్రోడీకరించింది. కాని ముస్లిం, క్రైస్తవం, పార్సీ వంటి ఇతర మతాల వారి సివిల్ చట్టాలను క్రోడీకరించే పని జరగలేదు. బ్రిటిష్‌వాళ్ల కాలంలో ఏమున్నాయో అవే కొనసాగుతున్నాయి. అందుకే అందరికీ కామన్‌గా వర్తించే ఉమ్మడి పౌర స్మృతి (యూసీసీ) ఉండాలనే వాదం తరచూ తెరమీదికి వస్తూ ఉంది. స్వాతంత్ర్యానికి ముందే భారతీయ క్రిమినల్ కోడ్‌ను బ్రిటీష్‌వాళ్లు తయారు చేశారు. కానీ ఉమ్మడి పౌర స్మృతి (యూసీసీ) జోలికి మాత్రం పోలేదు.

ప్రస్తుతం 21వ లా కమిషన్ ముస్లింలు 'మూడుసార్లు తలాక్' అని పలికి విడాకులు తీసుకునే విషయం తప్ప ఇతర యూసీసీ అంశాల మీద చర్చించింది. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి బల్బీర్ సింగ్ చౌహాన్ కమిషన్‌కు నాయకత్వం వహించారు. దేశంలో పెళ్లి, విడాకులు, వారసత్వంగా వచ్చే ఆస్తి, పిల్లలను దత్తత తీసుకోవడం వంటి విషయాలకు సంబంధించి చట్టాలు అన్ని మతాలకూ ఒకేలా లేవు. ఆ యా మతాల విశ్వాసాలూ, నమ్మకాలను బట్టి పర్సనల్ లా ఉంటుంది. ఇప్పుడు అందరికీ ఉమ్మడి సివిల్ కోడ్ తేవాలంటే వీటన్నింటినీ హేతుబద్ధంగా క్రోడీకరించవలసి ఉంటుంది.



ముస్లిం పర్సనల్ లా (షరియత్) అప్లికేషన్ యాక్ట్–1937, విడాకుల చట్టం–1869 వంటి చట్టాల్లో భిన్నమైన నియమాలు ఉన్నాయి. వాటిని ఇతర మతాలతో హిందూ నియమాలతో సమానం చేయడానికి సమగ్రంగా పరిశోధించవలసి ఉంది. ముస్లిం మతంలో భర్త భార్యకు విడాకులు ఇస్తే భరణం చెల్లించవలసిన అవసరం లేదు. కేవలం విడాకులు పొందిన 90 రోజుల (ఇద్దాత్) కాలానికి మాత్రమే ఆమెకు భరణం లభిస్తుంది. కానీ 1985 నాటి షాబానో కేసులో సుప్రీం కోర్టు ముస్లిం పర్సనల్ లాను పరిగణించకుండా భర్త జీవితాంతం షాబానోకు భరణం చెల్లించాలని ఆదేశించింది. ముస్లింలు తమ మత చట్టాల్లో ఇది జోక్యం చేసుకోవడమేనని ఆందోళనలు చేయడంతో కాంగ్రెస్ ప్రభుత్వం సుప్రీం తీర్పుకు వ్యతిరేకంగా చట్టం చేసి ముస్లిం పర్సనల్ లా ప్రకారం 90 రోజులే భరణం ఇవ్వాలని చట్టం చేసింది.

ఇక హిందూ సివిల్ కోడ్ విషయానికి వస్తే... హిందువులలో దత్తత ముఖ్యమైంది. దత్తత ప్రక్రియలో హోమం, దత్తత, లిఖిత పత్రం కూడా ఉంటాయి. ఇటువంటి సంప్రదాయం వేరే దేశంలో లేదు. సంతానాన్ని కనలేనివారు ప్రపంచవ్యాప్తంగా దత్తత తీసుకోవడం మామూలు విషయమే. అనాథల సమస్య పరిష్కారమవ్వడానికి దత్తత ఒక దివ్య మార్గం. కానీ లక్షలాది రూపాయలు వెచ్చించి రకరకాల పద్ధతుల్లో పిల్లలను కనడానికి ప్రయత్నించడం ముఖ్యంగా భారత్‌లో కనిపిస్తుంది. జువెనైల్ జస్టిస్ చట్టం–2000లో దత్తతకు సంబంధించిన విషయాలు అనేకం ఉన్నాయి.

'హిందూ అవిభక్త కుటుంబం' అంటారు కదా, ఇది 'హిందూ' లేదా 'అవిభక్త' అనవచ్చునా? 'హిందూ అవిభక్త కుటుంబ (హెచ్‌యూఎఫ్) రద్దును ప్రతిపాదిస్తున్న నిబంధనను చేర్చడం తప్పనిసరా? ఆ విధంగా చేయడం వల్ల అనేక సమస్యలు ఉత్పన్నమవుతాయి' అని 2018 లా కమిషన్ అధ్యక్షులు అన్నారు. హిందూ చట్టాల కింద లోపభూయిష్టమైన కోపార్సెనరీ (కోపార్సెనరీ అంటే హిందూ సమష్టి కుటుంబంలో పుట్టినందుకు వారసత్వంగా ఆస్తి, కొన్ని అధికారాలు పొందే హక్కుదారుడు) లెక్క చాలా సంక్లిష్టంగా తయారైంది. దాదాపు సమష్టి కుటుంబాలు లేకుండా పోయినా కొందరు హెచ్‌యూఎఫ్ పేరు చెప్పి పన్నులు ఎగ్గొట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. అందుకే 'హిందూ అవిభక్త కుటుంబా'నికి సంబంధించిన వెసులుబాటులను రద్దు చేయాలని 2018 లా కమిషన్ అధ్యక్షులు సూచించారు. సమష్టి టెనెన్సీ బదులు 'టెనెన్సీ ఇన్ కామన్'తో జన్మతో వచ్చే హక్కులు కోపార్సెనర్లకు ఉండకూడదు అని కూడా సిఫార్సు చేశారు.


ఇంతకు చెప్పొచ్చేదేమిటంటే... యూసీసీని రూపొందించాలంటే హిందూ మతంతో సహా అన్ని మతాలకు సంబంధించిన చట్టాల్లో మార్పు చేర్పులు చేయడమో, కొన్నింటిని తొలగించడమో చేయవలసి ఉంటుంది.

వ్యాసకర్త మహీంద్రా యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ లా ఎడ్వైజర్

ఏకదంతం ఉపాస్మహే!

వేదకాలం నుంచి నేటిదాకా ఈ దేశంలో ఆస్తికులందరూ ఏ ముఖ్యమైన పని తలపెట్టినా, దాన్ని గణపతి పూజతోనే ఆరంభం చేస్తూ వస్తున్నారు. ఇష్ట దేవత ఎవరయినా కావచ్చు. కార్యారంభంలో అగ్రపూజ్యుడు మాత్రం గజాననుడు. కారణమేమిటి?

ఎవరు ఏ కార్యం సంకల్పించి ఆరంభించినా, కార్యసిద్ధినీ, విజయాన్నీ, సాఫల్యాన్నీ కోరుకొంటారు. కార్య నిర్వహణలో ఎదురయ్యే అనుకోని ఆటంకాలు 'విఘ్నాలు'. ఇవి కార్యసాధకుడి సమర్థతకు పరీక్షలు. పురుష కారానికి దైవానుగ్రహాన్ని తోడు చేసి, విఘ్నాలను తొలగించుకోగలిగితేనే విజయం.



ధైర్యం లేని అల్పులు ఈ విఘ్నాలు కలుగుతాయన్న భయం చేత అసలు కార్యాలు చేపట్టరు. 'ఆరంభింపరు నీచ మానవులు విఘ్నాయాస సంత్రస్తులై'. మధ్యస్థులైన సామాన్యులు, పని మొదలెట్టి పదడుగులు వేస్తారు. కానీ కొంచెం పెద్ద విఘ్నాలు ఎదురవగానే 'మన వల్ల కాదులే' అని మధ్యలో వదిలేస్తారు. 'ఆరంభించి పరిత్యజింతురు–ఉరు విఘ్నాయత్తులై మధ్యముల్'. ధీరులూ, సమర్థులూ మాత్రం ఎంత పెద్ద విఘ్నాలు వచ్చినా భయపడక, ధైర్యోత్సాహాలతో వాటిని అధిగమించి విజయులవుతారు.

మనిషికీ కార్యసిద్ధికీ మధ్య నిలిచే ఈ 'విఘ్నా'లకు అధిపతి విఘ్నేశ్వరుడు. కనక ఏ సత్కార్యం ప్రారంభించినా – చిన్నదైనా పెద్దదైనా, లౌకికమైనదైనా, ఆధ్యాత్మికమైనదైనా, ముందు ఆయనను పూజించుకోవడంలో ఔచిత్యం ఉంది. విద్యారంభంలోనూ, వివాహాది కార్యాలలోనూ, యుద్ధాలలోనూ, సంఘర్షణలలోనూ, సంకటాలు ఎదురైనప్పుడూ, తొలుత 'అవిఘ్నమస్తు' అని ధూర్జటి నందనుడికి భక్తి శ్రద్ధలతో మొక్కుకొన్న వారికి విఘ్నాలను ఆయనే తొలగిస్తాడు. దాంతో అనుకొన్న పని అనుకున్నట్టు జరిగి విజయం సిద్ధిస్తుందని సాంప్రదాయికమైన విశ్వాసం.

ధీరులకూ, భీరులకూ, మధ్యస్థులకూ అందరికీ సర్వదా, సర్వ కార్యాలలో, విఘ్నవారణుడి అనుగ్రహం అవసరమే. భాద్రపద శుద్ధ చవితి – ఈ రోజు– సకల కార్యసిద్ధి ప్రదాయకుడైన 'శ్రీ శంభు తనయునకు, సిద్ధి గణ నాథునకు, వాసిగల దేవతా వందితునకు, ఆ సకల విద్యలకు ఆది గురువైనట్టి భూసురోత్తమ లోక పూజితునకు' త్రికరణ శుద్ధితో పూజలు జరిపి, ఆయన అనుగ్రహం పొందడానికి మరింత అనువైనది వినాయక చతుర్థి మహా పర్వదినం.

సర్వ విఘ్న హరం దేవం / సర్వ విఘ్న వివర్జితమ్,
సర్వ సిద్ధి ప్రదాతారం / వందేహం గణనాయకమ్!

– ఎం. మారుతి శాస్త్రి

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, భాద్రపద మాసం, **తిథి:** శు.తదియ ఉ.10.16 వరకు, తదుపరి చవితి, **నక్షత్రం:** చిత్త ఉ.11.06 వరకు, తదుపరి స్వాతి, **వర్జ్యం:** సా.4.55 నుండి 6.34 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.20 నుండి 1.09 వరకు, తదుపరి ప.2.44 నుండి 3.34 వరకు, **అమృతఘడియలు:** రా.2.56 నుండి 4.34 వరకు, వినాయక చవితి ; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 5.51, **సూర్యాస్తమయం:** 6.00.

క్లుప్తంగా...

వచ్చేనెల మొదటివారంలో రాష్ట్రానికి మోదీ?



సాక్షి, హైదరాబాద్: వచ్చేనెల మొదటివారంలో తెలంగాణ పర్యటనకు ప్రధాని నరేంద్ర మోదీ రానున్నట్టు పార్టీ వర్గాల సమాచారం. అక్టోబర్ 2, 3, 4 తేదీల్లో ఏదో ఒకరోజు ఈ పర్యటన ఉండొచ్చంటున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్, నిజామాబాద్ జిల్లాల్లో చేపట్టే వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసే అవకాశాలున్నట్టు తెలుస్తోంది. నిజామాబాద్ జిల్లాలో పసుపుబోర్డు ప్రారంభోత్సవంతో పాటు నిజామాబాద్‌లో రోడ్‌షో నిర్వహించాలని, లేని పక్షంలో మహబూబ్‌నగర్‌లో గానీ, నిజామాబాద్‌లో గానీ బహిరంగసభ ఏర్పాటు చేయాలని బీజేపీ యోచిస్తోంది.

పాలమూరువాసుల కల నెరవేరింది

కృష్ణా జలాలతో శివాభిషేకం చేసిన మంత్రి శ్రీనివాస్‌గౌడ్



జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): త్వరలో పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టు పరిధిలో కాల్వలను నిర్మించి ఉమ్మడి జిల్లాలోని బీడు భూములన్నింటినీ బంగారు పంటలు పండే నేలలుగా మారుస్తామని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శనివారం ఈ ప్రాజెక్టును సీఎం కేసీఆర్ జాతికి అంకితం చేయడంతో ఈ ప్రాంతవాసుల చిరకాల కోరిక నెరవేరిందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు నుంచి కృష్ణా జలాలను కలశాలలో తీసుకువచ్చిన మంత్రి ఆదివారం మహబూబ్‌నగర్‌లోని మోనేశ్వరస్వామి ఆలయంలో మహాశివునికి అభిషేకం చేశారు. అనంతరం జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విరాట్ విశ్వకర్మ జయంతి ఉత్సవాలు, మహాయజ్ఞం కార్యక్రమానికి హాజరై కృష్ణా జలాలతో ప్రత్యేకపూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రారంభించిన ఈ ప్రాజెక్టు నుంచి కృష్ణా జలాలను కలశాలలో తీసుకువచ్చి మొట్టమొదటిసారిగా శివునికి అభిషేకం చేయడం ఎంతో శుభప్రదమని అన్నారు. సాగునీటి రాకతో రైతులు బాగుపడతారని, అన్నదాత బాగుంటే అన్నిరంగాలు అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. వచ్చే ఏడాది నాటికి జిల్లాలోని భూములన్నింటికీ సాగునీరు అందేలా చేస్తామన్నారు.

కారు లోయలో పడి నలుగురి దుర్మరణం

- మరో నలుగురికి తీవ్రగాయాలు
- మహారాష్ట్రలో ఘటన
- విషాదం నింపిన విహారయాత్ర



లోయలో పడి నుజ్జునుజ్జయిన కారు

సాక్షి, ముంబై, ఆదిలాబాద్‌టౌన్: విహారయాత్రలో విషాదం చోటుచేసుకుంది. మహారాష్ట్రలోని అమరావతి జిల్లా చిక్కల్‌ధార సమీపంలోని ఘాట్ సెక్షన్‌లో కారు లోయలో పడింది. ఈ ఘటనలో నలుగురు మృతి చెందగా, మరో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి.. వివరాలు ఇలా ఉన్నాయి. తెలంగాణలోని నల్లగొండ, ఖమ్మం, ఏపీలో రాజమండ్రికి చెందిన ఆరుగురు ఆదిలాబాద్ జిల్లాలోని దక్కన్ గ్రామీణ బ్యాంక్ శాఖల్లో ఉద్యోగులుగా పనిచేస్తూ, ద్వారకానగర్‌లో ఉంటున్నారు. మరో ఇద్దరితో కలిసి విహారయాత్రకని కారులో ఆదివారం తెల్లవారుజామున బయల్దేరి వెళ్లారు. మరికొద్ది క్షణాల్లో అక్కడకు చేరుకుంటారనేలోపే... ఘాట్ మలుపు వద్ద వీరు ప్రయాణిస్తున్న కారు అదుపు తప్పడంతో 200 అడుగుల లోతులో ఉన్న లోయలో పడి నుజ్జునుజ్జు అయ్యింది. ఈ ప్రమాదంలో భీంపూర్ మండలంలోని అర్లి(టి) గ్రామానికి చెందిన గొల్లి వైభవ్ యాదవ్ (28), అదే గ్రామానికి చెందిన వాహన డ్రైవర్ షేక్ సల్మాన్ (31), నల్లగొండ జిల్లాకు చెందిన శివకృష్ణ (31), కోటేశ్వర్‌రావు (27) అక్కడికక్కడే మృతి చెందారు. ఖమ్మం జిల్లాకు చెందిన శ్యామ్‌రాజ్, రాజమహేంద్రవరంకు చెందిన సుమన్, నల్లగొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన యోగేష్ యాదవ్, కేతేపల్లి మండలం చీకటిగూడేనికి చెందిన హరీష్‌లు తీవ్ర గాయాలతో బతికి బయటపడ్డారు. సంఘటన జరిగిన వెంటనే స్థానికులు మహారాష్ట్ర పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వారు హుటాహుటిన అక్కడకు చేరుకొని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం అమరావతి, పరత్వాడ ఆస్పత్రులకు తరలించారు. మృతదేహాలకు చిక్కల్‌ధర ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు.

బీజేపీ బస్సుయాత్రలకు బ్రేక్?

రాష్ట్ర నాయకుల మధ్య సమన్వయలోపంతో యాత్రల రద్దుకు మొగ్గు

సంస్థాగతంగా పటిష్టతపై దృష్టి పెట్టాలని జాతీయ నాయకత్వం సూచన!

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 26 నుంచి రాష్ట్రంలోని మూడు ప్రాంతాల్లో బీజేపీ తలపెట్టిన రథ (బస్సు)యాత్రల యోచనను రద్దు చేసుకున్నట్టుగా పార్టీవర్గాల ద్వారా తెలుస్తోంది. 26 నుంచి వచ్చేనెల 14వ తేదీ దాకా మొత్తం 119 అసెంబ్లీ నియోజకవర్గాలు చుట్టేసేలా ఈ యాత్రలు చేపట్టాలని పార్టీ నాయకత్వం భావించిన విషయం తెలిసిందే. కాగా, ఈ యాత్రలను కుదించి చేపట్టాలా? లేక కొద్దిరోజులు వాయిదా వేయాలా? లేదంటే పూర్తిగా రద్దు చేసుకోవాలా? అనే మీమాంసలో పార్టీ ఉన్నట్టుగా చెబుతుండగా, రద్దుకే అధికశాతం నాయకులు మొగ్గుచూపుతున్నట్టు తెలుస్తోంది. రాష్ట్ర పార్టీ ముఖ్యనేతలంతా సమన్వయలేమి సమస్యతో ఉన్న నేపథ్యంలో.. మూడుచోట్ల యాత్రలకు ఎవరు నాయకత్వం వహిస్తారు? ఒకరికి బాధ్యతలిస్తే మరొకరు సహకరిస్తారా లేదా? ఇదికాక 19 రోజుల పాటు పూర్తి సమయం కేటాయించడం.. తదితర సమస్యలు బస్సు యాత్రల రద్దుకు దారితీసినట్టుగా చెబుతున్నారు.



అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ కార్యకలాపాల కంటే కూడా సంస్థాగతంగా పార్టీ పటిష్టత, ఎన్నికల మేనేజ్‌మెంట్‌కు సంబంధించి బూత్‌స్థాయిలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై దృష్టి పెట్టాలని రాష్ట్ర నాయకులకు జాతీయనాయకత్వం సూచించినట్టు సమాచారం. ఈనెల 26 నుంచి వచ్చేనెల 2 దాకా రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలింగ్ బూత్ కమిటీల పనితీరు ఎలా ఉంది ? ఇవి చురుకుగా పనిచేస్తున్నాయా లేదా ? అన్నింటికీ కన్వీనర్లు, సభ్యులు ఉన్నారా లేదా అన్న అంశాల పరిశీలనకు మొత్తం 450 మంది రెండేసి మండలాల చొప్పున పర్యటించాలని నిర్ణయించారు. దీంతో పాటు గతంలో మధ్యలోనిలిపేసిన 'బూత్‌సశక్తి అభియాన్'ను పూర్తిస్థాయిలో చేపట్టడం, దీనికి సంబంధించిన కార్యాచరణను కచ్చితంగా అమలు చేయడంపై దృష్టి పెట్టాలని రాష్ట్రనాయకులను జాతీయ నాయకులు ఆదేశించినట్టు సమాచారం. ఈ విషయంలో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, సంస్థాగత ఇన్‌చార్జి సునీల్ బన్సల్ మరీ పట్టుదలతో ఉన్నట్టుగా నాయకులు చెబుతున్నారు.

చరిత్రను తప్పుగా చిత్రీకరిస్తే
ప్రజలే బుద్ధి చెబుతారు

▶ మొదటి పేజీ తరువాయి



సభలో అమిత్‌షాతో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

స్వామి రామానందతీర్థ, బూర్గుల రామకృష్ణారావు, కేశవ్‌రావు కోరట్కర్, రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, కాళోజి నారాయణరావు, మర్రి చెన్నారెడ్డి, పీవీ నర్సింహారావు వంటి వీరులకు శిరస్సు వంచి అంజలి ఘటిస్తున్నామని అమిత్ షా చెప్పారు. ఈ పోరాటంలో లక్షలాది మంది పాల్గొన్నారని, వేలాది మంది అసువులు బాసారన్నారు. ఈ ఉద్యమంలో ఆర్యసమాజ్, హిందూ మహాసభ వంటి ఎన్నో సంస్థలు పనిచేశాయని.. ఉస్మానియా యూనివర్సిటీలో వందేమాతర నినాదంతో నిజాం గుండెల్లో రైళ్లు పరిగెత్తాయని అమిత్ షా పేర్కొన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక 399 రోజుల వరకు హైదరాబాద్ స్టేట్‌లో రజాకార్ల అరాచకం సాగిందన్నారు. జాతీయ జెండాను ఎగురవేసినందుకు పరకాలలో 1,500 మందిపై జలియన్ వాలాబాగ్ తరహాలో కాల్పులు జరిపారని, ఇందులో పలువురు అమరులవగా.. మరికొందరు గాయపడ్డారని అమిత్ షా గుర్తుచేశారు. ఇదే తరహాలో మహారాష్ట్రలోని పర్భణి, కర్ణాటకలోని బీదర్‌లోనూ సామాన్యులపై కాల్పులు జరిగాయన్నారు. వీటి నుంచి విముక్తి కల్పించేందుకు పటేల్ 1948 ఆగస్టు 10న సంకల్పించి సెప్టెంబర్ 17 నాటికి మిషన్ పూర్తిచేశారని వివరించారు. 75 ఏళ్ల వరకు దేశంలోని ఏ ప్రభుత్వం కూడా.. యువతకు తెలంగాణ స్వాతంత్ర్య పోరాటం గురించి చెప్పేందుకు ప్రయత్నించలేదన్నారు. హైదరాబాద్ విమోచన కోసం పోరాడిన అమరులకు శ్రద్ధాంజలి, యువత, విద్యార్థుల్లో దేశభక్తి పెంపు, రాష్ట్రానికి పునరంకితం కావాలనే మూడు ప్రధాన లక్ష్యాల సాధన కోసం ప్రధాని మోదీ చొరవతో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలను అధికారికంగా నిర్వహిస్తున్నామన్నారు.

మోదీకి జన్మదిన శుభాకాంక్షలు

ప్రపంచవ్యాప్తంగా దేశ గౌరవాన్ని ఇనుమడింపజేసేలా ప్రధాని మోదీ కృషి చేస్తున్నారని అమిత్ షా చెప్పారు. దీని ఫలితంగానే నేడు దేశ ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలోనే ఐదో స్థానానికి చేరిందని, జీ20 ద్వారా భారత సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి మరోసారి చాటామన్నారు. చంద్రయాన్–3 విజయవంతంతో ప్రపంచం దృష్టిని భారత్ ఆకర్షిస్తోందన్నారు. నేడు ప్రపంచమంతా భారత్ సాధిస్తున్న ప్రగతిని ప్రశంసిస్తోందని చెప్పారు. ఆదివారం మోదీ జన్మదినం సందర్భంగా సభావేదికపై నుంచి అమిత్‌షా శుభాకాంక్షలు తెలిపారు.

ప్రగతి నిరోధక శక్తులకు.. పరాజయమే

▶ మొదటి పేజీ తరువాయి

నివాళి అర్పించారు. అనంతరం పబ్లిక్ గార్డెన్స్‌లో జరిగిన కార్యక్రమంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. హైదరాబాద్ సంస్థానం 1948 సెప్టెంబర్ 17న రాచరికం నుంచి పరిణామం పొంది పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలోకి అడుగుపెట్టిందని.. ఈ చారిత్రక సందర్భాన్ని తెలంగాణ జాతీయ సమైక్యతా దినోత్సవంగా జరుపుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. సీఎం కేసీఆర్ ప్రసంగంలోని ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే..

''తెలంగాణ అనేక రంగాల్లో నంబర్ వన్‌గా నిలవడం మనందరికీ గర్వకారణం. అనతి కాలంలోనే విద్యుత్ సంక్షోభాన్ని అధిగమించి, అన్ని రంగాలకు 24 గంటల పాటు, వ్యవసాయానికి ఉచితంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమే. తలసరి విద్యుత్ వినియోగంలోనూ రాష్ట్రం నంబర్ వన్. రూ.3,12,398 తలసరి ఆదాయంతోనూ నంబర్ వన్‌గా నిలిచింది. రాష్ట్ర ప్రభుత్వం సంపద పెంచాలి. పెరిగిన సంపదను అవసరమైన వర్గాల ప్రజలకు పంచాలన్న ధ్యేయంతో ముందడుగు వేస్తోంది. సకల జనులకు సంక్షేమ ఫలాలు అందిస్తోంది. ఫలితంగా రాష్ట్రంలో పేదరికం తగ్గి, తలసరి ఆదాయం పెరిగింది. కొత్త వైద్య కళాశాలలతో ఏటా పది వేల మంది డాక్టర్లను తయారు చేసే స్థాయికి తెలంగాణ చేరుకుంటోంది.

డబుల్ బెడ్రూం ఇళ్ల పథకం ఆగదు

హైదరాబాద్‌లో పేదలకు లక్ష డబుల్ బెడ్రూం ఇళ్లను పంపిణీ చేస్తున్నాం. ఎవరైనా అర్హులకు ఇళ్లు రాకపోయినా ఆందోళన చెందవద్దు. ఈ పథకం నిరంతరం కొనసాగుతుంది. సొంత జాగా ఉన్న పేదలు ఇళ్లు కట్టుకునేందుకు 'గృహలక్ష్మి' పథకాన్ని అమలు చేస్తున్నాం. రాష్ట్రంలో మొత్తంగా 44 లక్షలమందికి ఆసరా పింఛన్లు అందిస్తున్నాం. ఇక అణగారిన దళితజాతి అభ్యున్నతి కోసం ప్రవేశపెట్టిన 'దళితబంధు' పథకంకొత్త చరిత్రను సృష్టించింది. బలహీన వర్గాల్లోని వృత్తిపనుల వారికి, మైనారిటీ వర్గాలకు కుటుంబానికి రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నాం. మద్యం దుకాణాల్లో గౌడ సోదరులకు 15 శాతం రిజర్వేషన్లు, ఈత, తాటిచెట్లపై పన్నురద్దు, 5 లక్షల వరకూ బీమా సౌకర్యం వంటి సంక్షేమ కార్యక్రమాలు తెచ్చాం. రజకులు, నాయీ బ్రాహ్మణులకు విద్యుత్ రాయితీ, ఆర్థికసాయంతో అండగా నిలుస్తున్నాం. ఆదివాసీలు, గిరిజనుల పోడు భూములకు పట్టాలిచ్చాం.



సభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్

రాష్ట్రంలో ఐటీ దూకుడు

తెలంగాణ ఏర్పడే నాటికి 3,23,390 మంది ఐటీ ఉద్యోగులుంటే.. ఇప్పుడు 9,05,715 మందికి పెరిగారు. ఐటీ ఎగుమతులు రూ.57,258 కోట్ల నుంచి రూ.2,41,275 కోట్లకు వృద్ధిచెందాయి. ఖమ్మం, వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, మహబూబ్‌నగర్, సిద్దిపేట వంటి ద్వితీయ శ్రేణి నగరాల్లోనూ ఐటీ టవర్లు నిర్మించుకున్నాం. హైదరాబాద్‌లో ట్రాఫిక్ రద్దీని నివారించి సిగ్నల్ ఫ్రీ సిటీగా మార్చేందుకు రూ.67 వేల కోట్లతో వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి పనులను పూర్తిచేస్తున్నాం. కొత్త సచివాలయం, అమరవీరుల స్థూపం, 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం నగరానికి మరింత శోభ చేకూర్చాయి.'' అని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు.

ముఖ్యనేతలకు అమిత్‌షా క్లాస్!

- కిషన్‌రెడ్డి, సంజయ్, ఈటలతో మొదట వేర్వేరుగా..
- ఆ తర్వాత ముగ్గురితోనూ సమావేశం
- సమన్వయలేమి, చేరికలు లేకపోవడంపై ఆగ్రహం

సాక్షి, హైదరాబాద్ : రాష్ట్ర బీజేపీ ముఖ్యనేతలకు ఆ పార్టీ అగ్రనేత, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా క్లాస్ తీసుకున్నట్టు తెలిసింది. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ముఖ్యనేతల మధ్య సమన్వయలేమి ప్రధాన సమస్యగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం. వ్యక్తిగత ప్రతిష్ట కంటే పార్టీ ప్రయోజనాల పరిరక్షణకే అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని, పార్టీ సమన్వయం సాధ్యం కాదని రాష్ట్రనేతలు భావిస్తే, దానిని తామే చూసుకుంటామని గట్టిగానే అమిత్‌షా హెచ్చరించారు. శనివారం రాత్రి కేంద్రమంత్రి, రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, జాతీయ ప్రధానకార్యదర్శి బండిసంజయ్‌తో, ఆదివారం మధ్యాహ్నం వీరిద్దరితో పాటు రాష్ట్రపార్టీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్‌తో సీఆర్‌పీఎఫ్ సెక్టార్ ఆఫీసర్స్ మెస్‌లో విడివిడిగా, ఆ తర్వాత ముగ్గురితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాబోయే ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, కార్యాచరణ ప్రణాళికపై స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. అయితే ఆదివారం రాష్ట్రపార్టీ ముఖ్యనేతలతో జరగాల్సిన అమిత్‌షా సమావేశం రద్దయ్యింది.

వరుసగా రెండురోజులు కిషన్‌రెడ్డి, సంజయ్‌లను పిలిపించడం పార్టీవర్గాల్లో చర్చనీయాంశమైంది. గతంలోనూ కొందరు బీఆర్‌ఎస్ ముఖ్యనేతలు బీజేపీలో చేరాల్సి ఉండగా, కాంగ్రెస్‌లో చేరారని, మళ్లీ తాజాగా కూడా అవే పరిణామాలు చోటుచేసుకుంటున్నాయని ప్రస్తావించినట్టు తెలిసింది. ఇటీవల క్యాసినో నిర్వాహకుడు చీకోటి ప్రవీణ్, మాజీ మంత్రి కృష్ణాయాదవ్‌ల చేరికకు ఓకే చెప్పి, చివరి నిమిషంలో రద్దు చేయడం ముఖ్యనేతల మధ్య సమన్వయలేమిని స్పష్టంగా ఎత్తిచూపిందన్నారు. ముగ్గురు నేతలు మూడు మార్గాల్లో పోతే, చేరికలకు అడ్డుచెప్పే ప్రయత్నాలు చేస్తే, ఇతర పార్టీల నుంచి చేరాలనుకునే వారు కూడా ఎలా వస్తారని ప్రశ్నించినట్టు తెలిసింది.

మానవత్వం మంటగలుస్తున్నా.. మోదీ మౌనం!

- జాతీయ సమైక్యతా దినోత్సవంలో మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ
- దేశంలో మైనార్టీలను అకారణంగా చంపుతున్నారని ఆరోపణ

గోల్కొండ (హైదరాబాద్): దేశంలో మైనార్టీలు, దళితులు, ఆదివాసీలపై దాడులు జరుగుతుంటే ప్రధాని మోదీ మౌనం వహిస్తున్నారని మజ్లిస్ పార్టీ అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ మండిపడ్డారు. హైదరాబాద్ స్టేట్ భారత యూనియన్‌లో కలిసిన 'సెప్టెంబర్ 17' సందర్భంగా ఆదివారం మజ్లిస్ ఆధ్వర్యంలో జాతీయ సమైక్యతా దినోత్సవం, తిరంగా ర్యాలీ కార్యక్రమాలను నిర్వహించారు. ఇందులో భాగంగా మాసబ్‌ట్యాంక్ హాకీ గ్రౌండ్‌లో జరిగిన బహిరంగ సభలో అసదుద్దీన్ మాట్లాడారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు చరిత్ర అసలు తెలియదని, లేక తెలిసీ అబద్ధాలు చెప్తున్నారని విమర్శించారు. దేశ స్వాతంత్ర్యానికి ముందు సంస్థానాలలో హైదరాబాద్ అతిపెద్దదని, నిజాం పాలకులకు హిందువులు, ముస్లింలు సలహాదారులుగా ఉండేవారని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ భూములు కొద్దిమందే హిందూ, ముస్లింల చేతుల్లో ఉండేవని.. అందులో కొందరు ముస్లిం జమీందారులు నిజాంకు గులాములుగా పనిచేశారన్నారు. కానీ హైదరాబాద్ విమోచనం, రజాకార్లను మట్టుపెట్టడమనే పేర్లతో అప్పటి భారత సైన్యం 20 వేల మంది సాధారణ ముస్లింలను కిరాతకంగా చంపిందని ఆరోపించారు. దీనిపై గఫారుద్దీన్, పండిత్ సుందర్‌లాల్‌లు సమగ్ర విచారణ జరిపి నాటి ప్రధాని నెహ్రూ, హోంమంత్రి పటేల్‌కు నివేదిక ఇచ్చారని.. కానీ పటేల్ సైన్యం చేసిన మారణ హోమాన్ని సమర్థించుకున్నారని అసదుద్దీన్ ఆరోపించారు.

స్వాతంత్ర్య పోరాటంలో ఎందరో ముస్లింలు..

మొదటి భారత స్వాతంత్ర్య పోరాటంలో అప్పటి హైదరాబాద్ మక్కా మసీదు ఈమామ్ మౌలానా, మరెందరో ముస్లిం యువకులు పాల్గొన్నారని అసదుద్దీన్ చెప్పారు. నాటి ఆంగ్ల సైనికులు మౌలానాను అరెస్టు చేసి అండమాన్‌కు తరలించారని, కాలాపాని శిక్షపడ్డ మొదటి భారతీయుడు మౌలానానే అని పేర్కొన్నారు. కానీ దేశ స్వాతంత్ర్య సమరంలో ఎలాంటి పాత్ర లేని ఆర్‌ఎస్‌ఎస్, అప్పటికి పుట్టని బీజేపీ.. ఇప్పుడు తామే దేశాన్ని ఉద్ధరిస్తున్నామంటూ మాట్లాడుతున్నాయని మండిపడ్డారు. దేశంలో మైనర్టీలను అకారణంగా చంపుతున్నారని ఆరోపించారు. రజాకార్లు, వారి వారసులు అంతమయ్యారని.. ఇప్పుడు గాడ్సే, సావర్కర్ల వారసులను బయటకు పంపాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు.



ప్రభుత్వ భూములు ఉండబట్టే ఈ ఘనత

నిజాం పాలకులకు ఎంతో దూరదృష్టి ఉండేదని, హైదరాబాద్‌కు వంద కిలోమీటర్ల దూరం వరకు కూడా విశాలమైన భూములను అప్పటి పాలకులు ప్రభుత్వ భూమిగా ఉంచారని అసదుద్దీన్ చెప్పారు. ఆ భూములతోనే హైదరాబాద్ అభివృద్ధి చెందిందని.. మాజీ సీఎం చంద్రబాబుతోనో, ఇతరులతోనో కాదని స్పష్టం చేశారు. నేడు తెలంగాణలో 200 ముస్లిం గురుకుల పాఠశాలలు ఉన్నాయని, అది తమ పోరాట ఫలితమేనన్నారు.



సీపీఐ బహిరంగ సభకు హాజరైన జనం

బీజేపీపై బీఆర్‌ఎస్ వైఖరేమిటి ?

సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా



సభలో మాట్లాడుతున్న సురవరం, రాజా

సాక్షి, మేడ్చల్ జిల్లా: మతోన్మాద బీజేపీపై బీఆర్‌ఎస్ వైఖరి ఏమిటో సీఎం కేసీఆర్ స్పష్టం చేయాలని భారత కమ్యూనిస్టుపార్టీ (సీపీఐ) జాతీయ ప్రధానకార్యదర్శి డి.రాజా డిమాండ్ చేశారు. దాగుడుమూతలతో ప్రజలను మోసం చేయగలనని ఆయన భావిస్తున్నాడని, ఈసారి తెలంగాణ ప్రజలు మోసపోరన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సందర్భంగా హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఆదివారం సీపీఐ బహిరంగసభ జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన రాజా మాట్లాడుతూ కాంగ్రెస్ సహా లౌకిక, ప్రజాతంత్ర పార్టీలన్నీ బీజేపీని ఓడించేందుకు ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. నాటి నిజాం వ్యతిరేక పోరాటం, స్వాతంత్ర్య సంగ్రామంలో బీజేపీ మాతృసంస్థ ఆర్‌ఎస్‌ఎస్, జనసంఘ్ పాత్ర ఏమిటో కేంద్ర హోంశాఖమంత్రి అమిత్ షా చెప్పగలరా? అని ఆయన సవాల్ విసిరారు. ఇండియా కూటమిని ప్రకటించిన వెంటనే మోదీకి కలవరం మొదలైందని అన్నారు. తెలంగాణచరిత్రను వక్రీకరిస్తూ అబద్ధాలాడుతున్నారని, దేశ చరిత్రను పునర్ లిఖించేందుకు మోదీ, షా ప్రయత్నిస్తున్నారన్నారు. ప్రతి అంశాన్ని హిందూ, ముస్లిం కోణంలో చూడడం మానుకోవాలని చెప్పారు.

మతోన్మాద శక్తుల నుంచి విముక్తి చేయాలి

సంఘ్ పరివార్, హిందూత్వ, మతోన్మాద శక్తుల నుంచి భారతదేశాన్ని విముక్తి చేయాల్సిన అవసరముందని సీపీఐ సీనియర్‌నేత సురవరం సుధాకర్‌రెడ్డి అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎవరికి మెజారిటీ రాకపోతే బీజేపీకి ఓటు వేసి, మంత్రివర్గంలో చేరాలని కేసీఆర్ ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. బీఆర్‌ఎస్, ఎంఐఎంలు బీజేపీ ప్రభుత్వానికి పరోక్ష మద్దతు ఇస్తున్నాయని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ విమర్శించారు. ఈ సభలో కూనంనేని సాంబశివరావు చాడా వెంకట్‌రెడ్డి, సయ్యద్ అజీజ్, కె.శ్రీనివాస్‌రెడ్డి, పల్లా వెంకట్‌రెడ్డి, పశ్య పద్మ పాల్గొన్నారు.

కన్న తండ్రే కాలయముడై..

మద్యం మత్తులో రెండేళ్ల కూతురిని కొట్టి చంపాడు

సంగారెడ్డి అర్బన్: కన్నబిడ్డ పాలిట తండ్రే కాలయముడయ్యాడు. బిడ్డ ఏడుస్తుందన్న కోపంతో మద్యం మత్తులో విచక్షణా రహితంగా కొట్టాడు. ఆ దెబ్బలు తాళలేక చిన్నారి తుదిశ్వాస విడిచింది. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఈనెల 14న జరిగింది. వివరాలను సంగారెడ్డి డీఎస్పీ రమేశ్ కుమార్ ఆదివారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. సర్దాపూర్ మండలం ఎర్రకుంట తండాకు చెందిన మడావత్ సురేశ్ (25) భార్య వనిత, రెండేళ్ల కూతురు నందినితో కలిసి రెండు నెలల క్రితం బతుకుదెరువు కోసం సంగారెడ్డి వచ్చాడు. మద్యానికి బానిసైన సురేశ్ జులాయిగా తిరిగేవాడు. ఈనెల 14వ తేదీ సాయంత్రం సురేశ్ భార్య దగ్గర మద్యం కోసమని రూ.వంద తీసుకున్నాడు. వైన్స్‌లో మద్యం బాటిల్ కొనుక్కొని ఇంటికి వెళ్లాడు. రాత్రి 8.30 గంటల సమయంలో కూతురు గుక్కపెట్టకుండా ఏడుస్తుందన్న కోపంతో మద్యం మత్తులో పాపను విచక్షణారహితంగా కొట్టడంతో మరణించింది. రాత్రి 10 గంటలకు వనిత పని నుంచి ఇంటికి వచ్చి చూడగా కూతురు నేలపై పడి ఉంది. భర్తను ప్రశ్నించగా.. చనిపోయిందంటూ సమాధానమిచ్చాడు. వెంటనే స్థానికుల సహాయంతో పాపను ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు తెలిపారు. ఈ విషయం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈనెల 16వ తేదీన సురేశ్‌ను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు.

'విమోచన' సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ రోజు

- గవర్నర్ తమిళిసై
- రాష్ట్రపతి నిలయంలో హైదరాబాద్ విమోచన దినోత్సవం
- హాజరైన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



బహుమతులు అందజేస్తున్న గవర్నర్

రసూల్‌పురా (హైదరాబాద్): హైదరాబాద్ విమోచన దినోత్సవం సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ రోజని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ అన్నారు. బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో ఆదివారం జరిగిన హైదరాబాద్ విమోచన దినోత్సవ కార్యక్రమంలో గవర్నర్ తమిళిసై, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, హైదరాబాద్ విమోచన దినోత్సవం సందర్భంగా విద్యార్థులు రాష్ట్రపతి నిలయంలో ఏర్పాటైన కార్యక్రమంలో పాలుపంచుకోవడం స్ఫూర్తిదాయకమని అన్నారు. హైదరాబాద్ ప్రాంత చరిత్ర, రజాకార్ల దౌర్జన్యాలు, హైదరాబాద్ స్టేట్‌ను భారతదేశంలో విలీనం చేసిన పరిస్థితులు.. వంటి చరిత్రను నేటి విద్యార్థులు తెలుసుకోవాలని గవర్నర్ సూచించారు. గత మూడు రోజులుగా రాష్ట్రపతి నిలయంలో హైదరాబాద్ విమోచన దినోత్సవం సందర్భంగా నిర్వహించిన రాష్ట్రీయ రాగ్ (గానం), ఆజాదీ కా యాక్ట్స్ (స్కిట్, డ్రామా) క్విజ్‌లో (ప్రహేలికా) భారత సారస్వతం, ఫొటో ఎగ్జిబిషన్, సాంస్కృతిక ప్రదర్శనలు, ఓపెన్ మైక్ సెషన్, ప్యానల్ చర్చలు, ఇతర అంశాల్లో జరిగిన పోటీల్లో విజేతలకు గవర్నర్ తమిళిసై, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిలు మెమెంటో, ప్రశంసాపత్రాలు, కన్సొలేషన్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి అదనపు కార్యదర్శి డాక్టర్ రాకేశ్ గుప్త, డిప్యూటీ సెక్రటరీ స్వాతి షాహి, కేంద్ర సాంస్కృతిక శాఖ అధికారులు, సెంట్రల్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ బీజే రావు, పరిపాలనాధికారి రజనిప్రియ, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ సీపీఆర్ శిక్షణ పొందాలి

రాజ్‌భవన్‌లో విమోచన దినోత్సవం సందర్భంగా గవర్నర్

సాక్షి, హైదరాబాద్: విలువైన ప్రాణాలను కాపాడటానికి రాష్ట్రంలోని ప్రతిఒక్కరూ కృత్రిమశ్వాస(సీపీఆర్) అందించడంలో శిక్షణ పొందాలని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పిలుపునిచ్చారు. తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా ఆదివారం రాజ్‌భవన్‌లో ఆమె జాతీయజెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ఇకపై ఏటా తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా రాజ్‌భవన్ ఆధ్వర్యంలో ఒక కొత్త కార్యక్రమాన్ని చేపట్టి ఏడాదంతా కొనసాగిస్తామని ప్రకటించారు. ఈ ఏడాది 'తెలంగాణ సేవ్స్ లైవ్స్'అనే పేరుతో సీపీ ఆర్ శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టనున్నామని తెలిపారు. 1948 సెప్టెంబర్ 17న నిజాం నిరంకుశ పాలన నుంచి విమోచనం పొందిన చరిత్రాత్మక సందర్భాన్ని స్మరించుకోవడానికి ఈ కార్యక్రమాన్ని తలపెట్టినట్టు తెలిపారు. తెలంగాణ విమోచనం కోసం జీవితాలను త్యాగం చేసినవారికి నివాళి అర్పించారు. ప్రధాని మోదీ పుట్టినరోజు సైతం సెప్టెంబర్ 17నే కావడంతో ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

తెలంగాణ చరిత్రను 75 ఏళ్లు తొక్కిపెట్టారు

- విమోచన ఉత్సవాలు జరపకుండా కాంగ్రెస్ కుట్ర చేసింది
- బీఆర్‌ఎస్ నేతలు సమైక్యతా దినం పేరుతో మోసం చేస్తున్నారు
- కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 13 నెలల తరువాత నిజాం నిరంకుశ పాలన నుంచి విముక్తి పొందిన తెలంగాణ చరిత్రను కొందరు 75 ఏళ్లు తొక్కిపెట్టే ప్రయత్నం చేశారని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. ఆదివారం పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన తెలంగాణ విమోచన దినోత్సవ సభలో ఆయన మాట్లాడుతూ లక్షల మంది పోరాటం, వేలాది మంది బలిదానం తరువాత భారత సైన్యం జోక్యంతో తెలంగాణలో మువ్వన్నెల జెండా ఎగిరిందని పేర్కొన్నారు. దేశమంతా స్వాతంత్ర్య దినోత్సవ పండుగ చేసుకుంటుంటే.. ఇక్కడ రజాకార్లు గ్రామీణ ప్రాంతాల మీద పడి పేద ప్రజలు, రైతులపై అనేక రకాల అకృత్యాలు చేశారని గుర్తు చేశారు. ఇక్కడి చరిత్రను పాతరేసేందుకు కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలో ప్రయత్నం జరిగిందని అన్నారు. 75 ఏళ్లుగా తెలంగాణ విమోచన ఉత్సవాలు జరపకుండా కుట్ర చేశారని ధ్వజమెత్తారు. ఇప్పుడు బీఆర్‌ఎస్ నాయకులు సమైక్యదినం అంటూ మోసం చేస్తున్నారని, పోరాటాలు, బలిదానాల ద్వారా తెచ్చుకున్న స్వాతంత్ర్యం.. సమైక్యతా దినం ఎలా అవుతుందని ప్రశ్నించారు. తెలంగాణ విముక్తి కోసం పోరాడిన అమర వీరులకు నివాళులు అర్పిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు బండి సంజయ్, ఈటల రాజేందర్, ఇంద్రసేనారెడ్డి, డీకే అరుణ, ఎన్‌వీఎస్‌ఎస్ ప్రభాకర్, కిషన్‌రెడ్డి సతీమణి కావ్య, హోంశాఖ కార్యదర్శి అజయ్ భల్లా తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు హైదరాబాద్‌లో మీటింగ్ పెట్టే అర్హత లేదు

కాంగ్రెస్ పార్టీకి సెప్టెంబర్ 17న హైదరాబాద్ గడ్డమీద మీటింగ్ పెట్టుకునే నైతిక అర్హత లేదని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి మండిపడ్డారు. తెలంగాణ చరిత్రను సమాధి చేసి, అణగదొక్కిన కాంగ్రెస్ ఇప్పుడు ఏ ముఖం పెట్టుకొని ఇక్కడ వర్కింగ్ కమిటీ సమావేశాలు పెట్టిందో ప్రజలు నిలదీయాలని అన్నారు. తెలంగాణ విమోచన ఉత్సవాలు జరపని దోషి కాంగ్రెస్ పార్టీ అని ధ్వజమెత్తారు. నిజాంకు వ్యతిరేకంగా లక్షలాదిమంది పోరాడిన చరిత్రను కాంగ్రెస్ సమాధి చేసే ప్రయత్నం చేసిందని, అమరుల త్యాగాలను గుర్తించకుండా, సెప్టెంబర్ 17న విమోచన ఉత్సవాలు జరపకుండా ఆ పార్టీ ఘోరతప్పిదం చేసిందన్నారు. ఆ తర్వాత వచ్చిన బీఆర్‌ఎస్ కూడా కాంగ్రెస్ బాటలోనే నడుస్తోందన్నారు. ఆదివారం హైదరాబాద్ విమోచన దినోత్సవం సందర్భంగా బీజేపీ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని కిషన్‌రెడ్డి ఎగురవేసి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్‌నేత నల్లు ఇంద్రసేనారెడ్డి, బీజేపీ జాతీయ కార్యదర్శి అర్వింద్ మీనన్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ, మహిళా రిజర్వేషన్ల బిల్లుల కోసం పోరాడతాం

బీఆర్‌ఎస్ ఎంపీలు కేశవరావు, నామా వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ: చట్టసభల్లో బీసీ, మహిళా రిజర్వేషన్ల బిల్లుల కోసం పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో పోరాడతామని బీఆర్‌ఎస్ ఎంపీలు కె.కేశవరావు, నామా నాగేశ్వరరావు తెలిపారు. రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అధ్యక్షతన ఆదివారం జరిగిన అఖిలపక్ష సమావేశానికి వీరిద్దరూ హాజరయ్యారు. అనంతరం వీరు మీడియాతో మాట్లాడుతూ...బీసీ, మహిళా బిల్లులపై కేసీఆర్ కేంద్రానికి లేఖ రాశారన్నారు. ఆయా బిల్లుల ఆమోదానికి కేంద్రంపై ఒత్తిడి తెస్తామని స్పష్టం చేశారు. రాజకీయాల్లో మహిళల భాగస్వామ్యం, హక్కులు కాపాడటంలో బీఆర్‌ఎస్ కట్టుబడి ఉందని ఎంపీలు తెలిపారు.

అసెంబ్లీలో జాతీయ సమైక్యతాదినోత్సవం

సాక్షి, హైదరాబాద్: జాతీయ సమైక్యతాదినోత్సవం సందర్భంగా శాసన మండలి ప్రాంగణంలో ఆదివారం జాతీయ పతాకాన్ని మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆవిష్కరించారు. ఎమ్మెల్సీలు దండే విఠల్, తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, బోగారపు దయానంద్, అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులు తదితరులు పాల్గొన్నారు. శాసనసభ ప్రాంగణంలో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి జాతీయజెండా ఎగురవేశారు. అసెంబ్లీ సెక్రటరీతోపాటు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. కాగా, బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యాలయం తెలంగాణభవన్‌లో పార్లమెంటరీ పార్టీ నేత, బీఆర్‌ఎస్ సెక్రటరీ జనరల్ కె.కేశవరావు జాతీయ పతాకాన్ని ఎగరవేశారు.

క్లుప్తంగా...

హెచ్1బీ లాటరీ విధానం రద్దు చేస్తా



వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష పదవికి పోటీ పడుతున్న రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి, భారత సంతతికి చెందిన వివేక్ రామస్వామి(38) హెచ్–1బీ వీసా విధానంపై కీలకవ్యాఖ్యలు చేశారు. హెచ్–1బీ వీసాల జారీకి ప్రస్తుతం అనుసరిస్తున్న లాటరీ విధానం కాంట్రాక్టు సర్వీస్ మాదిరిగా ఉందని, సదరు స్పాన్సర్ కంపెనీకే లాభం చేకూర్చుతోందని తప్పుబట్టారు. తాను అధికారంలోకి వస్తే హెచ్–1బీ లాటరీ విధానాన్ని రద్దు చేసి, దాని స్థానంలో ప్రతిభ ఆధారిత వీసా జారీ విధానాన్ని తీసుకువస్తానని ఒక ప్రకటనలో తెలిపారు. నాన్ ఇమిగ్రాంట్ హెచ్–1బీ వీసాకు భారతీయ ఐటీ నిపుణుల్లో ఎక్కువ డిమాండ్ ఉంది. అమెరికాకు చెందిన టెక్ కంపెనీలు ఈ విధానం ద్వారా ప్రతిభావంతులైన విదేశీ ఉద్యోగులను కొన్ని ప్రత్యేక విభాగాల్లో ఏటా వేల సంఖ్యలో నియమించుకుంటున్నాయి. గతంలో వివేక్ రామస్వామికి చెందిన రొయివంట్ సైన్సెస్ కంపెనీ సైతం హెచ్–1బీ వీసాను 29 సార్లు వాడుకున్నట్లు 'పొలిటికో' పేర్కొంది.

బాలిక ఉసురుతీసిన పోకిరీలు

అంబేడ్కర్‌నగర్(యూపీ): సైకిల్‌పై వెళ్తున్న బాలికను వేధించేందుకు బైక్‌పై వచ్చిన ఇద్దరు ఆకతాయిలు ప్రయత్నించారు. దుపట్టాను లాగేయడంతో ఆమె అదుపుతప్పి సైకిల్‌పై నుంచి పడిపోయింది. ఆ వెనుకే మరో యువకుడు ఆమెను బైక్‌తో ఢీకొట్టి చంపేశాడు. ఒళ్లుగగుర్పొడిచే ఈ ఘటన యూపీలోని అంబేడ్కర్‌నగర్‌లో చోటుచేసుకుంది. బర్హి అయిదిల్‌పూర్‌కు చెందిన నయన్‌శీ పటేల్(17) ఇంటర్ చదువుతోంది. శుక్రవారం సాయంత్రం సైకిల్‌పై ఇంటికి వెళుతోంది. వేగంగా బైక్‌పై వచ్చిన ఆకతాయిలు ఆమె దుపట్టాను లాగడంతో అదుపుతప్పి కిందపడి పోయింది. ఆ వెనుకే బైక్‌పై వచ్చిన మరో యువకుడు ఆమె మీదుగా బైక్‌ను పోనిచ్చాడు. తీవ్రగాయాలతో బాలిక చనిపోయింది. ఈ అమానుషానికి సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పోలీసులు సెహబాజ్, అర్బాజ్, ఫైసల్ అనే వారిని అదుపులోకి తీసుకున్నారు. నిందితులను ఆదివారం ఆస్పత్రికి తీసుకెళ్తుండగా పారిపోయేందుకు యత్నించారు. పోలీసుల కాల్పుల్లో ఇద్దరికి గాయాలయ్యాయి. మరొకరు పారిపోయేక్రమంలో కిందపడి కాలు విరగ్గొట్టుకున్నాడు. సదరు పోకిరీలు తన కూతుర్ని వేధిస్తున్నారంటూ వారం క్రితమే పోలీసులకు తెలిపినట్లు తండ్రి సభజీత్ వర్మ తెలపడంతో స్టేషన్ హౌస్ ఆఫీసర్ రితేశ్ పాండేను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు.

అమెరికా భూమికి పగుళ్లు!

పెను ప్రమాదంలో అగ్రరాజ్యం
- ఎక్కడ పడితే అక్కడ నేలపై భారీ బీటలు
- ఒక్కోటీ కిలోమీటర్ల పొడవు, మీటర్ల కొద్దీ వెడల్పు
- పర్యావరణ పెను విధ్వంసం తాలూకు దారుణ దుష్పరిణామమే
- భూగర్భ జలాలను విపరీతంగా తోడేయడమే ప్రధాన కారణం

అగ్రరాజ్యం అమెరికాకు పెను ప్రమాదం ముంచుకొస్తోంది. దేశవ్యాప్తంగా ఎక్కడ పడితే అక్కడ నేలపై పుట్టుకొస్తున్న మైళ్ల కొద్దీ పొడవైన భారీ పగుళ్లు వెన్నులో వణుకు పుట్టిస్తున్నాయి. పొంచి ఉన్న పెను ఉత్పాతాలకు ఇది బహుశా ముందస్తు సంకేతం మాత్రమే కావొచ్చన్న సైంటిస్టుల హెచ్చరికలు మరింత భయం పుట్టిస్తున్నాయి. పర్యావరణంతో ఇష్టారాజ్యంగా చెలగాటం ఆడితే ఎలా ఉంటుందో ఆ దేశానికిప్పుడు బాగా తెలిసొస్తోంది!



అమెరికా అతి పెద్ద పర్యావరణ విపత్తును ఎదుర్కొంటోంది. దేశవ్యాప్తంగా, ముఖ్యంగా వాయవ్య రాష్ట్రాల్లో ఎక్కడ పడితే అక్కడ నేల నిట్టనిలువుగా చీలుతోంది. అది కూడా చిన్నాచితకా సైజులో కాదు! మైళ్ల పొడవునా, మీటర్ల వెడల్పులో పగుళ్లిస్తోంది. ఫిషర్స్‌గా పేర్కొనే ఈ చీలికలు దశాబ్దాలుగా భూగర్భ జలాలను విపరీతంగా తోడేస్తున్న తాలూకు దుష్పరిణామమేనని పర్యావరణవేత్తలు మాత్రమే గాక భూభౌతిక శాస్త్రవేత్తలు కూడా నిర్ధారిస్తున్నారు. చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే ఏం లాభమంటూ ఇప్పుడు తీరిగ్గా నెత్తీ నోరూ బాదుకుంటున్నారు!

పగుళ్లు ఎక్కడెక్కడ?
- అరిజోనా, ఉతా, కాలిఫోర్నియా రాష్ట్రాల్లో ఇవి మరీ ఎక్కువగా కనిపిస్తున్నాయి.
- ముఖ్యంగా అరిజోనాలో 2002 నుంచే ఈ తరహా పగుళ్లు వస్తున్నాయి. కానీ ఈ మధ్యకాలంలో కనిపిస్తున్న పగుళ్ల పరిమాణంలో గానీ, సంఖ్యలో గానీ ముందెన్నడూ చూడనివి కావడమే కలవరపరుస్తున్న అంశం.

జాతీయ సంక్షోభమే: న్యూయార్క్ టైమ్స్
ఈ పగుళ్ల ఇప్పుడు జాతీయ సంక్షోభం స్థాయికి చేరాయని న్యూయార్క్ టైమ్స్ మీడియా గ్రూప్ పరిశోధక బృందం తేల్చడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. సర్వే ఏం చెప్పిందంటే...
- అమెరికాలో 90 శాతానికి పైగా జల వనరులకు ప్రధాన ఆధారమైన జల ధారలు శరవేగంగా ఎండిపోతున్నాయి.
- ఎంతగా అంటే, అవి కోలుకోవడం, బతికి బట్ట కట్టడం ఇక దాదాపుగా అసాధ్యమే!
- సర్వే బృందం పరిశీలించిన సగానికి సగం చోట్ల భూగర్భ జల ధారలు గత 40 ఏళ్లలో చెప్పలేనంతగా చిక్కిపోయాయి.
- 40 శాతం ధారలైతే కేవలం గత పదేళ్లలో ఆల్ టైమ్ కనిష్టానికి పడిపోయాయి.

> ఇవి ప్రాకృతికంగా జరుగుతున్న పరిణామాలు కావు. నూటికి నూరు శాతం మనుషుల తప్పిదాలే ఇందుకు కారణం"
> – జోసెఫ్ కుక్, పరిశోధకుడు, అరిజోనా జియాలాజికల్ సర్వే

- వాయవ్య అమెరికావ్యాప్తంగా అతి ప్రధాన మంచినీటి వనరుగా ఉంటూ వస్తున్న కొలరాడో నది కేవలం గత 20 ఏళ్లలో ఏకంగా 20 శాతానికి పైగా కుంచించుకుపోయింది.
- గ్లోబల్ వార్మింగ్ తదితర పర్యావరణ సమస్యలు పరిస్థితిని మరింత సంక్లిష్టం చేస్తున్నాయి.

భూగర్భ జలమే ముఖ్య ఆధారం
మనిషుల నీటి అవసరాలను తీర్చడంలో భూగర్భ జలం కీలకంగా మారింది. ఎంతగా అంటే...
- ప్రపంచ తాగునీటి అవసరాలూ సగం భూగర్భ జలంతోనే తీరుతున్నాయి.
- ఇక 40% సాగునీటి అవసరాలకు ఇదే ఆధారం.
- అయితే, అసలు సమస్య భూగర్భ జలాలను తోడేయడం కాదు. వెనుకా ముందూ చూసుకోకుండా విచ్చలవిడిగా తోడేయడమే అసలు సమస్య. అంత వేగంగా భూమిలోకి నీరు తిరిగి చేరడం లేదు.

ఏం జరుగుతోంది?
- భూగర్భం నుంచి నీటిని విచ్చలవిడిగా తోడేయడం నేల కుంగిపోవడానికి దారితీస్తోంది.
- అదే చివరికిలా పగుళ్లుగా బయట పడుతోంది.
- ఫిషర్లుగా పిలిచే ఈ పగుళ్లు సాధారణంగా పర్వతాల మధ్య ప్రాంతాల్లో కనిపిస్తుంటాయి.
- వీటితో ఇళ్లకు, రోడ్లకు, కాల్వలకు, డ్యాములకు తదితరాలకు నష్టం అంతా ఇంతా కాదు.
- చాలాసార్లు ఈ భారీ పగుళ్ల వల్ల ఊహించలేనంతగా ప్రాణ నష్టం కూడా సంభవించవచ్చు. పశు సంపదకు కూడా నష్టం కలగవచ్చు.

– సాక్షి, నేషనల్ డెస్క్



కలవో, లేవో...!

ఏలియన్స్ ఉనికిపై వీడని సందిగ్ధం
- ఎటూ తేల్చని నాసా ఏడాది అధ్యయనం
- అర్థం కాని కొన్ని ఘటనలైతే ఉన్నాయన్న ప్యానల్
- మరిన్ని నిధులు, మరింత పరిశోధన అవసరమని ముక్తాయింపు



ఏలియన్స్. ఎక్స్‌ట్రా టెర్రెస్ట్రియల్స్. గ్రహాంతరవాసులు.. ఇలా వాళ్లకు ఎన్నెన్నో పేర్లు. వాళ్ల చుట్టూ ఎన్నెన్నో కథలు. వాళ్ల ఉనికిపై ఎన్నెన్నో కథనాలు. వాళ్ల భూమిపైకి వచ్చిపోయేందుకు ఉపయోగిస్తారని చెప్పే ఫ్లయింగ్ సాసర్స్ (ఎగిరే పళ్లాలు) చుట్టూ మరెన్నో పుకార్లు. వాటిని చూశామంటూ గత ఒకట్రెండు శతాబ్దాలలో ఎంతోమంది పత్రికలకు, టీవీలకు ఎక్కారు. కొన్నిసార్లు వినువీధిలో కొన్ని వింత వస్తువులు కెమెరాలకు చిక్కాయి. అవి ఎగిరే పళ్లాలేనని నమ్మిన వాళ్లు, వాటిలో గ్రహాంతరవాసులు వచ్చారని ఇప్పటికీ నమ్ముతున్న వాళ్లు ఎందరో! దాంతో ఈ విషయంపై నాసా ఇటీవల కాస్త గట్టిగానే దృష్టి పెట్టింది. దీన్ని ఇప్పటిదాకా గుర్తించని అసాధారణ దృగ్విషయం (అన్ ఐడెంటిఫైడ్ అనామలస్ ఫినామినా – యూఏపీ)గా పేర్కొంటూ, దీని తాలూకు నిజానిజాలను నిగ్గుదేల్చేందుకు ఒక స్వతంత్ర కమిటీ వేసింది. అది ఏడాది పాటు అన్ని కోణాల్లో పరిశోధన చేసి 33 పేజీల నివేదిక సమర్పించింది. అయితే ఏలియన్స్ గానీ, అవి ప్రయాణించే ఎగిరే పళ్లాలు గానీ ఉన్నాయని గానీ, లేవని గానీ ఇదమిత్థంగా నివేదిక ఎటూ తేల్చకపోవడం విశేషం!

నాసా యూఏపీ ప్యానల్ నివేదిక ముఖ్యాంశాలు
- ఇప్పటిదాకా మా పరిశీలనకు వచ్చిన అసాధారణ దృగ్విషయాల్లో (అన్ ఐడెంటిఫైడ్ అనామలస్ ఫినామినా – యూఏపీ) చాలావాటి అసలు స్వభావాన్ని కచ్చితంగా నిర్ధారించలేకపోయాం.
- ఎగిరే పళ్లాలుగా చెప్పిన వాటికి నిజంగా గ్రహాంతర మూలాలున్నట్టు తేలలేదు.
- వీటిలో చాలావరకు బెలూన్లు, డ్రోన్లు, విమానాలుగా తేలాయి.
- అయితే కొన్ని యూఏపీ కేసులు ఇప్పటిదాకా మనకు తెలిసిన ఏ దృగ్విషయంతోనూ సరిపోలలేదు.
- ఏలియన్స్, ఎగిరే పళ్లాల విషయంలో ప్రజల్లో నెలకొని ఉన్న అంతులేని ఆసక్తి అర్థం చేసుకోదగిందే. అందుకే ఈ విషయమై ఎలాంటి కొత్త సమాచారం తెలిసినా ఎప్పటికప్పుడు వారితో పంచుకుంటాం.

– సాక్షి, నేషనల్ డెస్క్


> ఎగిరే పళ్లాలను గురించి జనాల్లో నెగటివ్ భావజాలం ఎంతగానో పాతుకుపోయింది. ఏలియన్స్ ఉనికి తాలూకు నిజానిజాలను నిర్ధారించేందుకు అత్యంత కీలకమైన డేటాను సేకరించడంలో ఇదే అతి పెద్ద అడ్డంకిగా నిలుస్తోంది'
> – నాసా యూఏపీ అధ్యయన బృందం

> ఏలియన్స్ ఉన్నదీ లేనిదీ పక్కాగా తేల్చాలన్నా, దీనిపై లోతుగా పరిశోధన చేయాలన్నా ఇప్పుడున్న వాటికి చాలా భిన్నమైన, సృజనాత్మక శాస్త్రీయ అధ్యయన పద్ధతులు అత్యాధునికమైన శాటిలైట్ టెక్నాలజీ కావాలి. అంతకు మించి, ఈ అంశంపై జనం దృక్కోణంలోనే మౌలికంగా చాలా మార్పు రావాలి'
> – నాసా

నాసాకు యూఏపీ ప్యానల్ సిఫార్సులు
- యూఏపీ సంబంధిత డేటా సేకరణ, విశ్లేషణ కోసం ఒక స్టాండర్డ్ విధానాన్ని ఏర్పాటు చేయాలి.
- యూఏపీలపై అవగాహనను విస్తృతం చేసుకోవడానికి కృత్రిమ మేధ తదితర టెక్నాలజీల సాయం తీసుకోవాలి.
- యూఏపీల అధ్యయనంలో పారదర్శకత, ఇతర దేశాలు, అధ్యయన సంస్థలతో పరస్పర సహకారం చాలా అవసరం.
- యూఏపీ పరిశోధనలకు, డేటా సేకరణ, అధ్యయనం, ప్రభుత్వ, విదేశీ, అంతర్జాతీయ సంస్థలతో మరింత సమన్వయం తదితరాల నిమిత్తం ఈ ప్రాజెక్టుకు నిధులను మరింత పెంచాలి.

'యశోభూమి'కి తరలిరండి

- సినిమా, టీవీ పరిశ్రమకు, ఈవెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీలకు సకల సౌకర్యాలున్నాయ్
- ఢిల్లీలో అతిపెద్ద కన్వెన్షన్ సెంటర్ ప్రారంభోత్సవంలో ప్రధాని మోదీ పిలుపు



కన్వెన్షన్ సెంటర్‌లో విశ్వకర్మ విగ్రహానికి పూజలు చేస్తున్న ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: ప్రపంచంలోనే అతిపెద్ద కన్వెన్షన్ సెంటర్లలో ఒకటైన ఇండియా ఇంటర్నేషన్ కన్వెన్షన్ అండ్ ఎక్స్‌పో సెంటర్ 'యశోభూమి' మొదటి దశను ప్రధాని మోదీ ఆదివారం లాంఛనంగా ప్రారంభించారు. విశ్వకర్మ జయంతి సందర్భంగా ఇదే వేదికపై 'పీఎం విశ్వకర్మ' పథకానికి శ్రీకారం చుట్టారు. ఢిల్లీలోని భారత్ మండపం, యశోభూమిలో సకల సౌకర్యాలున్నాయని, వీటిని ఉపయోగించుకోవాలని, ఇక్కడ కార్యక్రమాలు నిర్వహించేందుకు ముందుకు రావాలని సినిమా, టీవీ పరిశ్రమను, అంతర్జాతీయ ఈవెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీలను ప్రధాని ఆహ్వానించారు. పీఎం విశ్వకర్మ పథకంలో సంప్రదాయ వృత్తి కళాకారులకు, కార్మికులకు లబ్ధి చేకూరుతుందని అన్నారు. 18 మంది లబ్ధిదారులకు 'విశ్వకర్మ సర్టిఫికెట్లు' అందజేశారు. వారు ఎలాంటి పూచీకత్తు లేకుండానే తక్కువ వడ్డీకే రూ.3 లక్షలదాకా రుణం పొందవచ్చు.

కాన్ఫరెన్స్ టూరిజంకు పెద్దపీట
దేశంలో సదస్సుల పర్యాటకానికి ఉజ్వలమైన భవిష్యతు ఉందని మోదీ స్పష్టం చేశారు. యశోభూమి కన్వెన్షన్ సెంటర్ ప్రారంభోత్సవంలో ఆయన ప్రసంగించారు. భారత్‌లో ఈ రంగం విలువ రూ.25,000 కోట్లకుపైగా ఉందన్నారు. అనంతరం 'యశోభూమి ద్వారక సెక్టార్ 25'మెట్రో రైల్వే స్టేషన్‌ను మోదీ ప్రారంభించారు.

ప్రధాని మోదీకి జన్మదిన శుభాకాంక్షల వెల్లువ
ప్రధాని మోదీ 73వ జన్మదినం సందర్భంగా ఆదివారం రాష్ట్రపతి ముర్ము, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అధికార బీజేపీ 'సేవా పఖ్వారా'ను ప్రారంభించింది. అక్టోబర్ 2 దాకా ఇది కొనసాగుతుంది.

రూ.13 వేల కోట్లతో 'విశ్వకర్మ' పథకానికి శ్రీకారం

దేశంలో పౌరుల రోజువారీ జీవనంలో విశ్వకర్మల పాత్ర చాలా కీలకమని మోదీ ఉద్ఘాటించారు. ఎంతటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చినా సమాజంలో వారి స్థానం చెక్కుచెదరని ప్రశంసించారు. రూ.13,000 కోట్లతో పీఎం విశ్మకర్మ పథకాన్ని అమలు చేస్తామని, సంప్రదాయ వృత్తి కళాకారులకు, కార్మికులకు అండగా నిలుస్తామని అన్నారు. ఈ పథకంతో వడ్రంగులు, స్వర్ణకారులు, కమ్మరులు, శిల్పకారులు, కుమ్మరులు, దర్జీలు, తాపీ మేస్త్రీలు, రజకులు, క్షురకులు తదితరులకు మేలు జరుగుతుందన్నారు.

న్యాయ వ్యవస్థ ప్రగతికైనా, వినాశనానికైనా

నిజాయతీయే కీలకం

సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ కీలక వ్యాఖ్యలు



ఛత్రపతి శంభాజీనగర్: న్యాయ వృత్తిలో నిజాయతీ అత్యంత కీలకమని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ స్పష్టం చేశారు. 'ప్రజల నమ్మకాన్ని చూరగొన్నప్పుడే న్యాయ వ్యవస్థ, ఆ వృత్తి రాణిస్తాయి. లేదంటే వాటి పయనం సాగేది స్వీయ వినాశనం వైపే' అంటూ కుండబద్దలు కొట్టారు. ఆ నిజాయతీని, నమ్మకాన్ని నిలబెట్టే బాధ్యత న్యాయ వ్యవస్థలో భాగస్వాములైన లాయర్లు మొదలుకుని న్యాయమూర్తుల దాకా అందరి పైనా ఉంటుందన్నారు. ఆదివారం ముంబైలోని మహాత్మా గాంధీ మిషన్ యూనివర్సిటీలో కార్యక్రమంలో ప్రసంగం సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'చిన్నవిగా అనిపించే విషయాల్లో మనం రాజీ పడ్డప్పుడే న్యాయ వ్యవస్థ మీద ప్రజలకు నమ్మకం సన్నగిల్లేది' అని సీజేఐ అభిప్రాయపడ్డారు.

ప్రపంచ వారసత్వ జాబితాలోకి శాంతినికేతన్



న్యూఢిల్లీ: నోబెల్ గ్రహీత, విశ్వ కవి రవీంద్రనాథ్ ఠాగూర్ స్థాపించిన పశ్చిమ బెంగాల్‌లోని ప్రఖ్యాత శాంతినికేతన్ విశ్వవిద్యాలయానికి యునెస్కో ప్రపంచ వారసత్వ కట్టడాల జాబితాలో చోటు దక్కింది. యునెస్కో ఆదివారం 'ఎక్స్'లో ఈ మేరకు ప్రకటించింది. 'వారసత్వ కట్టడాల జాబితాలో చోటు దక్కినందుకు శాంతినికేతన్‌కు అభినందనలు'అని పేర్కొంది. బీర్భూమ్ జిల్లాలోని ఈ చారిత్రక నిర్మాణానికి వారసత్వ గుర్తింపు కోసం భారత్ ఎప్పటినుంచో కృషి చేస్తోంది. ఈ విశ్వవిద్యాలయ నగరి పశ్చిమ కోల్‌కతాకు 160 కి.మీ.ల దూరంలో ఉంది. గీతాంజలి కర్త, విశ్వ కవి రవీంద్రుని తండ్రి దేవేంద్రనాథ్ ఠాగూర్ దీన్ని మొదట్లో ఒక ఆశ్రమంగా ప్రారంభించారు. కులమతాలతో నిమిత్తం లేకుండా ఎవరైనా ఇక్కడ ధ్యానం చేసుకోవచ్చు. శాంతినికేతన్ ప్రాంగణంలో చిన్న విద్యా సంస్థగా రవీంద్రుని ఆధ్వర్యంలో మొదలైన విశ్వభారతి నేడు దేశంలో అతి పెద్ద విశ్వవిద్యాలయాల్లో ఒకటిగా ఎదిగింది. హ్యూమానిటీస్, సోషల్ సైన్స్, ఫైన్ ఆర్ట్స్, సంగీతం, అగ్రికల్చరల్ సైన్స్, రూరల్ రీ కన్‌స్ట్రక్షన్ వంటి వాటిలో ఎన్నెన్నో కోర్సులు అందిస్తోంది. దివంగత ప్రధాని ఇందిరా గాంధీ, మరో నోబెల్ గ్రహీత అమర్త్య సేన్ వంటి మహామహులు ఎందరో ఈ విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థులే.

ఒడిశాలో 180 మందికి స్క్రబ్ టైఫస్

భువనేశ్వర్: కేరళలో నిఫా వైరస్ మాదిరిగానే ఒడిశాలో స్క్రబ్ టైఫస్ ప్రజలను వణికిస్తోంది. ఒడిశాలో స్క్రబ్ టైఫస్ బాధితుల సంఖ్య ఆదివారానికి 180కి చేరుకుంది. ఇప్పటివరకు సేకరించి పంపిన 59 శాంపిళ్లలో 11 స్క్రబ్ టైఫస్ పాజిటివ్‌గా వెల్లడైనట్లు ఆరోగ్య శాఖాధికారులు వెల్లడించారు. మొత్తం 180 మంది బాధితుల్లో ఇతర రాష్ట్రాల వారు 10 మంది ఉన్నారన్నారు. సుందర్‌గఢ్, బర్గఢ్ జిల్లాల్లో కేసులు ఎక్కువగా బయటపడుతున్నాయని అన్నారు. ఈ వ్యాధితో రాష్ట్రంలో ఇప్పటివరకు ఏడుగురు చనిపోయారు. ఒక రకమైన లార్వా పురుగులు కుట్టడం వల్ల ఇది సోకుతుంది. పొలాలు, అటవీ ప్రాంతాలకు దగ్గర్లోని వారు తొందరగా ఈ వ్యాధికి గురవుతారు. జ్వరం, పురుగు కుట్టిన చోట చర్మంపై ఎశ్చర్ అనే నల్ల మచ్చ ఏర్పడటం దీని లక్షణాలు.

బ్రెజిల్‌లో విమానం కూలి..14 మంది మృతి

రియో డి జనిరో: బ్రెజిల్‌లోని అమెజాన్ అడవుల్లో చిన్న ప్యాసింజర్ విమానం కూలిన ఘటనలో అందులోని మొత్తం 14 మందీ దుర్మరణం చెందారు. మనాస్ నుంచి బయలుదేరిన విమానం బర్సెలోస్ సమీపంలో కూలిందన్నారు. ప్రమాద సమయంలో ఆ ప్రాంతంలో భారీగా వర్షం కురుస్తోందన్నారు. మృతుల్లో 12 మంది ప్రయాణికులు కాగా, ఇద్దరు విమాన సిబ్బంది అని అమెజొనాస్ రాష్ట్ర గవర్నర్ విల్సన్ లిమా చెప్పారు.

ఆర్మీ జవాన్ కిడ్నాప్.. హత్య

ఇంఫాల్: మణిపూర్ రాష్ట్రంలో సాయుధ ముఠా ఒకటి ఆర్మీ జవాన్‌ను పొట్టనబెట్టుకుంది. రాష్ట్రంలోని ఇంఫాల్ పశ్చిమ జిల్లా తరుంగ్ గ్రామానికి చెందిన సిపాయి సెర్టో థంగ్‌థంగ్ కొమ్.. కంగ్‌పాక్పి జిల్లా లీమఖోంగ్‌లోని ఆర్మీ డిఫెన్స్ సెక్యూరిటీ ఫోర్స్‌కు చెందిన ప్లటూన్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. కొద్దిరోజుల క్రితం ఆయన సెలవుపై స్వగ్రామానికి చేరుకున్నారు. శనివారం ఉదయం ఇంట్లో ఉన్న ఆయనను గుర్తు తెలియని సాయుధులు తుపాకీతో బెదిరించి తమ వాహనంలో తీసుకెళ్లారు. ఆదివారం ఉదయం ఖునింగ్‌థెక్ గ్రామ సమీపంలో నుదుటిపై బుల్లెట్ గాయంతో ఆయన విగతజీవిగా పడి ఉండగా స్థానికులు గుర్తించారు.

పాకిస్తాన్‌పై పీఓకే కన్నెర్ర

- చుక్కలనంటుతున్న కరెంటు బిల్లులపై జనం ఆగ్రహ జ్వాలలు

కోట్లి (పీఓకే): పాకిస్తాన్‌పై పాక్ ఆక్రమిత కశ్మీర్(పీఓకే) వాసులు కన్నెర్రజేస్తున్నారు. దశాబ్దాలుగా పాక్ తమపై సవతి తల్లి ప్రేమ చూపుతోందంటూ మండిపడుతున్నారు. చివరికి కరెంటు బిల్లుల మదింపులో కూడా ఈ వివక్ష భరించలేనంత ఎక్కువగా ఉందంటూ వాపోతున్నారు. 'మా ప్రాంతం నుంచే ఏకంగా 5,000 మెగావాట్ల కరెంటు ఉత్పత్తి అవుతోంది. దాన్నంతటినీ తరలించుకుపోయి దేశమంతటికీ వాడుకుంటున్నారు. బిల్లుల విషయానికి వచ్చేసరికి ప్రధాన భూభాగంలో వారికి తక్కువగా, మాకు భరించలేనంత ఎక్కువగా వేస్తున్నారు. ఇది మా పట్ల సహించరాని అన్యాయం' అంటూ ఆక్రోశిస్తున్నారు. అది కాస్తా కొద్ది రోజులుగా ఆగ్రహంగా మారి కట్టలు తెంచుకుంటోంది. భారీ కరెంటు బిల్లులకు వ్యతిరేకంగా జనం నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. ఒక్క కోట్లి జిల్లాలోనే కేవలం ఒక్క నెలలో రూ.139 కోట్ల బిల్లులు వచ్చాయని ప్రముఖ స్థానిక నేత తౌకీర్ వాపోయారు. 'అందులో కేవలం రూ.19 కోట్ల బిల్లులు కట్టారు. వచ్చే నెల నుంచి అవి కూడా కట్టేది లేదు' అని అన్నారు. తమకు దశాబ్దాలుగా అన్యాయం జరుగుతోందని ఆరోపించారు.



పీఓకేలో స్థానికుల బైక్ ర్యాలీ

నేటి నుంచి పార్లమెంట్ ప్రత్యేక భేటీ

సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఐదు రోజుల పాటు జరుగనున్న ఈ సమావేశాలు పాత భవనంలో మొదలై మంగళవారం గణేశ్ చతుర్థి సందర్భంగా కొత్త భవనంలోకి మారనున్నాయి. సమావేశాల్లో తొలిరోజు పార్లమెంట్‌లో 75 ఏళ్ల ప్రయాణంపై చర్చతో పాటు పలు కీలక బిల్లులు సభ ముందుకు రానున్నాయి.

ప్రత్యేక చర్చ సహా కీలక బిల్లులు...
సమావేశాల్లో ప్రధానంగా డిసెంబర్ 9, 1946న తొలిసారి పార్లమెంట్ సమావేశమైంది. అది మొదలు 75 ఏళ్ల ప్రయాణంపై తొలిరోజు చర్చ జరుగనుంది. ఈ 75 ఏళ్ల ప్రస్థానంలో పార్లమెంట్ విజయాలు, అనుభవాలు, జ్ఞాపకాలపై సభ్యులు మాట్లాడనున్నారు. దీంతో పాటే ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ), ఇతర ఎన్నికల కమిషనర్ల (ఈసీ) నియామకానికి సంబంధించిన బిల్లును కూడా ప్రభుత్వం సభ ముందుకు తేనుంది. గత వర్షాకాల సమావేశాల్లోనే ఈ బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టారు. దీంతో పాటే లోక్‌సభలో 'ది అడ్వొకేట్స్ (సవరణ) బిల్లు, 2023', 'ది ప్రెస్ అండ్ రిజిస్ట్రేషన్ ఆఫ్ పీరియాడికల్స్ బిల్లు, 2023'ఉన్నాయి. 'ది పోస్టాఫీస్ బిల్లు, 2023'నూ లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నారు. 'వన్ నేషన్–వన్ ఎలక్షన్', మహిళా రిజర్వేషన్ బిల్లు, ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ) బిల్లులు సైతం ఈ సమావేశాల్లోనే తెస్తారనే ప్రచారం జరుగుతున్నా కేంద్ర వర్గాలు ధ్రువీకరించడం లేదు.

నిరుద్యోగం..ద్రవ్యోల్బణంపై విపక్షాల పట్టు..
పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో పాల్గొనేందుకు ఇండియా బ్లాక్‌కు చెందిన మొత్తం 24 పార్టీలు అంగీకరించాయి. చైనా దురాక్రమణ, కుప్పకూలుతున్న ఆర్థిక వ్యవస్థ, పెరుగుతున్న నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, అదానీ కంపెనీ అక్రమాలు సహా పలు కీలక అంశాలను సమావేశాల్లో చర్చించాలని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత సోనియా గాంధీ ఇదివరకే ప్రధాని మోదీకి లేఖ రాశారు.

పార్లమెంట్ నూతన భవనంపై జాతీయ జెండా
పార్లమెంట్ నూతన భవనం గజద్వారంపై ఆదివారం సాయంత్రం ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఆయన వెంట లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఉన్నారు. అంతకుముందు ధన్‌ఖడ్, బిర్లాలకు సీఆర్‌పీఎఫ్ పార్లమెంట్ డ్యూటీ గ్రూప్ బలగాలు వేర్వేరుగా గౌరవవందనం సమర్పించాయి.



రేపు ఎంపీల ఫొటో సెషన్
ఎంపీలందరికోసం మంగళవారం ప్రత్యేక ఫొటో సెషన్ ఏర్పాటు చేశారు. పార్లమెంట్ సభ్యులంతా మంగళవారం ఉదయం 9.30 గంటలకు జరిగే గ్రూప్ ఫొటో సెషన్‌కు రావాల్సిందిగా లోక్‌సభ సెక్రటేరియట్ కోరింది.

మహిళా రిజర్వేషన్ బిల్లు పెట్టాల్సిందే

అఖిలపక్షం భేటీలో రాజకీయ పార్టీల పట్టు

సోమవారం నుంచి మొదలయ్యే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టాలని పలు రాజకీయ పార్టీలు ప్రభుత్వాన్ని గట్టిగా కోరాయి. అయితే, సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకుంటామని ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రత్యేక సెషన్ నేపథ్యంలో ఆదివారం ప్రభుత్వం ఏర్పాటు చేసిన అఖిలపక్షం భేటీకి పలు రాజకీయ పార్టీల నేతలు హాజరయ్యారు. ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న మహిళా రిజర్వేషన్ బిల్లును ఈ సమావేశంలోనే సభ ముందుంచాలని పలువురు నేతలు కోరారు. బిల్లు ఏకాభిప్రాయంతో ఆమోదం పొందుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. అయితే, కొన్ని ప్రాంతీయ పార్టీలు మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీలు, ఎస్సీలకు ప్రత్యేక కోటా కావాలంటూ డిమాండ్ చేస్తుండటం అడ్డంకిగా మారింది.



చిత్రంలో కనిపిస్తున్న ఈ జంతువు పూర్తిగా కుక్క కాదు, పూర్తిగా నక్క కాదు. రెండింటి లక్షణాల కలబోత. 2021లో బ్రెజిల్‌లో కారు ఢీకొని గాయపడగా, ఆసుపత్రికి తరలించారు. ఇది నక్క, కుక్క మధ్య సంపర్కం వల్ల పుట్టిన హైబ్రిడ్ జంతువుగా గుర్తించారు. ఇలా జరగడం అత్యంత అరుదు. ఇది ప్రపంచంలోనే మొట్టమొదటి డాగ్–ఫాక్స్ హైబ్రీడ్ 'డాగ్‌జిమ్'గా తేల్చారు. దురదృష్టవశాత్తూ కొన్ని నెలల క్రితమే మృతి చెందింది.


సాక్షి కరీంనగర్

సోమవారం । 18 । సెప్టెంబర్ । 2023

రావయ్యా.. గణపయ్యా



ఆది దంపతుల ప్రియసుతుడు, సర్వ విఘ్నాలు తొల గించే గణనాథుడు భూలోకంలో భక్తుల కోరికలు తీర్చేందుకు విచ్చేస్తున్నాడు. ఆయనకు స్వాగతం పలికేలా మంటపాలను మామిడితోరణాలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈసారి మట్టిగణపతినే పూజించేందుకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. పర్యావరణాన్ని కాపాడేలా తనను మట్టిరూపంలో కొలిచేందుకు సిద్ధమైన భక్తుల కోరికలు తీర్చాలన్న ఆకాంక్షతో వినాయకుడు మరికొద్ది గంటల్లోనే భువిపైకి చేరనున్నాడు. ఈ సాయంత్రం నుంచి నవ రాత్రులపాటు ఘనమైన పూజలందుకోనున్నాడు. తీరొక్క ఫలహారం.. ఉండ్రాళ్ల నైవేద్యం.. భజనలు తదితర ప్రత్యేక కార్యక్రమాలతో ఉమ్మడి జిల్లావ్యాప్తం గా ఆధ్యాత్మికశోభ సంతరించుకోనుంది. వినాయక చవితి విశిష్టత.. పూజావిశేషాలతో ప్రత్యేక కథనం..



- వివరాలు 8లో

న్యూస్‌రీల్

సృష్టికి మూలం విశ్వకర్మ



కరీంనగర్‌కల్చరల్: సృష్టికి మూలం విశ్వకర్మ అని, ప్రజలంతా సన్మార్గంలో నడిచేలా విశ్వ కర్మ యజ్ఞ దినోత్సవం జరుపుకుంటామని మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. బీసీసంక్షే మశాఖ ఆధ్వర్యంలో ఆదివారం కలెక్టరేట్‌లో విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం నిర్వహించారు. మంత్రి గంగుల కమలాకర్ ముఖ్యఅతిథిగా పాల్గొని విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేసి మాట్లాడారు.వచ్చే ఏడాది మరింత ఘనం గా విశ్వకర్మ యజ్ఞమహోత్సం నిర్వహించడం జరుగుతుందని, సంఘ భవన నిర్మాణానికి నిధులు మంజురు చేయడం జరిగిందని, నిర్మా ణ పనులు త్వరగా పూర్తిచేయాలని ఆదేశిం చారు. కలెక్టర్ గోపి మాట్లాడుతూ,.. రాష్ట్రంలో అన్నికులాలకు ప్రాధాన్యం ఇవ్వడం జరుగు తుందని, అందులోభాగంగా సెప్టెంబర్ 17న శ్రీ విశ్వకర్మ యజ్ఞమహోత్సవ కార్యక్రమంగా గుర్తించి ఘనంగా నిర్వహించేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. మేయర్ వై.సునీల్‌రావు, అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశా య్, లక్ష్మీకిరణ్, ఆర్డీవో కె.మహేశ్వర్, సుడా చైర్మన్ జీవీ.రామకృష్ణారావు, డిప్యూటీ మేయర్ చల్లస్వరూపారాణి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ పొన్నం అనిల్‌గౌడ్ పాల్గొన్నారు.

అధికారికంగా నిర్వహించకపోవడం దుర్మార్గం



కరీంనగర్: నిజాం నవాబుల పరిపాలనలో ఉన్న హైదరాబాద్ సంస్థానం తెలంగాణ సాయుధ పోరాట ఫలితంగా భారతదేశంలో విలీనమైన దినోత్సవంపై సీఎం కేసీఆర్ పూట కో మాట మాట్లాడుతూ అధికారికంగా నిర్వ హించకపోవడం దుర్మార్గపు చర్య అని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి అన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాల ముగింపు సందర్భంగా హైద రాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనమైన రోజున పురస్కరించుకొని ఆదివారం సీపీఐ జిల్లా కార్యాలయం బద్ధం ఎల్లారెడ్డి భవన్ వద్ద జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం హైదరాబాద్‌లో జరిగే సభకు వెళ్లే వాహనాన్ని జెండాఊపి ప్రారంభించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బోయిని అశోక్, కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, బండ రాజిరెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపెల్లి రాజు, కిన్నెర మల్లవ్వ, బామండ్లపెల్లి యుగేందర్, బోనగిరి మహేంద ర్ తదితరులు పాల్గొన్నారు.

అమరవీరులకు నివాళి



కరీంనగర్: నగరంలోని తెలంగాణచౌక్‌లో స్థానిక రెడ్డిసంఘాల ఆధ్వర్యంలో రెడ్డిపోరాట యోధులకు కొవ్వొత్తులతో ఘనంగా నివాళి అర్పించారు. నిజాం నిరంకుశ పరిపాలనకు వ్యతిరేకంగా ప్రాణాలకు తెగించి పోరాడిన వారిలో అనేకమంది రెడ్డిలు ఉన్నారని తెలిపా రు. అమరవీరుల పోరాటాలను స్ఫూర్తిగా తీసుకొని ఈనాటి యువత ముందుకు సాగాలని సూచించారు.. ఈ కార్యక్రమంలో పెండ్యాల కేశవరెడ్డి, బేతి మహేందర్‌రెడ్డి, రేకు లపల్లి రవీందర్‌రెడ్డి, అంబటి జోజిరెడ్డి, ఎడ బోయిన శ్రీనివాస్‌రెడ్డి, నేలకొండ ప్రసన్నకు మార్‌రెడ్డి, జగత్‌పాల్‌రెడ్డి, కోట భాస్కర్‌రెడ్డి, పూర్ణచందర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, జితేందర్‌రెడ్డి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

మహనీయుల బాటలో నడుద్దాం



భిన్నత్వంలో ఏకత్వం కాపాడటమే దేశభక్తి

ప్రసంగిస్తున్న మంత్రి కమలాకర్

- పదేళ్లల్లోనే ప్రగతి పరవళ్లు
- అభివృద్ధి, సంక్షేమమే మా నినాదం
- బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: మహనీయుల త్యాగాల ను స్మరించుకుంటూ ముందుకు సాగాలని బీసీ సం క్షేమశాఖ మంత్రి గంగుల కమలాకర్ పిలుపునిచ్చా రు. జిల్లాకేంద్రంలోని పోలీసు పరేడ్‌గ్రౌండ్‌లో ఆది వారం జాతీయ సమైక్యత దినోత్సవం నిర్వహించి, జాతీయజెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ.. తెలం గాణ జాతీయ సమైక్యత దినోత్సవం సందర్భంగా జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. చరిత్రలో 1948వ సంవత్సరం సెప్టెంబర్ 17కు ఒక విశిష్టత ఉందని, 75 ఏళ్లక్రితం ఇదే రోజున మన తెలంగాణ భారతదేశంలో అంతర్భాగంగా మారిందన్నారు.

వీరులకు జోహార్లు..

ఇటీవలే దేశస్వాతంత్ర్య వజ్రోత్సవాలు ఘనంగా జరుపుకున్నామని, దానికి కొనసాగింపుగానే తెలం గాణ జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని నిర్వహిం చుకుంటున్నామని స్పష్టం చేశారు. ఆదివాసీ వీరు డు కుమ్రంభీం, దొడ్డి కొమురయ్యతో పాటు నాటి పోరాటానికి నాయకత్వం వహించిన మహనీయు లు బద్ధం ఎల్లారెడ్డి, రావి నారాయణరెడ్డి, మగ్దూం మొహియుద్దీన్, భీంరెడ్డి నర్సింహారెడ్డి, చాకలి ఐల మ్మ, ఆరుట్ల రామచంద్రారెడ్డి, బొమ్మగాని ధర్మ భిక్షంగౌడ్ వంటి ప్రజానేతల త్యాగాలను సగర్వం గా స్మరించుకోవాలని సూచించారు.

చేతివృత్తులకు చేయూత

చేతివృత్తిదారుల జీవనాన్ని మెరుగుపర్చేందుకు బీసీ చేయూత పథకం ద్వారా ఇప్పటి వరకు జిల్లా లో 1,700మందికి రూ.లక్ష ఆర్థిక సాయం అందిం చామని తెలిపారు. మైనారిటీ కార్పొరేషన్ ద్వారా 174మందికి రూ.లక్ష చొప్పున రూ.1.74 కోట్ల విలువైన చెక్కులు అందించామని అన్నారు.

అవార్డుల్లో ప్రథమం

దివ్యాంగులకు ఫించన్ రూ.4016కు పెంచామని, బీడీ టేకేదారులకు రూ.2016 అందిస్తున్నట్లు తెలి పారు. జిల్లాలోని తొమ్మిది మండలాల్లోని 15గ్రా మాలకు స్వచ్ఛసర్వేక్షణ్ గ్రామీణ–2023 అవార్డు లు, గన్నేరువరం మండలం ఖాసింపేట, రామ డుగు మండలం వెలిచాల రాష్ట్రస్థాయి అవార్డులు సాధించడం సంతోషంగా ఉందని అన్నారు. అంబే డ్కర్ ఆశయాల స్ఫూర్తితో దళితబంధు ప్రవేశపెట్టి రాష్ట్రంలోనే మొట్టమొదటగా.. హుజూరాబాద్ ని యోజకవర్గంలో 18,021 కుటుంబాలకు రూ.10ల క్షల చొప్పున రూ.1784 కోట్లు అందించినట్లు తెలి పారు. జిల్లాలోని 49,544మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.261.19 కోట్లు జమచేశామన్నారు.

వైద్యరంగానికి పెద్దపీట

వైద్య రంగానికి పెద్దపీట వేస్తున్నామని ఏ రాష్ట్రంలో లేని విధంగా మెడికల్ కళాశాలలను స్థాపించుకు న్నామని, 85శాతం సీట్లు తెలంగాణ విద్యార్థులకే దక్కనున్నాయని అన్నారు. నగరం ఏ మూలన చూసిన అద్భుతమైన రోడ్లు, విద్యుత్‌లైట్లు, కేబుల్ బ్రిడ్జితో విరాజిల్లుతోందన్నారు. మానేరు రివర్ ఫ్రంట్‌లో ఏర్పాటు చేయనున్న అతిపెద్ద వాటర్ ఫౌంటెన్ పనులు ఏడాదిలో పూర్తిచేసి, బోటింగ్ ఏర్పాటు చేస్తామని వివరించారు.

సత్కారాలు.. సాంస్కృతిక కార్యక్రమాలు

అనంతరం మంత్రి కమలాకర్ స్వాతంత్ర్య సమర యోధులను సత్కరించారు. విద్యార్థుల సాంస్కృ తిక కార్యక్రమాలు, పోలీసుల విన్యాసాలు ఆకట్టుకు న్నాయి. ఎమ్మెల్యేలు సుంకె రవిశంకర్, రసమయి బాలకిషన్, జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, మేయర్ వై.సునీల్‌రావు, సుడా చైర్మన్ జీవీ.రామక్రి ష్ణారావు, కలెక్టర్ గోపి, సీపీ సుబ్బారాయుడు, అద నపు కలెక్టర్లు లక్ష్మీకిరణ్, ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవో మహేశ్, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, గ్రంథాలయ చైర్మన్ అనిల్‌కుమార్‌గౌడ్, ఏఎంసీ చైర్మన్ రెడ్డవేని మధు, డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణి తదితరులు పాల్గొన్నారు.



జెండా వందనం చేస్తున్న మంత్రి, ప్రముఖులు



స్వాతంత్ర్య సమరయోధులకు సన్మానం



పోలీసుల మాక్‌డ్రిల్



ఆకట్టుకున్న విద్యార్థుల నృత్యం

టీ హబ్‌లో నిలిచిన పరీక్షలు

- సాధారణ ఆరోగ్య పరీక్షలు మినహా అన్నీబంద్
- ఇబ్బందులు పడుతున్న రోగులు



తెలంగాణ రోగ నిర్ధారణ కేంద్రం

కరీంనగర్‌టౌన్: కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన ఆసుప త్రిలో ఏర్పాటు చేసిన తెలంగాణ రోగ నిర్ధారణ కేం ద్రం (టీ హబ్)లో సేవలు అందడం లేదు. గత 10 రోజులుగా రోగ నిర్ధారణ పరీక్షలు జరగడం లేదు. బయో కెమిస్ట్రీ పరీక్షలు నిర్వహించే మిషనరీ మర మ్మతుకు రావడంతో పరీక్షలు జరగడం లేదని అధికారులు చెబుతున్నారు. జిల్లాలోని 18 ప్రాథ మిక ఆరోగ్య కేంద్రాలు, 06 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 3 కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, జిల్లా ఆసుపత్రి, వెల్‌నెస్ సెంటర్, ఆయూష్ ఆసుప త్రుల నుంచి శాంపిల్స్ తీసుకువచ్చి ప్రతి రోజు వేల సంఖ్యలో టెస్టులు నిర్వహిస్తారు. 24 గంటల పాటు జరగాల్సిన టెస్టులు 10 రోజులుగా జరగకపోవడం వల్ల రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం సీఆర్‌పీ, వైడల్, థైరాయిడ్, విటమిన్ డి3, బీ12 వంటి టెస్టులకు మాత్రమే టీ హబ్ పరిమిత మైంది. బయోకెమిస్ట్రీ మిషన్ మరమ్మతుకు రావడం వల్ల ఆ మిషన్‌పై నిర్వహించే ఒక్క టెస్టు కూడా జరగడం లేదు. అత్యవసరంగా పరీక్షలు అవ సరమైన వారిని ప్రైవేటు డయాగ్నోస్టిక్ సెంటర్లకు పంపిస్తున్నారు.

> **రెండు మూడు రోజుల్లో పూర్తి టెస్టులు ప్రారంభిస్తాం**
>
> తెలంగాణ రోగ నిర్ధ్రాణ కేంద్రం (టీ హ బ్)లో సాధారణ పరీక్షలు నిర్వహిస్తున్నాం. మైక్రోబయాలజీ మిషన్ మరమ్మతుకు రావ డంతో ఆ మిషన్‌పై టెస్టులు చేయలేకపోతు న్నాం. మిషన్‌లోని ఒక పార్టు రిప్లేస్ చేయా ల్సి ఉంది. కంపెనీకి ఆర్డర్‌పెట్టాం. రెండు మూడు రోజుల్లో అన్ని టెస్టులు పూర్తి స్థాయి లో అందుబాటులో ఉంటాయి.
>
> – సమీర, టీ హబ్, మేనేజర్

విజయభేరికి తరలిన కాంగ్రెస్ దండు

- కొత్త జయపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో 50బస్సుల్లో తుక్కుగూడకు..



తిమ్మాపూర్/కరీంనగర్‌టౌన్: హైదరాబాద్ తుక్కు గూడలో ఆదివారం కాంగ్రెస్ నిర్వహించిన విజయ భేరి సభకు కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వేలాదిగా తరలివెళ్లారు. కాంగ్రెస్ సీనియర్ నేత కొత్త జయపాల్ రెడ్డి ఆధ్వర్యంలో సుమారు 50 బస్సులు, వంద కార్లలో వేలాదిగా కార్యకర్తలు తర లివెళ్లారు. నగరంలోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద కార్యకర్తలు, నాయకులు నివాళి అర్పిం చారు. అనంతరం వాహనాలకు జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. నగరంలోని ప్రధాన రహదారుల గుండా ఈ ర్యాలీ కాంగ్రెస్ జెండాలు, నినాదాలతో కొనసాగింది.

13 సీట్లు కాంగ్రెస్ వే..

కొత్త జయపాల్‌రెడ్డి అల్గునూర్‌లో మాట్లాడుతూ.. కరీంనగర్ ఉమ్మడిజిల్లాలో 13అసెంబ్లీ స్థానాలు కై వసం చేసుకుని సోనియా గాంధీకి బహుమతిగా ఇస్తామన్నారు. 1,200 మంది అమరవీరుల్లో 290మందిని మాత్రమే బీఆర్ఎస్ గుర్తించిందని.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రేవంత్‌రెడ్డి సమక్షంలో ఆయా కుటుంబాలను ఆదుకుంటామన్నారు. కరీం నగర్‌లో కుల, మత రాజకీయాలకు చెక్‌పెట్టే రోజులు దగ్గరయ్యాయని పేర్కొన్నారు.

క్లుప్తంగా

బీజేవైఎం జిల్లా అధ్యక్షుడిగా దురిశెట్టి సంపత్‌


నియామకపత్రం అందజేస్తున్న నాయకులు

కరీంనగర్‌ టౌన్‌: భారతీయ జనతా యువ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా దురిశెట్టి సంపత్‌ నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి నియామక పత్రం అందజేశారు. యువ మోర్చా పటిష్టతకు కృషి చేయాలని సూచించారు. ఈసందర్భంగా సంపత్‌ మాట్లాడుతూ, తన నియామకానికి కృషి చేసిన బీజేపీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు.

పద్య పోటీల న్యాయనిర్ణేతలకు అభినందనలు

కరీంనగర్‌కల్చరల్‌: మలేసియా తెలుగు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆ దేశంలో నిర్వహించిన భాగవత పద్య పోటీలకు జూమ్‌ వేదికగా జిల్లా నుంచి సంగీత దర్శకుడు కె.శర్మ, తెలుగు అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌, సాహితీవేత్త డాక్టర్‌ తత్వా ప్రమోద్‌కుమార్‌ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా వారికి సంఘం మాజీ అధ్యక్షుడు డాక్టర్‌ అచ్చయ్యకుమార్‌, ప్రస్తుత అధ్యక్షుడు డాక్టర్‌ వెంకట ప్రతాప్‌, నిర్వాహకుడు సత్య తదితరులు అభినందనలు తెలిపారు.

కవి విజయలక్ష్మికి ఆత్మీయ సత్కారం


విజయలక్ష్మిని సన్మానిస్తున్న కవులు

కరీంనగర్‌కల్చరల్‌: ఇటీవల పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుంచి కీర్తి పురస్కారం స్వీకరించిన రేగులపాటి విజయలక్ష్మి సాహితీ సేవలను కొనియాడుతూ తెలంగాణ రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆక్స్‌ఫర్డ్‌ హైస్కూలులో ఆదివారం అభినందన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెను సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్సారార్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ డా.కలువకుంట రామకృష్ణ హాజరై మాట్లాడారు. స్త్రీల అభ్యున్నతికి రేగులపాటి విజయలక్ష్మి ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు కొత్త అనిల్‌కుమార్‌, కవులు ఉప్పు లింగయ్య, నీలగిరి అనిత, దొమ్మాటి శంకర్‌ప్రసాద్‌, బొమ్మకంటి కిషన్‌, చకిలం స్వప్న, కాండూరి వెంకటేశ్వర్లు, గంగుల శ్రీకర్‌, ప్రేమ్‌సాగర్‌రావు, పెద్దిరాజు సత్యనారాయణ, శశి కిరణ్మయి, సిరిపురం వాణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

మహాకాయ.. పార్వతి తనయ



నేటి నుంచి వినాయక నవరాత్రోత్సవాలు

కరీంనగర్‌కల్చరల్‌/విద్యానగర్‌ : మహాకాయుడు.. పార్వతి తనయుడు.. సర్వ విఘ్న వినాశకుడు వినాయకుడి చవితి వేడుకలకు ప్రజలు సమాయత్తమయ్యారు. వేదకాలం నాటికే గణపతి పూజనీయుడైన దేవుడు. గజాననుడు, గణపతి, ఏకదంతుడు, లంబోధరుడు.. ఇలా ఎన్నో పేర్లతో భక్తులతో పూజలందుకుంటాడు. ఆబాల గోపాలానికి ఆరాధ్య దైవ్యం. ఏ కార్యం ప్రారంభించినా.. ఏ పూజ నిర్వహించినా మొదట పూజించేది వినాయకుడినే. భాద్రపద శుద్ధ చవితి స్వామి వారి పుట్టినరోజు కావడంతో వినాయకచవితి పర్వదినం లోక ప్రసిద్ధి చెందింది. చిన్న కండ్లు సూక్ష్మ బుద్ధికి, తొండం స్వీయ గౌరవానికి, పెద్ద చెవులు సకల విశేషాలను ఆకళింపు చేసుకోవడానికి, పెద్ద బొజ్జ రహస్యాలను దాచి ఉంచుకోవడానికి ప్రతీకలు. సోమవారం వినాయకచవితి సందర్భంగా కథనం..

గణపతులు 32 రూపాలు

- తంత్రశాస్త్రంలో గణపతులు 32 రూపాలుగా వర్ణించబడ్డాయి. భక్తి గణపతి, లక్ష్మీగణపతి, సిద్ధి గణపతి, భువనేశ గణపతి, హేరంబ గణపతి, మహాగణపతి, విఘ్నరాజ గణపతి, ఊర్ధ్వ గణపతి, ఉచ్ఛిష్ట గణపతి, శక్తి గణపతి, ధ్వజ గణపతి అనే 16 రూపాలు ఎక్కువ ప్రచారంలో ఉండగా, శ్రీవిజయ గణపతి, ఏకాక్షర గణపతి, వర గణపతి, త్ర్యక్షర గణపతి, హరిద్ర గణపతి, ఏకదంత గణపతి, సృష్టి గణపతి, ఉద్దండ గణపతి, రుడ్ని గణపతి, దుండిగణపతి, ద్విముఖ గణపతి, త్రిముఖ గణపతి, సింహ గణపతి, యోగ గణపతి, శ్రీసంకటహర గణపతి అన్నవి అంతగా ప్రచారంలో లేవు.

వ్రత విధానం

- చవితినాడు ఉదయం స్నానానంతరం నిత్యకర్మలు పూర్తి చేసుకుని శక్తిని బట్టి బంగారం, వెండి, మట్టితో చేసిన వినాయకుడి ప్రతిమను ఇంట్లో ఉత్తరం దిశలో బియ్యం పోసి మండపాన్ని నిర్మించాలి. అష్టదళ పద్మాన్ని రూపొందించి వినాయకున్ని ప్రతిష్ఠించాలి. శ్వేత గంధ అక్షతలు, పుష్పాలు ఏకవింశతి పత్రాలతో అర్చించాలి. ధూప, దీపాలు, వెలగ, నేరేడు తదితర ఫలాలను రకానికి 21 చొప్పున నివేదించాలి. త్రిలోక ప్రసిద్ధమైన ఈ వ్రతాచరణతో గణపతి అనుగ్రహం కలిగి సర్వ కార్యాలూ నెరవేరుతాయి. ఈ వ్రతాచరణ ఫలితంగానే విదర్భ రాజ యువరాణి దమయంతి నల మహారాజును, శ్రీకృష్ణుడు శమంతక మణి, జాంబవతి, సత్యభామకు ఇష్ట సఖుడయ్యాడు.



విదేశాల్లో సైతం గణపతి ఆరాధన

గణపతి ఆరాధన కేవలం మన దేశానికే పరిమితం కాదు. శ్రీలంక, టిబెట్‌, నేపాల్‌, థాయ్‌లాండ్‌, పర్షియా, ఆఫ్ఘనిస్తాన్‌, మధ్యఆసియా, జావా, బలిద్వీపం, బోర్నియా, మంగోలియా, కంబోడియా, బర్మా, చైనా, జపాన్‌, అమెరికా వంటి దేశాల్లో కూడా వినాయకుడిని వారి వారి సంప్రదాయాల్లో రూపొందించి ఆరాధిస్తారు.

ముగిసిన విశ్వకర్మ భగవానుని బ్రహ్మోత్సవాలు


పూజలో పాల్గొన్న భక్తులు

కరీంనగర్‌కల్చరల్‌: నగరంలోని కమాన్‌ చౌరస్తా వద్ద గల పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో రెండు రోజులుగా జరుగుతున్న విశ్వకర్మ భగవానుని బ్రహ్మోత్సవాలు ఆదివారంతో ముగిసాయి. ఉదయం స్థాపిత దేవతారాధనలు, శ్రీగాయత్రీ విశ్వకర్మ సహస్ర నామార్చనలు, పూర్ణాహుతి, మహానివేదన, మహామంత్రపుష్పం అనంతరం తీర్థప్రసాద వితరణ గావించారు. మంత్రి గంగుల కమలాకర్‌, మేయర్‌ సునీల్‌రావు హాజరై పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఈవో వెంకన్న, ఆలయ చైర్మన్‌ గొల్లపల్లి శ్రీనివాస్‌, శ్రీధర్‌, శ్రీరామోజు నాగరాజు, వేములవాడ రవీంద్రచారి, మియాపురం వీరబ్రహ్మచారి, అనసూయ రమేశ్‌, ముత్తోజు సూర్యనారాయణ, భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం విశ్వకర్మ భగవానుని ఉత్సవ మూర్తులను ప్రత్యేక వాహనంలో అలంకరించి నగర వీధుల్లో శోభాయాత్ర నిర్వహించారు.

యువకుడి ఆత్మహత్య

సుల్తానాబాద్‌రూరల్‌(పెద్దపల్లి): సుల్తానాబాద్‌ మండలం రేగడిమద్దికుంట గ్రామానికి చెందిన ఇరవేని రాజ్‌కుమార్‌(19) శనివారం అర్ధరాత్రి దాటాక గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై విజేందర్‌ వివరాల ప్రకారం.. రాజ్‌కుమార్‌ స్థానికంగా ఓ టెంట్‌హౌజ్‌లో పనిచేసేవాడు. రోజూ మద్యం తాగుతుండటంతో తల్లి తాగవద్దని మందలించింది. దీంతో మనస్తాపం చెంది గ్రామ శివారులోని హనుమాన్‌ గుడివద్ద గడ్డి మందు తాగాడు. స్థానికులు గమనించి సుల్తానాబాద్‌ ప్రభుత్వ ఆసుపత్రికి, మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ రాత్రి 1గంట సమయంలో మృతిచెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఒక్క వార్డు సభ్యుడు గెలిచినా రాజీనామా చేస్తా..!

ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌


ఊరేగింపుగా వస్తున్న ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌

తిమ్మాపూర్‌(మానకొండూర్‌): మానకొండూర్‌ నియోజకవర్గానికి మళ్లీ తానే ఎమ్మెల్యే అవుతానని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌ ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో కాంగ్రెస్‌ నుంచి ఎమ్మెల్యేగా కాదు.. వార్డు మెంబర్‌గా ఒక్కరు గెలిచినా తన పదవికి బేషరతుగా రాజీనామా చేస్తానని సవాల్‌ విసిరారు. తిమ్మాపూర్‌ మండలం నుంచి నుస్తులాపూర్‌ వేదికగా వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరగా, వారికి కండువా కప్పి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కవ్వంపల్లికి రోజులు దగ్గర పడ్డాయని, కాంగ్రెస్‌ నాయకులను తరిమికొట్టే రోజులు వచ్చాయన్నారు. ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే జనాలు తరిమికొడతారని పేర్కొన్నారు. గత ఎన్నికల కంటే ఈసారి ఇంకా మెజార్టీ వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో ఎన్నడూ లేని అభివృద్ధి ఈ పదేళ్లలో చేశానని సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారావు, మండల అధ్యక్షుడు, స్థానిక సర్పంచ్‌ రావుల రమేశ్‌, ఎంపీటీసీ కొత్త తిరుపతిరెడ్డి, కొమురయ్య, శ్రీనివాస్‌రెడ్డి, వీరారెడ్డి, అశోక్‌రెడ్డి, అనిల్‌గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలకు నిలయంగా చాంబర్లు

- ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిపై ఎత్తుగా నిర్మాణం
- చాంబర్‌పై నుంచి వెళ్లిన ద్విచక్రవాహనదారుడికి తీవ్రగాయాలు
- సకాలంలో స్పందించి ఆసుపత్రికి తరలించిన బ్లూకోల్ట్‌ సిబ్బంది


ప్రమాదానికి కారణమైన సాలెహ్‌నగర్‌ రహదారిపై గల చాంబర్‌

కొత్తపల్లి(కరీంనగర్‌): కరీంనగర్‌ నుంచి పలు ప్రాంతాలకు వెళ్లే ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారులపై నిర్మించిన చాంబర్లు ప్రమాదకరంగా పరిణమించాయి. రహదారికి సమాంతరంగా కాకుండా ఎత్తుగా ఏర్పాటు చేయడంతో ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. రహదారి చివరన ఏర్పాటు చేయకుండా దారిపైనే వీటిని నిర్మించడం ప్రయాణానికి ఇబ్బందిగా తయారైంది. కరీంనగర్‌–జగిత్యాల ప్రధాన రహదారిపై సూర్యనగర్‌, సాలెహ్‌నగర్‌ ప్రాంతాల్లో చాంబర్ల మూలంగా ఆదివారం ప్రమాదం చోటుచేసుకుంది. జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రానికి చెందిన కార్తీక్‌ వ్యక్తిగత పనుల నిమిత్తం కరీంనగర్‌కు వచ్చి తిరిగి వెళ్తుండగా సాలెహ్‌నగర్‌ వద్ద జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. కరీంనగర్‌కు కొత్త అయిన కార్తీక్‌ సాలెహ్‌నగర్‌ సమీపంలోని చాంబర్‌ను గమనించకుండా తన ద్విచక్ర వాహనంపై వెళ్తున్న క్రమంలో ఒక్కసారిగా ప్రమాదం జరగడంతో షాక్‌కు గురయ్యాడు. చాంబర్‌ ఎత్తుగా ఉండటం వల్ల తన ద్విచక్రవాహనం అదుపుతప్పి కొంత దూరం ఎగిరిపడటంతో అతడి ముఖానికి, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. సాలెహ్‌నగర్‌ సమీపంలోనే అందుబాటులో ఉన్న కొత్తపల్లి రూట్‌ బ్లూకోల్ట్‌ పోలీస్‌ కానిస్టేబల్‌ జి.మనోహర్‌, హోంగార్డు ఎం.దేవేందర్‌ హుటాహుటిన 108 వాహనంలో చికిత్స నిమిత్తం తరలించారు. ఇదిలా ఉంటే సూర్యనగర్‌ రోడ్‌– 5 సమీపంలో గల చాంబర్‌పై నుంచి వెళ్లిన ఆటో ట్రాలీ బోల్తాపడి అద్దాలు ధ్వంసమయ్యాయి. నిత్యం వేలాది వాహనాలు ప్రయాణించే ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారులపై ఎత్తుగా ఏర్పాటు చేసిన చాంబర్లు ప్రయాణికుల పాలిటశాపంగా మారుతున్నాయి. సదరు చాంబర్లను సరిచేయకుండా ఇష్టానుసారంగా నిర్మించడం వల్ల తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి చాంబర్లను పునర్‌నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు.


తీవ్రంగా గాయపడిన కార్తీక్‌

రోడ్డు ప్రమాదంలో పంచాయతీ కార్యదర్శి మృతి


రవీందర్‌ (ఫైల్‌)

చొప్పదండి: పట్టణ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పంచాయతీ కార్యదర్శి మీర్జ రవికుమార్‌ (53)మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. ఆర్నకొండ గ్రామానికి చెందిన రవీందర్‌ గంగాధర మండలం కాచిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తు చొప్పదండిలో నివాసం ఉంటున్నాడు. ఇటీవలే ఆర్నకొండలో ఇంటిని మరమ్మతు చేయించి అక్కడికి నివాసం మార్చేందుకు పూజలు కూడా చేయించాడు. ఆదివారం సమైక్యత దివస్‌ పురస్కరించుకొని కాచిరెడ్డిపల్లి వెళ్లి వచ్చాడు. చొప్పదండిలోని హెచ్‌పీ పెట్రోల్‌ బంకులో తన బైక్‌లో పెట్రోల్‌ పోయించుకొని ఇంటికి బయలుదేరగా వెనుక నుంచి అతి వేగంగా, అజాగ్రత్తగా వచ్చిన టిప్పర్‌ (టీఎస్‌12 యూబీ 5304) బలంగా ఢీకొంది. ఈప్రమాదంలో కిందపడిన రవీందర్‌ తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య సుమలత మండలంలోనే రెండో ఏఎన్‌ఎంగా పని చేస్తోంది. భార్య ఫిర్యాదు మేరకు టిప్పర్‌ డ్రైవర్‌ కొత్తపల్లి మండలం కమాన్‌పూర్‌కు చెందిన బూస ఆంజనేయులుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఉపేంద్రచారి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

శంకరపట్నం(మానకొండూర్‌): మండల కేంద్రంలో రెండు మోటార్‌ సైకిళ్లు ఢీకొని ఇద్దరు గాయపడినట్లు పోలీసులు తెలిపారు. తిమ్మాపూర్‌ మండలం పొరండ్ల గ్రామానికి చెందిన తోడంగుల సమ్మయ్య మోటార్‌ సైకిల్‌పై కేశవపట్నం మెయిన్‌రోడ్‌ వైపు వస్తున్నాడు. కేశవపట్నంలోని సీడ్‌ దుకాణం యజమాని చోటాలాల్‌ మోటార్‌ సైకిల్‌పై గ్రామంలోకి వెళ్తుండగా ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈప్రమాదంలో సమ్మయ్యకు తీవ్ర గాయాలు కాగా 108 వాహనంలో పోలీసులు కరీంనగర్‌కు తరలించారు. స్వల్పగాయాలైన చోటాలాల్‌ను స్థానిక ఆసుపత్రిలో చేర్పించారు.

ఇసుక లారీల పట్టివేత


పట్టుబడిన ఇసుక లారీలు

జమ్మికుంట(హుజూరాబాద్‌): అధిక లోడుతో ఇసుక రవాణా చేస్తున్న లారీలను శనివారం అర్ధరాత్రి పట్టణ సీఐ రమేశ్‌ పట్టుకున్నారు. జమ్మికుంట మున్సిపల్‌ పరిధి కొత్తపల్లి వద్ద తనిఖీలో చేస్తున్న సమయంలో పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్‌ మండలంలోని కిష్టంపేట క్వారీ నుంచి ఇసుక రవాణా చేస్తున్న 12 లారీలను పట్టుకున్నారు. ఈ సందర్భంగా వాటి వేబిల్లు పరిశీలించగా అధిక లోడుతో రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. శాఖాపరమైన చర్యల కోసం కరీంనగర్‌ మైనింగ్‌ అధికారులకు లారీలను అప్పగించినట్లు సీఐ తెలిపారు.

రెగ్యులరైజ్‌ చేయాలి

కరీంనగర్‌: విద్యాశాఖలోని సమగ్ర శిక్ష లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను వెంటనే రెగ్యులర్‌ చేయాలని తెలంగాణ సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం జేఏసీ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి ఆంజనేయులు డిమాండ్‌ చేశారు. రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు కలెక్టరేట్‌ ఎదుట చేస్తున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారం 17వ రోజుకు చేరాయి. దీక్షలకు తెలంగాణ సెకండరీ గ్రేడ్‌ టీచర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కరివేద మహిపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు చికోటి మాధవ్‌, జిల్లా అధ్యక్షుడు విజేందర్‌రెడ్డి, తిమ్మాపూర్‌ అధ్యక్షుడు గడప శేఖర్‌, ప్రధాన కార్యదర్శి సంతోష్‌ కుమార్‌, మన్నెంపల్లి ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రవీందర్‌, పార్థసారథి, తపస్‌ రాష్ట్ర కార్యదర్శి వేణు కుమార్‌ సంఘీభావం తెలిపారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల డిమాండ్లను సీఎం కేసీఆర్‌ నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో గుండా రాజిరెడ్డి, దీప్తి, మంగ, విజయలక్ష్మి, మంజుల, అర్చన, శ్రీవాణి, రజిత తదితరులు పాల్గొన్నారు.

'మతం రంగు పులిమేందుకు బీజేపీ యత్నం'


కాగడాలతో ర్యాలీ తీస్తున్న నాయకులు

కరీంనగర్‌: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రతో ఏమాత్రం సంబంధం లేని బీజేపీ, టీఆర్‌ఎస్‌ పార్టీలు చరిత్రను వక్రీకరిస్తూ తప్పుదారి పట్టిస్తున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి విమర్శించారు. ఆదివారం సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సందర్భంగా స్థానిక తెలంగాణ చౌక్‌ నుంచి చిట్యాల ఐలమ్మ విగ్రహం వరకు కాగడాల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కమ్యూనిస్టుల పోరాటాల త్యాగాల ఫలితంగా తెలంగాణ సంస్థానం భారతదేశంలో విలీనమైందన్నారు. అసాధారణ చరిత్ర కలిగిన సాయుధ పోరాటాన్ని బీజేపీ వక్రీకరించి హిందూ, ముస్లిం మతం రంగు పులమడానికి ప్రయత్నిస్తుందని ఆరోపించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని, అమరవీరుల స్మృతి వనాలు, విగ్రహాలు ఏర్పాటు చేయాలని డిమాండ్‌ చేశారు. నాటి పోరాట స్ఫూర్తితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమిస్తామని కార్పొరేట్ల, బహుళ జాతి కంపెనీల దోపిడీని అడ్డుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సుంకరి సంపత్‌, డి.నరేశ్‌, నాయకులు కోనేటి నాగమణి, తిప్పారపు సురేశ్‌, జి.తిరుపతినాయక్‌, గజ్జల శ్రీకాంత్‌, కాంపల్లి అరవింద్‌, పున్నం రవి, శ్రీనివాస్‌, కె.సాగర్‌, లక్‌పతినాయక్‌, శివ, రవీందర్‌నాయక్‌, రాజ్‌కుమార్‌, వినయ్‌ తదితరులు పాల్గొన్నారు.

అనీమియా మొబైల్‌ వ్యాన్‌ ప్రారంభం


మొబైల్‌ వ్యాన్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్‌ గౌతమిరెడ్డి

కరీంనగర్‌ టౌన్‌: రాష్ట్రంలోనే మొట్టమొదటి అనీమియా మొబైల్‌ వ్యాన్‌ను గౌతమి ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఫౌండేషన్‌ చైర్మన్‌, గైనకాలజిస్టు డాక్టర్‌ గౌతమిరెడ్డి ఆదివారం కరీంనగర్‌ క్లబ్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, దేశంలో మహిళలు అత్యధికంగా ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలలో ప్రధానమైనది రక్తహీనత (అనీమియా) అని, దానివల్ల స్త్రీలు ఇతర ఆరోగ్య సమస్యలు కూడా ఎదుర్కొంటున్నారని తెలిపారు. రక్తహీనతతో బాధపడే మహిళలు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకొని, మందులు వాడడం తప్పనిసరి అన్నారు. ప్రతినెలా ఆసుపత్రికి వెళ్లడం, మందులు కొనుక్కోవడం కుదరని మధ్యతరగతి స్త్రీల కోసం గౌతమి ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో ఉచిత అనీమియా పరీక్షను నిర్వహించి వారికి అవసరమైన మందులను ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. అనీమియా వ్యాన్‌ రోజూ జిల్లాలోని ఏదో ఒక ప్రాంతంలో మహిళలకు ఉచితంగా రక్త పరీక్షలు నిర్వహించి, 9 గ్రాముల కన్నా తక్కువ రక్తం ఉన్నవారికి నెల రోజుల వరకు సరిపోయే ఐరన్‌ మాత్రలను అందజేయడం జరుగుతుందని వివరించారు. రక్తహీనతతో బాధపడుతున్న మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఫౌండేషన్‌ బాధ్యులు డాక్టర్‌ వి.రోహిత్‌రెడ్డి, కరీంనగర్‌ క్లబ్‌ కార్యదర్శి అశోక్‌రావు, సీఐ సృజన్‌రెడ్డి, ఎస్‌ఐ అభిలాష్‌ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పోస్టర్ ఆవిష్కరణ



విద్యానగర్: మట్టి గణపతి వినియోగంపై అవగాహన కల్పించేందుకు అలయన్స్ 137ఏ కరీంనగర్ ప్రొవిన్స్, మహాశక్తి అలయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మట్టి మేలు తల పెట్టవోయ్- మట్టి గణపతి మన దళపతి పేరిట రూపొందించిన పోస్టర్లను ఆదివారం మేయర్ సునీల్‌రావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో అలయన్స్ గవర్నర్ గాలిపల్లి నాగేశ్వర్, శ్రీనివాస్ గాంధీ, మహాశక్తి ప్రతినిధులు రేణుక, సంజన, నాజియా, అలయన్స్ భగత్ నగర్ ప్రతినిధులు పండుగ నాగరాజు, భోగ నగేశ్, ప్రభాకర్ రెడ్డి, గీకురు ఆంజనేయులు, ప్రకాష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

కరీంనగర్: తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని సంఘం నాయకులు కోరారు. ఆదివారం కలెక్టరేట్‌లో మంత్రి గంగుల కమలాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. మంత్రి సానుకూలంగా స్పందించి సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సమగ్ర శిక్షా జిల్లా జేఏసీ అధ్యక్షుడు బెజ్జంకి ఆంజనేయులు, సీఆర్పీల జిల్లా సంఘం ప్రధాన కార్యదర్శి గుండా రాజిరెడ్డి, ఎంఐఎస్ జిల్లా అధ్యక్షురాలు వైద్య దీప్తి, మంగ, విజయలక్ష్మి, మంజుల, రజిత, చక్రపాణి, శ్రీనివాస్, కనుకుల రమేశ్ పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన ఎంపీడీవో



కరీంనగర్‌రూరల్: కరీంనగర్ ఎంపీడీవోగా విధుల్లో చేరిన ఎస్.దివ్యదర్శన్‌రావు ఆదివారం రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. మంత్రి కమలాకర్, మేయర్‌సునీల్‌రావులు ఎంపీడీవోకు శుభాకాంక్షలు తెలిపారు.

మొక్కలు నాటిన బీజేపీ నాయకులు

కరీంనగర్‌టౌన్: భారతదేశ ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం పురస్కరించుకొని రేకుర్తి ఐ హాస్పిటల్ బైపాస్‌రోడ్‌లో ఆదివారం బీజేపీ నాయకులు మొక్కలు నాటారు. ఎస్సీసెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి జాడి బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కాల్వ పూర్ణచందర్ రెడ్డి, గోదారి నరేశ్, ఎం.లక్ష్మీరాజం, చంద్రగిరి వేణు, దుర్గం ఆంజనేయులు పాల్గొన్నారు.

స్నేహ వొకేషనల్ కళాశాల ఫ్రెషర్స్ డే



పాల్గొన్న కళాశాల యాజమాన్యం, విద్యార్థులు

కరీంనగర్: స్నేహ వొకేషనల్ జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు ఆదివారం ఫిలింభవన్‌లో ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి కరస్పాండెంట్, సెక్రెటరీ దుగ్యాని వెంకటేశ్, రేడియాలజిస్ట్ డాక్టర్ ప్రియాంకరెడ్డి, డాక్టర్ సతీష్‌రెడ్డి, డాక్టర్ బలరాంలు హాజరై మాట్లాడుతూ మెడికల్ డిపార్ట్‌మెంట్‌కు విద్యార్థినీ విద్యార్థులు ఇష్టపడి వచ్చి మధ్యలోనే ఆగిపోకుండా పట్టుదలతో చదివి స్థిరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు నవీన్‌కుమార్, ఆశాషిస్, రాధవేణి, సుమన, జ్యోతి, సాహితీ.శివనాథ్, రాజేశ్వరి, రవితేజతోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ జెండా ఆవిష్కరణ



జిల్లా జైలులో జెండా ఆవిష్కరిస్తున్న సూపరింటెండెంట్ సమ్మయ్య



జిల్లా ఆసుపత్రిలో..



కొత్తపల్లి మున్సిపల్ కార్యాలయంలో ..



జెండా వందనం చేస్తున్న సుడా చైర్మన్ రామకృష్ణారావు



ఎంపీడీవో కార్యాలయంలో..

కరీంనగర్/కరీంనగర్‌క్రైం/కరీంనగర్‌టౌన్/కరీంనగర్‌కార్పొరేషన్/విద్యానగర్/కరీంనగర్ రూరల్/కొత్తపల్లి: కరీంనగర్‌తో పాటు కరీంనగర్‌రూరల్, కొత్తపల్లి మండలాల్లో ఆదివారం జాతీయ సమైక్యత, తెలంగాణ విమోచన, విలీన దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యాలయాల్లో జాతీయ జెండాలను ఎగురవేశారు.

- తెలంగాణ జాతీయ సమైక్యత దినోత్సవాన్ని తీగలగుట్టపల్లిలోని తెలంగాణభవన్‌లో మంత్రి గంగుల కమలాకర్ నిర్వహించారు. జాతీయ జెండా ఆవిష్కరించారు.
- శాతవాహన అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(సుడా) కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు జెండా ఆవిష్కరించారు. సుడా వైస్ చైర్మన్ ప్రఫుల్‌దేశాయ్, సభ్యులు నేతి రవివర్మ, వంగర రవి, ఒల్లాల శ్రీనివాస్, చిగిరి శోభ తదితరులు పాల్గొన్నారు.
- జిల్లా గ్రంథాలయ సంస్థలో చైర్మన్ పొన్నం అనిల్ కుమార్‌గౌడ్ జాతీయ పతాకావిష్కరణ చేశారు. విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. లైబ్రేరియన్ సరితరెడ్డి, సిబ్బంది మలయ్య, గౌతమి, లక్ష్మి, రవి, పవన్ ,శశి పాల్గొన్నారు.
- పోలీస్ కమిషనరేట్ కేంద్రంలో సీపీ ఎల్.సుబ్బారాయుడు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. కమిషనరేట్ పోలీస్ కార్యాలయంలో అడిషనల్ (డీసీపీపరిపాలన) సి.రాజు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. సీటీసీలో అడిషనల్‌డీసీపీ(శాంతి భద్రతలు) ఏ.లక్ష్మీనారాయణ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు.
- నగరపాలకసంస్థ కార్యాలయంలో మేయర్ సునీల్‌రావు జాతీయజెండా ఆవిష్కరించారు. డిప్యూటీ మేయర్ చల్లా స్వరూపరాణి, నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్‌దేశాయి, కార్పొరేటర్లు గందె మాధవి, కమల్‌జిత్‌కౌర్, చాడగొండ బుచ్చిరెడ్డి, బండారి వేణు, జంగిలి ఐలెందర్‌యాదవ్, తోట రాములు తదితరులు పాల్గొన్నారు.
- జిల్లా జైలులో జైలు సూపరింటెండెంట్ సమ్మయ్య జెండా ఆవిష్కరించారు. జిల్లా సబ్ జైళ్ల అధికారి కె.శ్రీనివాస్, జైలర్ పి.శ్రీనివాస్, బి.రమేష్, డిప్యూటీ జైలర్స్ కె.శ్రీనివాస్‌రెడ్డి, ఎస్.సుధాకర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.
- ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో జాతీయ సమైక్యతా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణప్రసాద్, ఆర్ఎంవో డాక్టర్ జ్యోతి, ఏవో నజీముల్లాఖాన్, వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.
- కొత్తపల్లి మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. మున్సిపల్ కమిషనర్ కట్ల వేణుమాధవ్, కౌన్సిలర్లు వాసాల రమేశ్, గున్నాల విజయ, కోఆప్షన్ సభ్యుడు ఎండి ఫక్రుద్దీన్, మున్సిపల్ అధికారులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.
- కరీంనగర్ మండల పరిషత్ కార్యాలయంలో తెలంగాణ జాతీయ సమైక్యత దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఎంపీపీ తిప్పర్తి లక్ష్మయ్య జాతీయ జెండాను ఎగురవేయగా ఎంపీడీవో దివ్యదర్శన్ రావు, ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి, కార్యాలయ సూపరింటెండెంట్ సంపత్‌కుమార్, పీఆర్ ఏఈ రమణారెడ్డి, ఏపీవో శోభ తదితరులు పాల్గొన్నారు.
- ఎంపీ కార్యాలయంలో బీజేపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలు నిర్వహించారు. రెడ్‌క్రాస్ బ్లడ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, నాయకులు గుగ్గిలపు రమేశ్, నాగేశ్వర్‌రెడ్డి, తదితరులు తదితరులు పాల్గొన్నారు.
- తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా కరీంనగర్ ఫతేపూరలో గాంధీ క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఎగురవేశారు. మాజీ ఎమ్మెల్సీ టి.సంతోష్‌కుమార్, గాంధీ క్లబ్ అధ్యక్షుడు జోగినపల్లి రఘునందన్‌రావు, పద్మనాయక వెలమ సంఘం అధ్యక్షులు జువ్వాడి వేణుగోపాల్‌రావు, బీఆర్ఎస్ నాయకులు వంగల పవన్‌కుమార్, గాంధీ క్లబ్ కరీంనగర్ అధ్యక్షుడు తాటికొండ భాస్కర్, ప్రధాన కార్యదర్శి వీరారెడ్డి, రామేశం, లక్ష్మణ్‌రాజు, రాంమనోహర్, టి.హరికుమార్‌గౌడ్, సూర్యనారాయణ, సత్యనారాయణ పాల్గొన్నారు.
- మొగ్దుంపూర్‌లో నిర్వహించిన విమోచన దినోత్సవంలో ఉప సర్పంచ్ కూకట్ల తిరుపతి జాతీయ జెండా ఎగురవేయగా నల్లగుంటపల్లిలో తమ్మనవేణి ఓదెలు, సంజీవ్, శ్రీనివాస్, మల్లేశ్ పాల్గొన్నారు.
- ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ కార్యాలయంలో తెలంగాణ విలీన దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి జోజిరెడ్డి జెండా ఆవిష్కరించారు. ఏఐఎఫ్‌బీ నాయకులు తేజ్‌దీప్‌రెడ్డి, విజయ్‌కుమార్, పెద్దెల్లి శేఖర్, సత్యరావు, శంకర్, రాజశేఖర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



జెండావిష్కరణ చేస్తున్న బీజేపీ నాయకులు



జెండా ఎగురవేస్తున్న గాంధీ క్లబ్ అధ్యక్షుడు రఘునందన్



జెండా వందనం చేస్తున్న ఏఐఎఫ్‌బీ నాయకులు

శ్రమదానం



శ్రమదానంలో పాల్గొన్న డీపీవో వీరబుచ్చయ్య, ప్రజాప్రతినిధులు

కరీంనగర్‌రూరల్: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఆదివారం కరీంనగర్ మండలం గోపాల్‌పూర్‌లో శ్రమదానం చేశారు. ముఖ్య అతిథిగా డీపీవో వీరబుచ్చయ్య పాల్గొని తెలంగాణ క్రీడా ప్రాంగణంలోని గడ్డి, చెత్తాచెదారాన్ని తొలగించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. వైస్ ఎంపీపీ వేల్పుల నారాయణ, సర్పంచ్ ఊరడి మంజుల, ఉప సర్పంచ్ ఆరె శ్రీకాంత్, డీఆర్‌డీవో శ్రీలత, స్వచ్ఛభారత్ కోఆర్డినేటర్ రమేశ్, ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి, ఈజీఎస్ ఏపీవో శోభ, పంచాయతీ కార్యదర్శి హిదైతుల్లా తదితరులు పాల్గొన్నారు. చెర్లభూత్కూర్ క్రీడాప్రాంగణంలో నిర్వహించిన శ్రమదానంలో సర్పంచ్ దబ్బెట రమణారెడ్డి, ఉప సర్పంచ్ శేఖర్, ఎంపీటీసీ బుర్ర తిరుపతి, పంచాయతీ కార్యదర్శి వాహెద్ తదితరులు పాల్గొన్నారు.

ఒకటిన రెడ్డి సంక్షేమ సంఘం ఎన్నికలు

విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్ భగత్‌నగర్ రెడ్డి సంక్షేమ సంఘం ఎన్నికలు అక్టోబర్ ఒకటిన నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి పెండ్యాల కేశవరెడ్డి తెలిపారు. ఈనెల 23న నామినేషన్ల స్వీకరణ, 24న నామినేషన్ల పరిశీలన, 25న ఉపసంహరణ, 1న ఓటింగ్, అదే రోజు సాయంత్రం ఓట్ల లెక్కింపు జరుగుతుందని పేర్కొన్నారు.

వృద్ధురాలు మృతి

కరీంనగర్‌క్రైం: నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఒక వృద్ధురాలు మృతి చెందింది. ఆసుపత్రి అవుట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సరస్వతీ(70) అనే వృద్ధురాలు ఆగస్టు 31 తేదీన కిడ్నీ, గుండె సంబంధిత వ్యాధితో ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. ఆమె మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు.

ముస్తాబైన మండపాలు



టవర్ సర్కిల్‌లో...



భగత్‌నగర్ బొమ్మ వద్ద..

కరీంనగర్‌కల్చరల్: వినాయక నవరాత్రోత్సవాలను పురస్కరించుకొని వినాయకుడి ప్రతిమను ప్రతిష్ఠించేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు, పలు యూత్‌క్లబ్ ఆధ్వర్యంలో వినాయక మండపాలు సిద్ధం చేశారు. వివిధ సైజుల్లో అన్ని హంగులతో పలు రూపాల్లో ఉన్న వినాయక విగ్రహాలు మంటపాలకు తరలుతున్నాయి. అబ్బురపరిచే సెట్టింగులతో కలకత్తా, మహారాష్ట్ర, రాజస్థానీ, ముంబై, ఢిల్లీ వంటి ప్రాంతాల్లో మంటపాలను తలపించేలా నిర్మాణాలు సిద్ధమయ్యాయి. తొమ్మిది రోజులు ప్రత్యేక పూజ, అభిషేకాలు, అన్నదానాలు, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఆధ్యాత్మిక సందడి నెలకొననుంది.

దేశ సేవ చేసే భాగ్యం అదృష్టంగా భావించాలి



ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులను సన్మానిస్తున్న అనిల్‌గౌడ్

కొత్తపల్లి: భారత సైన్యంలో చేరి దేశ సేవ చేసే భాగ్యం లభించడం అదృష్టంగా భావించాలని, అలాంటి వీర జవాన్లను మనమంతా ప్రోత్సహించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్‌గౌడ్ అన్నారు. రేకుర్తిలోని సాన్వీ జూనియర్ కళాశాల, డిఫెన్స్ అకాడమీ ఫ్రెషర్స్ డే వేడుకలు కొత్తపల్లి శివారులోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం అట్టహాసంగా జరిగాయి. 'పరివర్తన్' పేరిట నిర్వహించిన వేడుకలకు అనిల్‌గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రసంగించారు. దేశ భక్తి కలిగిన విద్యార్థులు అతి పిన్న వయస్సులో డిఫెన్స్ రంగంలో రాణిస్తూ ఉద్యోగాలు సాధించడం గర్వకారణమన్నారు. ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్‌లో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులను ఘనంగా సన్మానించారు. సాన్వీ కరస్పాండెంట్ ఎర్రంశెట్టి మునీందర్ మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు ఉద్యోగాలు సాధించడం ఆనందంగా ఉందన్నారు. ప్రిన్సిపాల్ సిరిపురం ప్రసాద్, అధ్యాపకులు దేవేందర్‌రెడ్డి, సందీప్ రెడ్డి, సురేందర్, మోహన్, అఖిల్, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

'మన నేత మన ఇంటికి గంగుల' కార్యక్రమం



అభివృద్ధి పనులను వివరిస్తున్న ఎదుల్ల రాజశేఖర్

కరీంనగర్: ఎన్నికల సమయంలో ప్రజల ముంగిట్లోకి వెళ్లేందుకు ఇప్పటికే నాయకులు ఒక్కో కార్యక్రమాన్ని ఎంచుకొని వారి వారి డివిజన్లలో ప్రచార పర్వాన్ని కొనసాగిస్తున్నారు. తాజాగా 19వ డివిజన్ కార్పొరేటర్ ఏదుల్ల రాజశేఖర్ ఆధ్వర్యంలో 'మన నేత మన ఇంటికి' గంగుల కమలాకర్ అనే కార్యక్రమాన్ని ఎంచుకొని ప్రతీ ఆదివారం డివిజన్‌లోని ఒక కాలనీలో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు, ఐదేళ్లలో చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలను తెలుపుతూ కరపత్రాలు పంపిణీ చేస్తున్నారు. ఆదివారం శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పూజలు నిర్వహించి ప్రచారం ప్రారంభించారు. అభివృద్ధి సంక్షేమ పథకాలను కాలనీవాసులకు వివరించారు. కార్పొరేటర్ రాజశేఖర్ మాట్లాడుతూ ప్రతీ ఆదివారం కాలనీలో పర్యటిస్తూ చేసిన పనులను వివరిస్తూ మంత్రి గంగుల కమలాకర్‌ను రానున్న ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. మొదటి రోజు ప్రజల నుంచి స్పందన వచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో కాలనీవాసులు ఆంజనేయులు, తిరుపతి, దామోదర్, వెంకట్, లక్ష్మణ్, సతీష్, రాజు, అనిల్, సాగర్, నారాయణ, సతీశ్, సుమన్, నరేశ్, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

'అల్ఫోర్స్'లో హౌస్ కెప్టెన్, వైస్ కెప్టెన్‌ల బాధ్యతల స్వీకరణ



కొత్తపల్లి: రేకుర్తిలోని అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెన్‌నెక్ట్స్‌లో హౌస్‌ల కెప్టెన్, వైస్ కెప్టెన్‌ల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం ఆదివారం అట్టహాసంగా జరిగింది. తేజస్, సరస్, ధృవ, లక్ష్య విభాగాలకు బాలబాలికలకు వేర్వేరుగా నిర్వహించిన ఎన్నికల్లో గెలుపొందిన కెప్టెన్, వైస్ కెప్టెన్‌ల బాధ్యత స్వీకరణోత్సవానికి అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రాథమిక దశలోనే విద్యార్థులకు వివిధ బాధ్యతల పట్ల చక్కటి అవగాహన కల్పించడానికి ఏటా ఎన్నికలు నిర్వహించి ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థపై విద్యార్థులకు వివరించేందుకు ఈ ఎన్నికల విధానం దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. విద్యార్థుల్లో నూతన ఉత్తేజాన్ని నింపడంతో పాటు శక్తి సామర్థ్యాలు, నాయకత్వ లక్షణాలు పెంపొందించడానికి దోహదపడుతుందని తెలిపారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు 'పురమల్ల' రాజీనామా



కరీంనగర్: భారత రాష్ట్ర సమితి(బీఆర్ఎస్) పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి బొమ్మకల్ సర్పంచ్ పురమల్ల శ్రీనివాస్ ఆదివారం రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా లేఖను పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావుకు అందజేశారు. పార్టీ పటిష్టత కోసం ఎంతో శ్రమించానని, ప్రజలతో మమేకమై పార్టీ, ప్రభుత్వం చేపట్టే పథకాలను ప్రజలకు అందించానని లేఖలో పేర్కొన్నారు. గతంలో ప్రత్యర్థులు నాపై కుట్రలు చేసి వేధింపులకు గురిచేసి రాజకీయ జీవితం దెబ్బతీసేలా అసత్య ప్రచారాలు చేశారని, అలాంటి పరిస్థితుల్లో తాను కృంగిపోయినప్పుడు పార్టీ నుంచి, పార్టీ పెద్దల నుంచి ఎలాంటి సహాయ సహకారాలు అందలేదని, అయినా పార్టీ ఆదేశానుసారం పార్టీలోనే కొనసాగానని గుర్తు చేశారు. పార్టీలో తనకు ప్రాధాన్యత లేకపోవడం, సహాయసహకారాలు అందించకపోవడం వల్ల పార్టీని వీడాలనే నిర్ణయానికి వచ్చానని, నా రాజీనామా స్వీకరించి ఆమోదించాలని పురమల్ల శ్రీనివాస్ లేఖలో పేర్కొన్నారు.

హైదరాబాద్ సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు



తరలివెళ్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు

కరీంనగర్‌రూరల్: హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన కాంగ్రెస్ సభకు కరీంనగర్ మండలంలోని పలు గ్రామాల నుంచి కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ నియోజకవర్గ టిక్కెట్ రేసులో ఉన్న మెన్నేని రోహిత్‌రావు, కొత్త జైపాల్‌రెడ్డి, బొమ్మకల్ సర్పంచ్ పురుమల్ల శ్రీనివాస్‌లు పోటాపోటీగా కార్యకర్తలను తరలించేందుకు ఏర్పాట్లు చేయడంతో గందరగోళం నెలకొంది. పెద్దసంఖ్యలో జనసమీకరణ చేసి పైచేయి సాధించాలనే ఉద్దేశ్యంతో ఎవరికి వారు చేసిన ప్రయత్నాలతో గ్రామాల్లోని కార్యకర్తలు మూడు వర్గాలుగా విడిపోయారు. ముగ్గురు నాయకులు గ్రామాలకు వాహనాలను పంపించడంతో ఎవరి వాహనంలో ఎక్కాలో తెలియక కార్యకర్తలు అయోమయానికి గురయ్యారు. కొంతసేపటి వరకు వాహనాలను ఎక్కేందుకు ముందుకు రాని కార్యకర్తలు చివరకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాంరెడ్డి సూచనతో గ్రామానికి వచ్చిన వాహనాల్లో అందరు కలిసి బయల్దేరారు. కరీంనగర్ నియోజకవర్గంలో ఉనికి కోల్పోయిన కాంగ్రెస్ పార్టీ కొన్ని నెలల నుంచి టీపీసీసీ అధికార ప్రతినిధి మెన్నేని రోహిత్‌రావు ప్రజా సమస్యలపై చేపట్టిన ఉద్యమాలతో ఊపందుకున్న కాంగ్రెస్‌లో టిక్కెట్ కోసం జరిగే వర్గపోరుతో మరింత నష్టపోయే అవకాశముందని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కార్యదర్శి మరణం బాధాకరం



కరీంనగర్: గంగాధర మండలం కాచిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న రవీందర్ విధులు నిర్వహించి తిరిగి వస్తున్న క్రమంలో చొప్పదండి పెట్రోల్‌బంక్ వద్ద ప్రమాదవశాత్తు టిప్పర్ ఢీకొట్టి మరణించడం బాధాకరమని అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, డీపీవో వీరబుచ్చయ్యలు అన్నారు. ఆదివారం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో రవీందర్ మృతదేహాన్ని సందర్శించి పార్థీవదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ పరంగా వచ్చే బెనిఫిట్స్ అందిస్తామని కుటుంబసభ్యులకు తెలిపారు. జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య అంత్యక్రియల నిమిత్తం రూ.30 వేలు ఇవ్వాలని గంగాధర ఎంపీడీవోకు తెలిపారు.

బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడిగా నరేందర్



నరేందర్

కరీంనగర్‌రూరల్: బీసీ సంక్షేమ సంఘం కరీంనగర్‌రూరల్ మండల అధ్యక్షుడిగా బొమ్మకల్‌కు చెందిన బెల్లం నరేందర్‌ను నియమించినట్లు బీసీ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఆది మల్లేశం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ మండలంలో బీసీ సంక్షేమ సంఘం బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు, ఎంపీ కృష్ణయ్య, ఉపాధ్యక్షుడు గుజ్జ కృష్ణ,రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రం సత్యనారాయణ, జిల్లా కార్యనిర్వహక అధ్యక్షుడు చిగుర్ల శ్రీనివాస్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఆది మల్లేశం, యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఉచిత వైద్యశిబిరం




వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్

విద్యానగర్: నగరంలోని హుస్సేనీపురా గల దక్కన్ హైస్కూల్‌లో ఆదివారం లైఫ్‌లైన్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 560 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. పేదలందరికీ వైద్యసేవలు అందించాలన్నదే తమ అభిమతమని లైఫ్‌లైన్ ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ సీహెచ్.ప్రదీప్‌కుమార్ అన్నారు. మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ, కార్పొరేటర్ అజ్జర్ డబీర్, లైఫ్‌లైన్ ఆస్పత్రి నిర్వాహకులు చిటుమల్ల కొండయ్య, ప్రశాంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


మట్టి గణపతులు పంపిణీ




హమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో..



నారాయణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో..



ఆదరణ సేవా సమితి ఆధ్వర్యంలో..



36వ డివిజన్‌లో..

కరీంనగర్‌కల్చరల్/విద్యానగర్: నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఆదివారం ప్రజాప్రతినిధులు, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మట్టి గణపతులను పంపిణీ చేశారు.

- మారుతీనగర్‌లో హమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మట్టి గణపతిలు పంపిణీ చేశారు. వ్యవస్థాపక అధ్యక్షుడు ధనపురి సాగర్, తోట అనిల్, విక్కీ, క్రాంతి, విగ్నేష్ డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.
- అశోక్‌నగర్ చౌరస్తా వద్ద నారాయణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఫౌండేషన్ అధ్యక్షుడు కనపర్తి ప్రదీప్‌కుమార్, ప్రధాన కార్యదర్శి బజ్జూరి భూమేశ్వర్ పాల్గొన్నారు.
- అశోక్‌నగర్‌లోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్య సేవా సమితి ఆధ్వర్యంలో మట్టి వినాయకులను పంపిణీ చేశారు. సంస్థ బాధ్యులు రాచమల్ల భద్రయ్య, పొల్లెపు శ్రీనివాస్, నారాయణ, కిరణ్, విట్టల్ పాల్గొన్నారు.
- జ్యోతినగర్ వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద ఆదరణ సేవా సమితి ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. సేవా సమితి అధ్యక్షురాలు కర్రె పావని, సభ్యులు మౌనిక, సరోజ, రమ, రేణుక, లాస్య, స్వప్న, సమత, మంజుల, శ్రీనుకుమార్ పాల్గొన్నారు.
- 36వ డివిజన్‌లో కార్పొరేటర్ గుగ్గిళ్ల జయశ్రీ శ్రీనివాస్ మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు.



‘నాకు రాసిపెట్టి ఉంది’

అంతా ఒక కలలా అనిపిస్తోంది. గత కొంతకాలంగా చాలా బాగా బౌలింగ్ చేస్తున్నాను. కానీ వికెట్లు మాత్రం దక్కడంలేదు. లైన్ అండ్ లెంగ్త్‌కు కట్టుబడి బౌలింగ్ చేశా. చివరకు ఇవాళ నేను అనుకున్న ఫలితం వచ్చింది. వన్డేల్లో బంతిని స్వింగ్ చేసేందుకు సాధారణంగా ప్రయత్నిస్తుంటా. టోర్నీ గత మ్యాచ్‌లలో అలాంటిది సాధ్యం కాలేదు. కానీ ఇవాళ మంచి స్వింగ్ లభించింది. అవుట్ స్వింగర్‌ను సమర్థంగా వాడుకోవడం ఆనందంగా అనిపించింది. బ్యాటర్‌లు డ్రైవ్ చేసేందుకు ప్రయత్నిస్తే అవుటయ్యేలా బంతులు వేశా. గతంలో శ్రీలంకతో మ్యాచ్‌లో ఐదు వికెట్ల ప్రదర్శనకు చేరువగా వచ్చినా చివరకు దక్కలేదు. మనకు ఎంత రాసి పెట్టి ఉంటే అంతే దక్కుతుందని నమ్ముతా. ఇవాళ అదృష్టం నా వైపు ఉంది. భారత్‌కు ప్రాతినిధ్యం వహించడంకంటే గర్వించే విషయం మరొకటి ఉండదు. ఇలాంటి ప్రదర్శనలు మరింత ప్రేరణను అందిస్తాయి. కఠోర శ్రమ, సాధన ఫలితమిస్తున్నాయి. నేను ఇంకా సుదీర్ఘ ప్రయాణం చేయాల్సి ఉంది. – సిరాజ్

ఫైర్ సిరాజ్...

ఆసియా కప్ విజేత భారత్

- 6 వికెట్లతో చెలరేగిన భారత పేసర్
- ఒకే ఓవర్లో 4 వికెట్లు
- శ్రీలంక 50 ఆలౌట్
- ఫైనల్లో 10 వికెట్లతో టీమిండియా విజయం





భారత్, శ్రీలంక మధ్య ఆసియా కప్ ఫైనల్... గత రెండు మ్యాచ్‌లలో లంక జట్టు ప్రదర్శన కారణంగా స్థానిక అభిమానులతో స్టేడియం దాదాపుగా నిండిపోయింది... పాక్‌పై గెలుపు, భారత్‌తో పోరాడిన తీరు తుది పోరుపై కూడా అంచనాలు పెంచాయి... మ్యాచ్ హోరాహోరీగా సాగవచ్చని అనిపించింది... వర్షంతో ఆట 40 నిమిషాలు ఆలస్యంగా ప్రారంభమైంది... స్టేడియంలో కాస్త ఆలస్యంగా వచ్చినవారు సీట్లలో కుదురుకునే ప్రయత్నంలో ఉండగా... ఆదివారం వినోదం కోసం మరికొందరు ఇళ్లలో సిద్ధపడుతున్నారు... కానీ మరో గంట ముగిసేసరికి ఖేల్ ఖతం... లంక ఇన్నింగ్స్ ముగిసేందుకు 15.2 ఓవర్లు సరిపోయాయి... ఆపై భారత్ మరో 6.1 ఓవర్లలో ఫటాఫట్ ఛేదన... ఆసియా కప్ ఎనిమిదోసారి భారత్ సొంతం!

ముందుగా మ్యాచ్ మూడో బంతికి వికెట్‌తో బుమ్రా మొదలు పెట్టాడు... ఆ తర్వాత వచ్చిన సిరాజ్ తన మొదటి ఓవర్‌ను మెయిడిన్‌గా వేసి ప్రమాద సూచిక ప్రదర్శించాడు... ఆ తర్వాత అతని రెండో ఓవర్లో అసలు విధ్వంసం జరిగింది. ఒకటి, రెండు కాదు... ఏకంగా నాలుగు వికెట్లు అతని ఖాతాలో... తన మరుసటి ఓవర్లోనూ ఇదే కొనసాగిస్తూ మరో వికెట్... శ్రీలంక స్కోరు 12/6. అయితే అందులో ఐదు వికెట్లు సిరాజ్‌వే... కొంత విరామం తర్వాత మరో వికెట్ కూడా అతని ఖాతాలోనే ... 7 ఓవర్లు వేశాక అదే జోరుతో మళ్లీ బంతిని అందుకునేందుకు సిద్ధమైనా కెప్టెన్ ఇక చాలని వారించాడు... తర్వాతి మూడు వికెట్లతో హార్దిక్ (3/3) ప్రత్యర్థి ఆట ముగించాడు. 50 ఓవర్ల లంక ఇన్నింగ్స్ కాస్తా 50 పరుగుల ఇన్నింగ్స్‌గా మారిపోయింది!

కొలంబో: హైదరాబాదీ పేస్ బౌలర్ మొహమ్మద్ సిరాజ్ తన వన్డే కెరీర్‌లో అత్యుత్తమ ప్రదర్శనతో చెలరేగాడు. టెస్టు క్రికెట్‌ను గుర్తుకు తెచ్చేలా పదునైన స్వింగ్ బౌలింగ్‌తో సత్తా చాటిన అతని ధాటిని తట్టుకోలేక శ్రీలంక బ్యాటింగ్ కుప్పకూలింది. సిరాజ్ అసాధారణ ప్రదర్శనతో అలవోకగా టీమిండియా ఆసియా చాంపియన్‌గా నిలిచింది. సొంతగడ్డపై కనీస ప్రదర్శన కూడా ఇవ్వలేకపోయిన లంక పలు చెత్త రికార్డులు తమ ఖాతాలో వేసుకుంది. ఆదివారం ప్రేమదాస స్టేడియంలో జరిగిన ఫైనల్లో భారత్ 10 వికెట్ల తేడాతో శ్రీలంకపై ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన లంక 15.2 ఓవర్లలో 50 పరుగులకే ఆలౌటైంది. కుశాల్ మెండిస్ (34 బంతుల్లో 17; 3 ఫోర్లు), దుషాన్ హేమంత (15 బంతుల్లో 13 నాటౌట్; 1 ఫోర్) మాత్రమే రెండంకెల స్కోరు చేశారు. ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ సిరాజ్ (6/21) ఆరు వికెట్లతో లంకను దెబ్బకొట్టాడు. అనంతరం భారత్ 6.1 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 51 పరుగులు చేసి గెలిచింది. శుబ్‌మన్ గిల్ (19 బంతుల్లో 27 నాటౌట్; 6 ఫోర్లు), ఇషాన్ కిషన్ (18 బంతుల్లో 23 నాటౌట్; 3 ఫోర్లు) మ్యాచ్ ముగించారు. ఒకదశలో 12/6తో లంక వన్డేల్లో అత్యల్ప స్కోరు (35; జింబాబ్వే) నమోదు చేస్తుందేమో అనిపించినా చివరకు ఆ గండం దాటింది. టోర్నీలో 9 వికెట్లు తీసిన కుల్దీప్ యాదవ్ ‘ప్లేయర్ ఆఫ్ ద సిరీస్’గా నిలిచాడు.

స్కోరు వివరాలు

శ్రీలంక ఇన్నింగ్స్: నిసాంక (సి) జడేజా (బి) సిరాజ్ 2; కుశాల్ పెరీరా (సి) రాహుల్ (బి) బుమ్రా 0; కుశాల్ మెండిస్ (బి) సిరాజ్ 17; సమరవిక్రమ (ఎల్బీ) (బి) సిరాజ్ 0; అసలంక (సి) ఇషాన్ కిషన్ (బి) సిరాజ్ 0; ధనంజయ డిసిల్వా (సి) రాహుల్ (బి) సిరాజ్ 4; షనక (బి) సిరాజ్ 0; వెలలాగె (సి) రాహుల్ (బి) హార్దిక్ పాండ్యా 8; దుషాన్ హేమంత (నాటౌట్) 13; మదుషన్ (సి) కోహ్లి (బి) హార్దిక్ పాండ్యా 1; పతిరణ (సి) ఇషాన్ కిషన్ (బి) హార్దిక్ పాండ్యా 0; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం** (15.2 ఓవర్లలో ఆలౌట్) 50. **వికెట్ల పతనం:** 1–1, 2–8, 3–8, 4–8, 5–12, 6–12, 7–33, 8–40, 9–50, 10–50. **బౌలింగ్:** బుమ్రా 5–1–23–1, సిరాజ్ 7–1–21–6, హార్దిక్ పాండ్యా 2.2–0–3–3, కుల్దీప్ యాదవ్ 1–0–1–0.

భారత్ ఇన్నింగ్స్: ఇషాన్ కిషన్ (నాటౌట్) 23; గిల్ (నాటౌట్) 27; ఎక్స్‌ట్రాలు 1; **మొత్తం** (6.1 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా) 51. **బౌలింగ్:** మదుషన్ 2–0–21–0, పతిరణ 2–0–21–0, వెలలాగె 2–0–7–0, అసలంక 0.1–0–1–0.

ఆ ఆరు వికెట్లు...

సిరాజ్ రెండో ఓవర్...

తొలి బంతి: పాయింట్ దిశగా నిసాంక డ్రైవ్... జడేజా అద్భుత క్యాచ్.
మూడో బంతి: అవుట్ స్వింగర్‌కు సమరవిక్రమ ఎల్బీడబ్ల్యూ.
నాలుగో బంతి: కవర్ పాయింట్ దిశగా ఆడిన అసలంక... కిషన్ క్యాచ్.
ఆరో బంతి: అవుట్ స్వింగర్‌ను ఆడలేక కీపర్ రాహుల్‌కు ధనంజయ క్యాచ్.

సిరాజ్ మూడో ఓవర్...

నాలుగో బంతి: అవుట్ స్వింగర్...షనక క్లీన్‌బౌల్డ్.

సిరాజ్ ఆరో ఓవర్...

రెండో బంతి: అవుట్ స్వింగర్... డ్రైవ్ చేయబోయి మెండిస్ క్లీన్‌బౌల్డ్.

గ్రౌండ్స్‌మెన్‌కు సిరాజ్ గిఫ్ట్

ఫైనల్లో అద్భుత బౌలింగ్ ప్రదర్శనతో చెలరేగిన సిరాజ్ తన పెద్ద మనసును చాటుకున్నాడు. టోర్నీలో ప్రతికూల పరిస్థితుల్లోనూ ఎంతో శ్రమకోర్చి పిచ్‌లు సిద్ధం చేసిన ప్రేమదాస స్టేడియం గ్రౌండ్స్‌మెన్‌ను తన తరఫున కానుకను ప్రకటించాడు. ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’గా తనకు వచ్చిన 5 వేల డాలర్ల చెక్‌ను (సుమారు 16 లక్షల శ్రీలంక రూపాయలు) వారికి అందించాడు. మరోవైపు ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) కూడా కాండీ, కొలంబో గ్రౌండ్స్‌మెన్‌కు ప్రత్యేక బహుమతిని ప్రకటించింది. 50 వేల డాలర్లు (సుమారు 1 కోటి 60 లక్షల శ్రీలంక రూపాయలు) వారికి ఇస్తున్నట్లు ఏసీసీ అధ్యక్షుడు జై షా వెల్లడించారు.

ఇంతింతై...వటుడింతై...

శ్రీలంక ఇన్నింగ్స్ నాలుగో ఓవర్.... సిరాజ్ వేసిన ఐదో బంతిని ధనంజయ మిడాన్ వైపు ఆడాడు. జోరు మీదున్న సిరాజ్ బంతిని ఆపేందుకు తానే స్వయంగా బౌండరీ వరకు పరుగెత్తాడు. అప్పటికే ఆ ఓవర్లో మూడు వికెట్లు తీసిన సిరాజ్‌కు అంత అవసరం లేదు. కోహ్లికి కూడా అలాగే అనిపించి గిల్‌తో పాటు అతనూ చిరునవ్వులు చిందించాడు. కానీ సిరాజ్ అంకిత భావం ఎలాంటిదో అది చూపించింది. ఒక్కసారిగా మైదానంలోకి దిగితే చాలు వంద శాతం అతను జోష్‌లో కనిపిస్తాడు. ఒక్క క్షణం కూడా ఉదాసీనత కనిపించదు. సిరాజ్ వన్డేల్లో ఇప్పుడు కీలక బౌలర్‌గా ఎదగడమే అనూహ్యం. టెస్టుల్లో తనను తాను నిరూపించుకొని రెగ్యులర్‌గా మారినా ఎంతో మంది పేసర్లు అందుబాటులో ఉన్న వన్డేల్లో అతనికి సులువుగా చోటు దక్కలేదు. 2019లో తొలి వన్డే ఆడి అతను జట్టులో స్థానం కోల్పోయాడు. టెస్టు ప్రదర్శనలు, ఐపీఎల్‌లో చక్కటి బౌలింగ్ కూడా అతనికి వన్డేల్లో చోటు కల్పించలేకపోయాయి. అయిదే దాదాపు ఏడాదిన్నర క్రితం సిరాజ్ కెరీర్‌లో కీలక మలుపు. వేర్వేరు సిరీస్‌లకు బుమ్రా, షమీలాంటి సీనియర్లు తరచుగా విశ్రాంతి తీసుకుంటుండటంతో అతనికి మళ్లీ అవకాశం దక్కింది. దీనిని అతను అన్ని విధాలా అందిపుచ్చుకున్నాడు. మూడేళ్ల విరామం తర్వాత సిరాజ్ మళ్లీ వన్డే ఆడాడు. అంతే... అప్పటి నుంచి అతని ప్రదర్శన ప్రతీ మ్యాచ్‌కు మెరుగవుతూ వచ్చింది. ఏదో ద్వితీయ శ్రేణి జట్టులోకి ఎంపిక చేశాం... సీనియర్లు వస్తే మళ్లీ వెనక్కే అన్నట్లుగా కాకుండా తనను మరోసారి పక్కన పెట్టలేని విధంగా రాణించాడు. ఫిబ్రవరి 2022 నుంచి ఆడిన 28 వన్డేల్లో 4 మ్యాచ్‌లు మినహా ప్రతీసారి వికెట్లు పడగొట్టాడు. అలాగనీ పరుగులు ధారాళంగా ఇవ్వలేదు. ఎకానమీ 5 పరుగులు కూడా దాటలేదు. వికెట్లు దక్కకపోయినా ఎన్నోసార్లు బ్యాటర్‌ను ఇబ్బంది పెట్టి, మెయిడిన్లతో ఒత్తిడి పెంచి మ్యాచ్‌పై సిరాజ్ చూపించిన ప్రభావం అమూల్యం. ఇప్పుడు షమీని దాటి బుమ్రా తర్వాత రెండో ప్రధాన పేసర్‌గా మారాడు. ‘సిరాజ్ అరుదైన ప్రతిభావంతుడు’ అంటూ పదే పదే రోహిత్ ప్రశంసించడం టీమ్‌లో అతనేమిటో చూపించింది. సిరాజ్ పునరాగమనానికి ముందు ఏడాది కాలంలో కొత్త బంతితో భారత బౌలర్లు పేలవంగా బౌలింగ్ చేశారు. తొలి పది ఓవర్లలో అత్యంత చెత్త ప్రదర్శన (23 వన్డేల్లో 132.10 సగటు) నమోదు చేసిన టీమ్‌గా ఇండియా నిలిచింది. సిరాజ్ వచ్చాక అంతా మారిపోయింది. ఆరంభ ఓవర్లలోనే వికెట్లు తీసి అతను ఇస్తున్న శుభారంభాలు జట్టు విజయానికి బాటలు వేశాయి. కెరీర్ ఆరంభంలో సహజమైన ఇన్‌స్వింగ్ బౌలర్‌గా అడుగు పెట్టిన అతను ఆ తర్వాత అవుట్ స్వింగర్లు వేయడంలో రాటుదేలాడు. ఇప్పుడు అతని అమ్ములపొదిలో అరుదైన ‘వాబుల్ సీమ్’ అనే ఆయుధం కూడా ఉంది. జనవరి 25న తొలిసారి ఐసీసీ వరల్డ్ నంబర్‌వన్‌గా నిలిచిన సిరాజ్ అప్పటి నుంచి చెలరేగుతూనే ఉన్నాడు. 29 వన్డేలు పెద్ద సంఖ్య కాకపోవచ్చు గానీ ఎలా చూసినా వన్డేల్లో 19.11 సగటు అసాధారణం. సరిగ్గా వరల్డ్ కప్‌కు ముందు సిరాజ్ సూపర్ ఫామ్ జట్టుకు ఆనందాన్నిచ్చే విషయం. ఇదే జోరు కొనసాగిస్తే ఈ హైదరాబాదీ పేసర్ మెగా టోర్నీలోనూ స్టార్‌గా నిలవడం ఖాయం.

–సాక్షి క్రీడా విభాగం

4 వన్డేల్లో ఒకే ఓవర్‌లో నాలుగు వికెట్లు తీసిన నాలుగో బౌలర్ సిరాజ్. గతంలో చమిందా వాస్ (శ్రీలంక: 2003లో బంగ్లాదేశ్‌పై), మొహమ్మద్ సమీ (పాకిస్తాన్: 2003లో న్యూజిలాండ్‌పై), ఆదిల్ రషీద్ (ఇంగ్లండ్: 2019లో వెస్టిండీస్‌పై) ఈ ఫీట్ నమోదు చేశారు.

6/21 వన్డేల్లో భారత్ తరఫున ఇది నాలుగో అత్యుత్తమ ప్రదర్శన. స్టువర్ట్ బిన్నీ (6/4), కుంబ్లే (6/12), బుమ్రా (6/19) సిరాజ్‌కంటే ముందున్నారు.

263 మిగిలి ఉన్న బంతుల పరంగా (43.5 ఓవర్లు) భారత్‌కు ఇదే అతి పెద్ద విజయం.

16 మ్యాచ్‌లో తొలి 5 వికెట్లు తీసేందుకు సిరాజ్‌కు పట్టిన బంతులు. గతంలో చమిందా వాస్, అలీఖాన్ (అమెరికా) కూడా ఇదే తరహాలో 16 బంతులు తీసుకున్నారు.

129 రెండు ఇన్నింగ్స్‌లు కలిపి ఈ మ్యాచ్ 129 బంతుల్లోనే (21.3 ఓవర్లు) ముగిసింది. తక్కువ బంతుల్లో ముగిసిన మ్యాచ్‌ల జాబితాలో ఇది మూడో స్థానంలో నిలిచింది.

బోపన్న... విజయంతో వీడ్కోలు

- డేవిస్ కప్ కెరీర్ ముగించిన భారత టెన్నిస్ స్టార్
- మొరాకోపై 4–1తో నెగ్గిన టీమిండియా
- వరల్డ్ గ్రూప్–1 ప్లే ఆఫ్ దశకు అర్హత



లక్నో: భారత డబుల్స్ టెన్నిస్ స్టార్ రోహన్ బోపన్న తన డేవిస్ కప్ కెరీర్‌ను విజయంతో ముగించాడు. మొరాకోతో ఆదివారం ముగిసిన వరల్డ్ గ్రూప్–2 పోటీలో భాగంగా జరిగిన డబుల్స్ మ్యాచ్‌లో బోపన్న–యూకీ బాంబ్రీ (భారత్) ద్వయం 6–2, 6–1తో బెన్‌చెట్రిట్–యూనెస్ లారూసి జంటపై గెలిచింది. 2002లో డేవిస్ కప్‌లో అరంగేట్రం చేసిన 43 ఏళ్ల బోపన్న భారత్ తరఫున మొత్తం 50 మ్యాచ్‌లు ఆడాడు. డబుల్స్‌లో 13 మ్యాచ్‌ల్లో నెగ్గి, 10 మ్యాచ్‌ల్లో ఓడిపోయాడు. సింగిల్స్‌లో 10 మ్యాచ్‌ల్లో గెలిచి, 17 మ్యాచ్‌ల్లో ఓటమి చవిచూశాడు. డేవిస్ కప్ నుంచి రిటైరయినప్పటికీ ప్రొఫెషనల్ సర్క్యూట్‌లో బోపన్న టెన్నిస్ కెరీర్‌ను కొనసాగిస్తాడు. డబుల్స్ మ్యాచ్ తర్వాత జరిగిన సింగిల్స్‌లో సుమిత్ నగాల్ 6–3, 6–3తో యాసిన్ దిల్మీపై నెగ్గడంతో భారత్ 3–1తో విజయాన్ని ఖరారు చేసుకుంది. నామమాత్రమైన ఐదో మ్యాచ్‌లో దిగ్విజయ్ ప్రతాప్ సింగ్ 6–1, 5–7, 10–6తో వాలిద్‌ను ఓడించడంతో భారత్ 4–1తో విజయాన్ని దక్కించుకుంది. ఈ గెలుపుతో భారత జట్టు మళ్లీ వరల్డ్ గ్రూప్–1 ప్లే ఆఫ్ దశకు అర్హత సాధించింది.

సింగపూర్ గ్రాండ్‌ప్రి విజేత కార్లోస్ సెయింజ్

వెర్‌స్టాపెన్, రెడ్‌బుల్ జైత్రయాత్రకు బ్రేక్


కార్లోస్ సెయింజ్

సింగపూర్: ఫార్ములావన్ 2023 సీజన్‌లో ఎట్టకేలకు 15వ రేసులో రెడ్‌బుల్ జట్టు డ్రైవర్లు కాకుండా మరో జట్టుకు చెందిన డ్రైవర్ విజేతగా నిలిచాడు. ఆదివారం జరిగిన సింగపూర్ గ్రాండ్‌ప్రిలో ఫెరారీ జట్టు డ్రైవర్ కార్లోస్ సెయింజ్ చాంపియన్ అయ్యాడు. నిర్ణీత 62 ల్యాప్‌ల ఈ రేసును ‘పోల్ పొజిషన్’తో ప్రారంభించిన సెయింజ్ అందరికంటే వేగంగా గంటా 46 నిమిషాల 37.418 సెకన్లలో ముగించి అగ్రస్థానాన్ని సంపాదించాడు. 22 రేసుల ఈ సీజన్‌లో తొలి 14 రేసుల్లో రెడ్‌బుల్ డ్రైవర్లు వెర్‌స్టాపెన్ (12), సెర్జియో పెరెజ్ (2) విజేతగా నిలిచారు. అయితే సింగపూర్ గ్రాండ్‌ప్రిలో వీరిద్దరికి నిరాశ ఎదురైంది. వెర్‌స్టాపెన్ ఐదో స్థానంతో, పెరెజ్ ఎనిమిదో స్థానంతో సరిపెట్టుకున్నారు. లాండో నోరిస్ (మెక్‌లారెన్) రెండో స్థానంలో, లూయిస్ హామిల్టన్ (మెర్సిడెస్) మూడో స్థానంలో నిలిచారు. సీజన్‌లోని తదుపరి రేసు జపాన్ గ్రాండ్‌ప్రి ఈనెల 24న జరుగుతుంది.

ఇలవేనిల్ ‘పసిడి’ గురి




రియో డి జనీరో: ప్రపంచకప్ షూటింగ్ టోర్నీలో భారత్ ఖాతాలో తొలి స్వర్ణ పతకం చేరింది. మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో భారత షూటర్ ఇలవేనిల్ వలారివన్ విజేతగా నిలిచి బంగారు పతకాన్ని సాధించింది. ఎనిమిది మంది షూటర్ల మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన ఫైనల్లో తమిళనాడుకు చెందిన 24 ఏళ్ల ఇలవేనిల్ 252.2 పాయింట్లు స్కోరు చేసి అగ్రస్థానంలో నిలిచింది. క్వాలిఫయింగ్‌లో ఇలవేనిల్ 630.5 పాయింట్లు స్కోరు చేసి ఎనిమిదో స్థానంలో నిలిచి ఫైనల్‌కు అర్హత సాధించింది. ఓవరాల్‌గా ప్రపంచకప్ టోర్నీలలో ఇలవేనిల్‌కిది ఐదో స్వర్ణ పతకం. పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగంలో భారత షూటర్ సందీప్ సింగ్ 628.2 పాయింట్లు సాధించి 14వ స్థానంలో నిలిచి ఫైనల్‌కు అర్హత పొందలేకపోయాడు.

నీరజ్ చోప్రాకు రెండో స్థానం



యుజీన్ (అమెరికా): ప్రతిష్టాత్మక డైమండ్ లీగ్ అథ్లెటిక్స్ మీట్ గ్రాండ్ ఫైనల్స్‌లో భారత జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా తన టైటిల్‌ను నిలబెట్టుకోలేకపోయాడు. ఆరుగురు పాల్గొన్న ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన నీరజ్ చోప్రా జావెలిన్‌ను 83.80 మీటర్ల దూరం విసిరి రెండో స్థానంలో నిలిచాడు. చెక్ రిపబ్లిక్‌కు చెందిన జాకుబ్ వాద్లెచ్ జావెలిన్‌ను 84.24 మీటర్ల దూరం విసిరి చాంపియన్‌గా అవతరించాడు. గత నెలలో ప్రపంచ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం సాధించిన నీరజ్ డైమండ్ లీగ్ ఫైనల్స్‌లో స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోయాడు. తొలి ప్రయత్నంలో ఫౌల్ చేసిన నీరజ్ రెండో ప్రయత్నంలో జావెలిన్‌ను 83.80 మీటర్ల దూరం పంపించాడు. మూడో ప్రయత్నంలో 81.37 మీటర్లు దూరం విసిరిన నీరజ్ నాలుగో ప్రయత్నంలో ఫౌల్ చేశాడు. ఆ తర్వాత ఐదో ప్రయత్నంలో 80.74 మీటర్లు, చివరిదైన ఆరో ప్రయత్నంలో 80.90 మీటర్లు విసిరాడు. రెండో స్థానంలో నిలిచిన నీరజ్‌కు 12,000 డాలర్లు (రూ. 9 లక్షల 97 వేలు) ప్రైజ్‌మనీ లభించింది.

కాంస్య పతక బౌట్‌లో అభిమన్యు ఓటమి



బెల్‌గ్రేడ్: ప్రపంచ సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు కాంస్య పతకం చేజారింది. ఆదివారం జరిగిన పురుషుల ఫ్రీస్టయిల్ 70 కేజీల కాంస్య పతక బౌట్‌లో భారత రెజ్లర్ అభిమన్యు 1–12తో అర్మాన్ అంద్రెసియాన్ (అర్మేనియా) చేతిలో ఓడిపోయాడు. క్వార్టర్ ఫైనల్లో అభిమన్యును ఓడించిన అమెరికా రెజ్లర్ అలెన్ రూథర్‌ఫర్డ్ ఫైనల్‌కు చేరుకోవడంతో భారత రెజ్లర్‌కు ‘రెపిచాజ్’ పద్ధతిలో పతకం కోసం మరో అవకాశం దక్కింది. ‘రెపిచాజ్’ తొలి బౌట్‌లో అభిమన్యు 3–1తో ముస్తఫో అఖ్‌మెదోవ్ (తజికిస్తాన్)పై గెలిచి కాంస్య పతక మ్యాచ్‌కు అర్హత సాధించాడు. ఆదివారం జరిగిన బౌట్‌లలో భారత రెజ్లర్లు పృథ్వీరాజ్ (92 కేజీలు) క్వార్టర్ ఫైనల్లో... సచిన్ మోర్ (79 కేజీలు) రెండో రౌండ్‌లో... అమన్ సెహ్రావత్ (57 కేజీలు) రెండో రౌండ్‌లో... నవీన్ (74 కేజీలు) రెండో రౌండ్‌లో ఓడిపోయారు.

దక్షిణాఫ్రికాదే సిరీస్


జాన్సెన్ (5/39)

జొహన్నెస్‌బర్గ్: ఆస్ట్రేలియాతో ఐదు వన్డేల సిరీస్‌ను తెంబా బవుమా నాయకత్వంలోని దక్షిణాఫ్రికా జట్టు 3–2తో సొంతం చేసుకుంది. సిరీస్‌లో తొలి రెండు మ్యాచ్‌ల్లో ఓడిన సఫారీ జట్టు... ఆ తర్వాత అనూహ్యంగా పుంజుకొని వరుసగా మూడు మ్యాచ్‌ల్లో గెలిచి సిరీస్‌ను కైవసం చేసుకోవడం విశేషం. ఆదివారం జరిగిన చివరి వన్డేలో దక్షిణాఫ్రికా 122 పరుగుల తేడాతో ఆస్ట్రేలియాను ఓడించింది. ముందుగా దక్షిణాఫ్రికా 50 ఓవర్లలో 8 వికెట్లకు 315 పరుగులు చేసింది. మార్క్‌రమ్ (93; 9 ఫోర్లు, 3 సిక్స్‌లు), మిల్లర్ (63; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు), ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ మార్కో జాన్సెన్ (23 బంతుల్లో 47; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు), ఫెలుక్వాయో (19 బంతుల్లో 38 నాటౌట్; 2 ఫోర్లు, 4 సిక్స్‌లు) రాణించారు. అనంతరం ఆస్ట్రేలియా 34.1 ఓవర్లలో 193 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది. కెప్టెన్ మిచెల్ మార్ష్ (56 బంతుల్లో 71; 6 ఫోర్లు, 6 సిక్స్‌లు) మినహా మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. దక్షిణాఫ్రికా బౌలర్లు మార్కో జాన్సెన్ (5/39), కేశవ్ మహరాజ్ (4/33) ఆసీస్‌ను దెబ్బ తీశారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
320	89
67,839	20,192

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం ముగింపు)

నాస్‌డాక్	13,708	▽ 218
డోజోన్స్	34,618	▽ 278
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,711	△ 38
డాక్స్	15,894	△ 88
షాంఘై	3,118	▽ 9
నికాయ్	33,582	▽ 370

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	82.29	83.96
£	బ్రిటన్ పౌండ్	101.57	104.93
€	యూరో	86.97	90.07
¥	జపాన్ ఎన్ (100)	52.66	57.25
AUS	ఆస్ట్రేలియా డాలర్	52.10	54.96
S$	సింగపూర్ డాలర్	60.06	62.00
SAR	సౌదీ రియాల్	21.23	22.85
UAE D	యూఏఈ దిర్హామ్	21.75	23.54
¥	చైనా యువాన్	10.31	12.38

మదుపులోనూ తగ్గేదేలే!



- మహిళలకు సొంతంగా పెట్టుబడుల ప్రణాళికలు
- లక్ష్యాలకు అనుగుణంగా తగిన సాధనాల ఎంపిక
- ఇందుకు కొంత నైపుణ్యాలు అవసరం
- అవసరమైతే నిపుణుల సాయం
- జీవిత, ఆరోగ్య బీమా తప్పనిసరి

పురుషులతో సమానత్వం కోసం మహిళలు దశాబ్దాలుగా పోరాడాల్సి వచ్చింది. సుదీర్ఘకాలం పోరాటం ఫలితంగా.. నేడు మహిళలకు సముచిత స్థానం ఏర్పడింది. ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలను పురుషులతో సమానంగా మహిళలూ సొంతం చేసుకుంటున్నారు. స్త్రీలు కేవలం చదువుతోనే ఆగిపోవడం లేదు. కెరీర్ కొనసాగిస్తూ, ఎన్నో విజయాలను నమోదు చేస్తున్నారు. ఉన్నత శిఖరాల దిశగా దూసుకుపోతున్నారు. మహిళలు సొంత కాళ్లపై నిలబడుతూ, మంచి ఆదాయాన్ని ఆర్జిస్తున్న తరుణంలో, తమ సంపదను పెంచుకునేందుకు వారికంటూ ప్రత్యేకమైన పెట్టుబడుల విధానాలు, ప్రణాళికలు అవసరం అవుతాయి. పరిశీలించి చూస్తే ఆర్జించే మహిళల్లో అధిక శాతం మంది పెట్టుబడులు, ఆర్థిక విషయాలకు దూరంగా ఉంటున్న పరిస్థితి కనిపిస్తుంది. పొదుపు, మదుపు గురించి అంతగా తెలియదనే ధోరణి వారిలో కనిపిస్తుంది. కానీ, ఇది సరికాదు. ప్రతి ఒక్క మహిళ తప్పకుండా ఆర్థిక విషయాలు, పెట్టుబడులు, వివిధ సాధనాల గురించి తెలుసుకోవాలి. జీవిత భాగస్వాములపై ఆధారపడక్కర్లేకుండా తమ సంపదను తామే నిర్వహించుకునే సామర్థ్యాలు అవసరం. ఈ దిశగా ఏం చేయాలన్నది చర్చించే కథనమే ఇది.

మహిళలే ఎందుకు?

మన దేశంలో చాలా మంది మహిళలు తమ పెట్టుబడుల వ్యవహారాలను భర్త లేదా తండ్రికే విడిచిపెడుతుంటారు. దీంతో వారికి పెట్టుబడుల వ్యవహారాల గురించి తెలియకుండా పోతుంది. కానీ, ఇది సరికాదు. సంపాదన ఒకరిది అయినప్పుడు, నిర్వహణ బాధ్యతలు మరొకరిపై మోపడం ఎందుకు..? ఇల్లాలిగానే కాదు, ఒంటరిగానూ మహిళలు ఆర్థిక సవాళ్లను ఎదుర్కోవాల్సిన పరిస్థితులు రావచ్చు. తమ జీవిత లక్ష్యాల సాధన కోసం ఇన్వెస్ట్ చేయడం తప్పనిసరి. సంపాదనను సంపదగా మలిచేందుకు అనుసరించాల్సిన మార్గాలపై మహిళలకు తప్పకుండా అవగాహన ఉండాల్సిందే. కారు కొనుక్కోవాలని, ఆభరణాలు కొనుగోలు చేయాలని, మంచి ట్రిప్లెక్స్ విల్లా సమకూర్చుకోవాలని, సెలవుల్లో ఎక్కడికైనా పర్యటించి రావాలనే కోరికలు, లక్ష్యాలు చాలా మందికి ఉంటాయి. వాటిని నెరవేర్చుకోవడానికి అవసరమైన అడుగులు పెట్టుబడుల రూపంలో వేయాలి. ఆర్థిక, పెట్టుబడుల వ్యవహారాలు నిర్వహించేందుకు మహిళలు ఆర్జనా పరులే కానక్కర్లేదు. గృహలక్ష్మి అయినా సరే ఈ విషయాలు తెలిసి ఉండడం వల్ల ఎంతో లాభం ఉంటుంది. కుటుంబ లక్ష్యాల కోసం మార్కెట్లో పెట్టుబడుల వ్యవహారాలు నిర్వహించడం ఎలాగో తెలుసుకోవాలి. మహిళలు తమ పిల్లల కోసం, కుటుంబ బాధ్యతల కోసం లేదంటే తల్లిదండ్రుల కోసం కెరీర్ మధ్యలో పలు సందర్భాల్లో విరామం తీసుకుంటుంటారు. తమ జీవిత భాగస్వాములతో పోలిస్తే అధిక కాలం జీవించే అవకాశాలు ఉంటాయి. కనుక మహిళలకు తప్పకుండా పెట్టుబడుల వ్యవహారాలు తెలిసి ఉండాలి.



పెట్టుబడుల ద్వారా సంపదను సృష్టించుకోవడం అన్నది నైపుణ్యాలపై ఆధారపడి ఉంటుంది. మొదటగా అసలు అందుబాటులో ఉన్న సాధనాలు ఏంటి? అనేది తెలుసుకోవాలి. తర్వాత వాటిల్లో ఏది తమకు అనుకూలమన్నది తేల్చుకోవాలి. పెట్టుబడుల్లో దేనికీ గ్యారంటీ ఉండదు. వివిధ సాధనాల గురించి లోతుగా తెలుసుకోవడం వల్ల మెరుగైన నిర్ణయాలకు వీలుంటుంది. పెట్టుబడుల అవకాశాలు, ప్రస్తుత మార్కెట్ ధోరణుల గురించి ఆన్‌లైన్‌లో సమాచారాన్ని అందించే

నైపుణ్యాలు అవసరం..

పోర్టళ్లు ఎన్నో ఉన్నాయి. వాటి నుంచి కావాల్సిన సమాచారం తీసుకోవచ్చు. అవసరమైతే నిపుణుల సూచనలు తీసుకోవాలి. పెట్టుబడుల ఆరంభించే ముందు నెలవారీ నగదు ప్రవాహాలను ఒకసారి చెక్ చేసుకోవాలి. వస్తున్న ఆదాయం, పెడుతున్న ఖర్చులపై స్పష్టత ఉండాలి. నెలవారీ వేతనం, అద్దె ఆదాయం, ఇతర రూపాల్లో వచ్చేదంతా ఆదాయం కిందకే వస్తుంది. ఖర్చుల్లో తప్పనిసరి, తప్పనిసరి కాదు అని రెండు భాగాలు చేసుకోవాలి. విచక్షణారహితం కానివి అంటే.. ఇంటికి చెల్లించే అద్దె, గృహ రుణ చెల్లింపులు, పిల్లల స్కూల్ ఫీజులు, గ్రోసరీ, యుటిలిటీ కోసం చేసే ఖర్చు తదితరాలు. విచక్షణారహితం అంటే విలాసం, వినోదం కోసం చేసే ఖర్చులు. వీటి ఆధారంగా నెలవారీ ఎంత పొదుపు చేయాలి, ఎక్కడ ఖర్చులను తగ్గించుకోవాలనే దానిపై స్పష్టత వస్తుంది. దీంతో నెలవారీ బడ్జెట్‌ను రూపొందించుకోవచ్చు.

లక్ష్యాలపై స్పష్టత..

పెట్టుబడికి లక్ష్యాలు తోడు కావాలి. అప్పుడే స్పష్టమైన మార్గం తెలుస్తుంది. వచ్చే ఏడాది కాలానికి ఎలాంటి లక్ష్యాలు ఉన్నాయి. అలాగే, ఐదేళ్లు, పదేళ్లు? ఇలా ప్రశ్నించుకోవాలి. వచ్చే ఏడాది విదేశీ పర్యటనకు వెళ్లొచ్చు. లేదంటే 5–10 ఏళ్లలో సొంతిల్లు సమకూర్చుకోవచ్చు. లేదంటే 20–30 ఏళ్లకు వచ్చే రిటైర్మెంట్ తర్వాతి జీవితానికి నిధిని సమకూర్చుకోవడం కావచ్చు. ఇలా లక్ష్యాలన్నింటినీ నిర్ణయించుకున్న తర్వాత.. విడిగా ఒక్కో దానికి ఉన్న సమయం, ఎంత మొత్తం కావాలి, అందుకు నెలవారీగా ఎంత ఇన్వెస్ట్ చేయాలి, అందుకు అనుకూలించే పెట్టుబడి సాధనాలపై స్పష్టత తెచ్చుకోవాలి.

అత్యవసర నిధి

అన్నింటికంటే ముందు అత్యవసర నిధిని సమకూర్చుకోవాలి. ఏ కారణం వల్ల అయినా ఉన్నట్టుండి ఉద్యోగం కోల్పోవచ్చు. లేదా మానేయాల్సిన పరిస్థితి ఏర్పడొచ్చు. ప్రమాదం కారణంగా ఉద్యోగానికి తాత్కాలికంగా వెళ్లలేకపోవచ్చు. ఇలాంటి ఊహించని ఖర్చులను ఎదుర్కోవాలంటే అందుకు ఉన్న ఏకైక మార్గం అత్యవసర నిధి. అత్యవసర నిధి అనేది ఎప్పుడైనా వినియోగించుకోవడానికి అందుబాటులో ఉండే సాధనం. దీనివల్ల కష్ట కాలంలో రుణాలను ఆశ్రయించకుండా దీని సాయంతో గట్టెక్కవచ్చు. సాధారణంగా అత్యవసర నిధి మూడు నుంచి ఆరు నెలల అవసరాలను తీర్చే స్థాయిలో ఉండాలి. దీన్ని సమకూర్చుకునేందుకు ప్రతి నెలా కొంత చొప్పున ఇన్వెస్ట్ చేస్తూ వెళ్లాలి. బ్యాంక్ ఖాతా లేదంటే లిక్విడ్ ఫండ్స్‌లో ఈ మొత్తాన్ని ఉంచుకోవచ్చు. ఒకవేళ అత్యవసర నిధి ఏర్పాటుకు సరిపడా నగదు ప్రవాహం లేకపోతే, ఏవైనా అవసరాలను తగ్గించుకుని అయినా ఇన్వెస్ట్ చేయాలి.

బీమా రక్షణ

మహిళలకు జీవిత బీమా పాలసీ అవసరమా? చాలా మందికి ఎదురయ్యే ప్రశ్న ఇది. మహిళలకు కూడా జీవిత బీమా కావాలి. ఎందుకంటే వారు లేని లోటును పూర్తిగా కాకపోయినా, కొంత అయినా అధిగమించేందుకు జీవిత బీమా రక్షణ సాయపడుతుంది. బీమా రక్షణ ఉంటే, దురదృష్టవశాత్తూ ఏదైనా జరిగితే, వారిపై ఆధారపడిన వారు ఇబ్బందుల పాలు కాకుండా ఉంటుంది. జీవిత బీమా అంటే జీవితంపై పెట్టుబడి పెట్టేది. భవిష్యత్తుపై పెట్టుబడి పెట్టేది. చాలా మంది వివాహం అయి, తమకంటూ కుటుంబం ఏర్పాటైన తర్వాతే జీవిత బీమా గురించి ఆలోచిస్తుంటారు. కానీ, ఇది సరైనది కాదు. యుక్త వయసులోనే జీవిత బీమా పాలసీ తీసుకోవాలి. జీవితంలో వివిధ దశల్లో, పెరిగే తమ బాధ్యతలకు అనుగుణంగా బీమా కవరేజీ మొత్తాన్ని సవరించుకుంటూ వెళ్లాలి. ఇది భవిష్యత్తుకు భరోసానిచ్చేదిగా ఉంటుంది. హెల్త్ ఇన్సూరెన్స్ సైతం మహిళలకు ఎంతో ముఖ్యం. పురుషులతో పోలిస్తే మహిళలకు అనారోగ్య సమస్యల రిస్క్ ఎక్కువ. గుండె జబ్బులు, కేన్సర్, స్ట్రోక్ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. అందుకే లైఫ్, హెల్త్ ఇన్సూరెన్స్ తప్పకుండా తీసుకోవాలి.



పోర్ట్‌ఫోలియో నిర్వహణ

మహిళలు పెట్టుబడుల నిర్వహణలో పెద్దగా ఆసక్తి చూపించకపోవడాన్ని గమనించొచ్చు. ఇదంతా గతం నుంచి ఉన్న ధోరణి వల్లేనని చెప్పుకోవచ్చు. పెట్టుబడుల నిర్వహణ ఎలా? అన్న సందేహం ఎదురైతే.. ముందు తమ బలాల గురించి తెలుసుకోవాలి. రిస్క్‌కు దూరంగా సంప్రదాయ ధోరణితో ఉంటే డివిడెండ్ చెల్లించే కంపెనీలు, రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్‌లు, యుటిలిటీ సంస్థలను పరిశీలించొచ్చు. రిస్క్ తీసుకునే వారు లార్జ్, మిడ్, స్మాల్‌క్యాప్ ఫండ్స్‌కు పెట్టుబడులు కేటాయించుకోవచ్చు. అయితే మొత్తం పెట్టుబడులు అన్నింటినీ ఒకే చోట కాకుండా, వివిధ సాధనాల మధ్య వైవిధ్యం చేసుకోవడం తప్పనిసరి. తమ జీవిత లక్ష్యాల సాకారానికి, మెరుగైన విశ్రాంత జీవనానికి.. దీర్ఘకాలంలో సంపద సృష్టించుకునేందుకు మహిళల ముందు ఎన్నో మార్గాలున్నాయి. ఇందుకోసం వెంటనే పెట్టుబడులు ప్రారంభించాలి.



చాలా ముందుగా ఆరంభిస్తే కాంపౌండింగ్ ప్రయోజనంతో సంపద వేగంగా వృద్ధి చెందుతుంది. మహిళలకు సంబంధించి జీవిత లక్ష్యాలకు మ్యూచువల్ ఫండ్స్ మెరుగైన మార్గం అవుతుంది. మ్యూచువల్ ఫండ్స్ ఈక్విటీతోపాటు డెట్, బంగారం తదితర సాధనాల్లో ఇన్వెస్ట్ చేస్తాయి. నిపుణుల నిర్వహణలో, తగినంత వైవిధ్యం, రిస్క్ బ్యాలన్స్‌తో నడిచే మ్యూచువల్ ఫండ్స్ దీర్ఘకాలంలో మెరుగైన రాబడిని ఇవ్వగలవు. ఇప్పటి వరకు ఉన్న గణాంకాలు ఇదే తెలియజేస్తున్నాయి. స్టాక్స్‌లో నేరుగా ఇన్వెస్ట్ చేసేంత విషయ పరిజ్ఞానం, సమయం లేని వారికి మ్యూచువల్ ఫండ్స్ మెరుగైన మార్గం. పరిమిత పెట్టుబడితోనే ఎన్నో రకాల కంపెనీలు, రంగాల్లో ఎక్స్‌పోజర్ లభిస్తుంది. అందులోనూ సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) రూపంలో ఇన్వెస్ట్ చేయడం వల్ల సగటు కొనుగోలు వ్యయం తగ్గి, అధిక రాబడి లభిస్తుంది.

రైట్స్ ఇష్యూపై సిడ్బీ దృష్టి

రూ. 10,000 కోట్ల సమీకరణ

sidbi

ముంబై: ప్రభుత్వ రంగ సంస్థ చిన్న పరిశ్రమల అభివృద్ధి బ్యాంక్(సిడ్బీ) వచ్చే ఆర్థిక సంవత్సరం (2024–25)లో రైట్స్ ఇష్యూ చేపట్టే ప్రణాళికల్లో ఉంది. రూ. 10,000 కోట్ల రైట్స్‌ను జారీ చేయడం ద్వారా ఈక్విటీ మూలధనాన్ని విస్తరించుకునే యోచనలో ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023–24)లో ఆస్తులు(రుణాలు) రూ. 5 లక్షల కోట్లకు చేరవచ్చని అంచనా వేస్తున్న నేపథ్యంలో రైట్స్ ప్రణాళికలకు తెరతీసింది. గతేడాది(2022–23)లో రుణాలు రూ. 4 లక్షల కోట్లను తాకినట్లు బ్యాంక్ చైర్మన్, ఎండీ శివసుబ్రమణ్యన్ రామన్ పేర్కొన్నారు. బ్యాంకులో కేంద్ర ప్రభుత్వ వాటా 20.8 శాతంకాగా.. ఎస్‌బీఐ 15.65 శాతం, ఎల్‌ఐసీ 13.33 శాతం చొప్పున వాటాలను కలిగి ఉన్నాయి. మిగిలిన వాటా ఇతర పీఎస్‌యూ బ్యాంకులు, ఆర్థిక సంస్థల చేతిలో ఉంది. ఇటీవల డైరెక్ట్ ఫైనాన్సింగ్‌కు డిమాండ్ ఊపందుకోవడంతో బ్యాంకు వేగవంత వృద్ధిని అంచనా వేస్తోంది. లోన్ బుక్‌లో డైరెక్ట్ ఫైనాన్స్ వాటా రెండేళ్ల క్రితం కేవలం 7 శాతంగా నమోదుకాగా.. ప్రస్తుతం 14 శాతానికి ఎగసింది. రైట్స్ ఇష్యూని రూ. 5,000 కోట్లు చొప్పున రెండు దశలలో చేపట్టనున్నట్లు రామన్ వెల్లడించారు. విస్తరిస్తున్న బ్యాలెన్స్‌షీట్‌కు మద్దతుగా మూలధనాన్ని రూ. 10,000 కోట్లమేర పటిష్ట పరచనున్నట్లు తెలియజేశారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

16-9-2023	
విశాఖ	525–00
చిత్తూరు	513–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	516–00
విజయవాడ	516–00
రిటైల్ ధర (డజను)	72.00
15-9-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	485–00
వరంగల్	487–00
రిటైల్ ధర	5.45

సాక్షి స్టాక్స్

గల్ఫ్ ఆయిల్ లూబ్రికెంట్స్ | యస్ సెక్యూరిటీస్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 550
టార్గెట్: రూ. 700

ఎందుకంటే: లూబ్రికెంట్స్ తయారీ దిగ్గజం గల్ఫ్ ఆయిల్ లూబ్రికెంట్స్ ఇండియా లిమిటెడ్ ఇటీవల టైరెక్స్ ట్రాన్స్‌మిషన్‌లో మెజారిటీ వాటా కొనుగోలు చేయనున్నట్లు ప్రకటించింది. రూ. 103 కోట్లు వెచ్చించి 51 శాతం వాటాను సొంతం చేసుకోనున్నట్లు వెల్లడించింది. అహ్మదాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు విస్తరించిన టైరెక్స్ ప్రధానంగా డీసీ ఫాస్ట్ చార్జర్లపై దృష్టి పెట్టింది. ప్రభుత్వ రంగ దిగ్గజాలు ఎన్‌టీపీసీ, హెచ్‌పీసీఎల్, పవర్‌గ్రిడ్‌సహా ఎల్రక్ట్రా తదితర కస్టమర్ల కోసం 400 చార్జర్లను ఏర్పాటు చేసింది. ఈవీ చార్జింగ్ విభాగంలో ఇది కంపెనీ చేపట్టిన మూడో కొనుగోలుకాగా.. ఏసీ, బైడైరెక్షనల్ చార్జింగ్ సంస్థ ఇంద్రా రెనెవబుల్స్‌ను సైతం ఇంతక్రితం చేజిక్కించుకున్న సంగతి తెలిసిందే. ఇంద్రా రెనెవబుల్స్ ఎలక్ట్రీఫై పేరుతో సాస్ సంబంధ ఐవోటీ ఆధారిత ఈమొబిలిటీ సొల్యూషన్స్ అభివృద్ధి చేయడంలోనూ నైపుణ్యాలను కలిగి ఉంది.



కాగా.. రానున్న 5–6 ఏళ్లలో దేశీ మార్కెట్ల ద్వారా టైరెక్స్ నుంచి రూ. 500–600 కోట్ల టర్నోవర్‌ను గల్ఫ్ ఆయిల్ అంచనా వేస్తోంది. మరోవైపు బ్యాటరీ బిజినెస్ నుంచి రానున్న ఐదేళ్లలో 20 శాతం వార్షిక ప్రగతిని ఆశిస్తోంది. వెరసి రూ. 200 కోట్ల ఆదాయాన్ని లెక్కకడుతోంది. ఇక కంపెనీకి కీలకమైన లూబ్రికెంట్స్ బిజినెస్‌పై రానున్న మూడేళ్ల కాలంలో ఏడాదికి రూ. 20 కోట్లు చొప్పున పెట్టుబడులు వెచ్చించే ప్రణాళికలు అమలు చేస్తోంది. లూబ్రికెంట్స్ విభాగం వృద్ధిపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరిస్తూనే అదనపు పెట్టుబడి అవకాశాలను అన్వేషిస్తోంది. కంపెనీకిగల నెట్‌వర్క్, బ్రాండ్, భాగస్వామ్యాలు, ఇతర లబ్ధికి వీలున్న అవకాశాలకు ప్రాధాన్యత ఇస్తోంది.

సంవర్ధన మదర్‌సన్ | జేఎం ఫైనాన్షియల్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 98
టార్గెట్: రూ. 130

ఎందుకంటే: ఆటో రంగ విడిభాగాల దిగ్గజం సంవర్ధన మదర్‌సన్ ఇంటర్నేషనల్ గత రెండు దశాబ్దాలలో ఏకంగా 30కుపైగా సంస్థలను కొనుగోలు చేసింది. తద్వారా సింగిల్ ప్రొడక్ట్ కంపెనీ స్థాయి నుంచి పలు ఉత్పత్తులు, ప్రదేశాల నుంచి విక్రయాలు నిర్వహించగల దిగ్గజ గ్రూప్‌గా ఆవిర్భవించింది. ఈ కాలంలో మదర్‌సన్ గ్రూప్ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 30 శాతం జంప్ చేస్తూ వచ్చింది. 14 బిలియన్ డాలర్లకు చేరింది. వెరసి కంపెనీ ఆటో విడిభాగాల సరఫరాకు ప్రపంచస్థాయి ర్యాంకింగ్స్‌లో 2023కల్లా టాప్–15 జాబితాలో చోటు సాధించింది. అంతక్రితం 2005లో టాప్–40 కంపెనీలలో ఒకటిగా నిలిచింది. అయితే త్రైమాసికవారీ ఆర్డర్లు, ఆదాయ వృద్ధివంటి సాధారణ అంశాలనుకాకుండా రానున్న మూడేళ్ల కాలంలో బిజినెస్ పురోగతికి ప్రాధాన్యత ఇస్తూ కంపెనీ విశ్లేషణను చేపట్టడం సబబుగా భావిస్తున్నాం.



ప్రధానంగా ప్రపంచ ఆటో విడిభాగాల విభాగంలో కంపెనీ ప్రధాన పాత్రను పోషించగల సామర్థ్యాలను కలిగి ఉండటమే దీనికి కారణం. సొంతం చేసుకున్న సంస్థలను లాభాల బాట పట్టించడంలో కంపెనీకి బలమైన ట్రాక్ రికార్డ్ ఉంది. ఆటో విడిభాగాల పరిశ్రమలో 2010కల్లా 0.4 శాతంగా నమోదైన కంపెనీ గ్లోబల్ మార్కెట్ వాటా 2023కల్లా 2.5 శాతానికి చేరింది. ప్రపంచ వ్యాప్త కార్యకలాపాలు, పవర్‌ట్రయిన్ అగ్నోస్టిక్ ప్రొడక్టుల పోర్ట్‌ఫోలియో విస్తరణ, విస్తృతస్థాయిలోని కస్టమర్లు వంటి అంశాలు కంపెనీ వృద్ధికి కొన్నేళ్లపాటు సహకారాన్ని అందించే అవకాశముంది. ఈ అంశాలు మూడేళ్ల కాలంలో కంపెనీ 25 శాతం అంతర్గత రిటర్న్ రేటు(ఐఆర్‌ఆర్)ను సాధించగలదని భావిస్తున్నాం.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

'డిఫాల్టర్ల'కు చాక్లెట్ ప్యాకెట్లు

- ఎస్‌బీఐ వినూత్న ఐడియా
- సకాలంలో చెల్లింపులను గుర్తు చేయడమే లక్ష్యం



న్యూఢిల్లీ: సకాలంలో నెలవారీ వాయిదాలను కట్టేసేలా రుణగ్రహీతలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వ రంగ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) వినూత్న పంథా ఎంచుకుంటోంది. ఈఎంఐ కట్టడంలో డిఫాల్ట్ అయ్యే అవకాశం ఉన్న వారికి చాక్లెట్ బాక్సులు పంపి, వాయిదా చెల్లింపుల గురించి గుర్తు చేయడంపై దృష్టి పెడుతోంది. 'రిటైల్ రుణగ్రహీతలకు వారి పేమెంట్స్ గురించి గుర్తు చేసేందుకు కృత్రిమ మేధను ఉపయోగించే రెండు ఫిన్‌టెక్ సంస్థలతో కలిసి వినూత్న విధానాలను ప్రయోగాత్మకంగా పరీక్షిస్తున్నాం. వీటిలో ఒకటి, రుణగ్రహీతలతో రాజీ కుదుర్చుకోవడం కాగా, రెండోది ఒక రుణ గ్రహీత డిఫాల్ట్ అయ్యే అవకాశాలను గుర్తించడం. ఫిన్‌టెక్ సంస్థ ప్రతినిధులు, అలాంటి రుణ గ్రహీతల ఇళ్లకు చాక్లెట్ల ప్యాకెట్‌తో సందర్శిస్తారు. రాబోయే ఈఎంఐల గురించి వారికి గుర్తు చేస్తారు' అని ఎస్‌బీఐ ఎండీ (రిస్క్, కాంప్లయెన్స్, స్ట్రెస్డ్ అసెట్స్) అశ్విని కుమార్ తివారీ తెలిపారు. సాధారణంగా ఈఎంఐని కట్టకూడదనే యోచనలో ఉన్న రుణగ్రహీతలు .. బ్యాంకు నుంచి వచ్చే ఫోన్స్‌కు స్పందించరని ఆయన చెప్పారు. అలాంటప్పుడు చెప్పాపెట్టకుండా వారి ఇంటికి వెళ్లి, ఆశ్చర్యపర్చడమనేది .. వాయిదాల వసూలుకు మంచి మార్గం కాగలదన్నారు. 15 రోజుల క్రితమే ప్రారంభించిన ఈ విధానం ఇప్పటివరకు సత్ఫలితాలే ఇస్తోందని తివారీ వివరించారు. దీన్ని మరో నాలుగైదు నెలలు కొనసాగిస్తామన్నారు. వడ్డీ రేట్లు పెరుగుదలతో రిటైల్ రుణాల విభాగంలో ఎగవేతలు పెరుగుతున్న నేపథ్యంలో ఎస్‌బీఐ ప్రయోగాత్మక విధానం ప్రాధాన్యం సంతరించుకుంది. ఎస్‌బీఐ రిటైల్ రుణాలు (వ్యక్తిగత, ఆటో, గృహ, విద్యా రుణాలు) రూ. 12 లక్షల కోట్ల పైచిలుకు ఉంటాయి.

మనీ మార్కెట్ ఫండ్ ఎవరికి అనుకూలం?

Q & A



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులను వెనక్కి తీసుకున్నప్పుడు ఎగ్జిట్ లోడ్ విధిస్తారు. దీన్ని ఎలా అమలు చేస్తారు? - ఎస్ అశోక్

ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసే ప్రతి ఒక్కరికీ ఎగ్జిట్ లోడ్ గురించి తెలియాలి. ఇన్వెస్ట్ చేసిన తర్వాత నిర్దేశిత కాలంలోపు పెట్టుబడులను వెనక్కి తీసుకున్నప్పుడు అమలు చేసే చార్జీయే ఎగ్జిట్ లోడ్. ఫండ్ నిబంధనల్లో ఇది స్పష్టంగా ఉంటుంది. ఫండ్ రకాన్ని బట్టి ఎగ్జిట్ లోడ్ వేర్వేరుగా ఉంటుంది. ఏకమొత్తంలో (లంప్‌సమ్) పెట్టుబడి లేదా సిప్ రూపంలో ఇన్వెస్ట్ చేసిన పెట్టుబడి వాయిదా నుంచి ఈ తేదీ పరిగణనలోకి వస్తుంది. ఒకవేళ ఎగ్జిట్ లోడ్ చార్జీలను మ్యూచువల్ ఫండ్ సంస్థ మార్చినట్టయితే.. పెట్టుబడి పెట్టిన తేదీ నాటికి ఉన్న ఎగ్జిట్ లోడ్ విధానమే, ఉపసంహరణ సమయంలో అమలవుతుంది. ఉదాహరణకు రూ.లక్షను 2022 నవంబర్ 1న ఒక పథకంలో ఇన్వెస్ట్ చేసినట్టు అనుకుందాం. ఆ సమయంలో ఎగ్జిట్ లోడ్ 365 రోజులకు 1 శాతంగా ఉంది. పెట్టుబడి తేదీ నాటికి పథకం ఎన్‌ఏవీ 20గా ఉంది. దీంతో రూ.లక్ష పెట్టుబడికి 5,000 యూనిట్లు వచ్చాయి. 2023 సెప్టెంబర్ 15న రూ.50వేలను వెనక్కి తీసుకోవాల్సి వచ్చింది. అప్పుడు ఎన్‌ఏవీ 25 ఉందని అనుకుందాం. రూ.50వేల కోసం 2,000 యూనిట్లను విక్రయించాలి. దీంతో ఏడాదిలోపు (365 రోజుల్లోపు) విక్రయించినట్టు అవుతుంది. కనుక ఎగ్జిట్ లోడ్ పడుతుంది. రూ.50,000 ఉపసంహరణ విలువపై ఒక శాతం ఎగ్జిట్ అంటే రూ.500 చెల్లించాలి. కనుక చేతికి రూ.49,500 వస్తాయి. ఒకవేళ ఈ ఉపసంహరణను 2023 నవంబర్ 1 తర్వాత తీసుకుంటే ఎగ్జిట్ లోడ్ పడదు. సిప్ రూపంలో ఒక్కో పెట్టుబడికి విడిగా ఇది అమలవుతుంది. ఉదాహరణకు 2022 నవంబర్ 1న సిప్ రూపంలో ఒక పథకంలో రూ.10,000 ఇన్వెస్ట్ చేశారు. ఎన్‌ఏవీ రూ.20గా ఉంది. దీంతో 500 యూనిట్లు వచ్చాయి. అప్పటికి 1 శాతం ఎగ్జిట్ లోడ్ ఉంది. 2022 డిసెంబర్ 1 నుంచి ఎగ్జిట్ లోడ్ 1.5 శాతానికి పెరిగింది. డిసెంబర్ 1న సిప్ రూపంలో రూ.10,000 ఇన్వెస్ట్ చేశారు. ఆ సమయంలోనూ ఎన్‌ఏవీ రూ.20 దగ్గరే ఉండడంతో మరో 500 యూనిట్లు వచ్చాయి. దీంతో ఉపసంహరణ సమయంలో యూనిట్ల విక్రయంపై ఎగ్జిట్ లోడ్ వేర్వేరుగా అమలవుతుందని గ్రహించాలి.

మనీ మార్కెట్ ఫండ్ అంటే ఏమిటి? ఎవరు ఈ ఫండ్‌లో ఎప్పుడు ఇన్వెస్ట్ చేయవచ్చు? - నాగరాజు

మనీ మార్కెట్ ఫండ్ అన్నది డెట్ మ్యూచువల్ ఫండ్ పథకం. ఏడాది కాలంలో గడువు ముగిసే స్వల్ప కాల డెట్ ఇన్‌స్ట్రుమెంట్లు, ఇతర సాధనాల్లో ఇన్వెస్ట్ చేస్తుంది. ఇవి రిస్క్‌లేని అంచనా వేయతగిన రాబడులను ఇవ్వగలవు. ఎందుకంటే అధిక నాణ్యత కలిగిన సాధనాల్లోనే ఇన్వెస్ట్ చేస్తాయి కనుక రాబడులు స్థిరంగా ఉంటాయి. కనుక మనీ మార్కెట్ మ్యూచువల్ ఫండ్ పథకాలు దాదాపు రిస్క్‌లేని, ఎంతో రక్షణతో కూడినవి. స్వల్పకాలానికి ఫిక్స్‌డ్ డిపాజిట్ల కంటే ఎక్కువ రాబడులను ఇస్తాయి. ఏడాది కాలానికి ఇన్వెస్ట్ చేసుకునే వారు వీటిని పరిశీలించొచ్చు. బ్యాంక్ సేవింగ్స్ ఖాతాలో డిపాజిట్లపై రాబడి కంటే అధిక రాబడిని ఇవ్వగలవు. బ్యాంక్ ఖాతాల్లో ఎక్కువ బ్యాలన్స్ ఉంటే ఈ సాధనాల్లోకి మళ్లించుకోవచ్చు. మొత్తం 16 రకాల డెట్ మ్యూచువల్ ఫండ్స్ ఉండగా, లిక్విడ్ ఫండ్స్, షార్ట్ డ్యురేషన్ ఫండ్స్ అన్నవి రిటైల్ ఇన్వెస్టర్లకు అనుకూలంగా ఉంటాయి. మీ పెట్టుబడుల కాల వ్యవధి ఏడాది అయితే లిక్విడ్ ఫండ్స్ మంచివి. ఇవి తక్కువ రిస్క్ పథకాలు. అత్యవసర నిధికి వీటిని ఉపయోగించుకోవచ్చు. ఏడాదికి మించిన దీర్ఘకాలం కోసం ఇన్వెస్ట్ చేయాలని అనుకుంటే షార్ట్ డ్యురేషన్ ఫండ్‌ను ఎంపిక చేసుకోవచ్చు. ఏడాది నుంచి మూడేళ్ల కాల సాధనాల్లో ఇవి ఇన్వెస్ట్ చేస్తాయి. డెట్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయడంలో ఉన్న ప్రాథమిక లక్ష్యం పెట్టుబడి పరిరక్షణతోపాటు, కొంత రాబడి కోరుకోవడం. ఈ దృష్ట్యా లిక్విడ్ ఫండ్స్, షార్ట్ డ్యురేషన్ ఫండ్స్ సరిపోతాయి.



శివలింగాన్ని తాకిన సూర్యకిరణాలు

ములుగు జిల్లా వెంకటాపురం (ఎం) మండలం పాలంపేటలోని చరిత్రాత్మక రామప్ప దేవాలయంలో ఆదివారం అద్భుతం చోటుచేసుకుంది. ఉదయం 7 గంటలకు శివలింగాన్ని సూర్యకిరణాలు నేరుగా తాకినట్లు అర్చకులు హరీశ్ శర్మ, ఉమాశంకర్ తెలిపారు. స్వామి వారికి అలంకరణ చేస్తున్న సమయంలో సూర్యకిరణాలు శివుడిని తాకాయని, అభిషేకానికి వచ్చిన భక్తులు ఈ దృశ్యం చూసి దివ్యానుభూతికి లోనయ్యారని చెప్పారు.

- వెంకటాపురం (ఎం)

జిల్లా కోర్టు నూతన భవన సముదాయాన్ని పరిశీలిస్తున్న జస్టిస్ వినోద్ కుమార్, జస్టిస్ కె.లక్ష్మణ్, జస్టిస్ పి.శ్రీసుధ



కోర్టుల భవన సముదాయాన్ని పరిశీలించిన హైకోర్టు జడ్జీలు

నల్లగొండ జిల్లా కోర్టులోని నూతన నాలుగు కోర్టుల భవన సముదాయాన్ని హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ టి.వినోద్ కుమార్, జస్టిస్ కె.లక్ష్మణ్, జిల్లా పోర్ట్ పోలియో జడ్జి జస్టిస్ పి.శ్రీసుధ ఆదివారం పరిశీలించారు. వీరికి నల్లగొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.నాగరాజు, అదనపు న్యాయమూర్తులు, కలెక్టర్ ఆర్వి.కర్ణన్, ఎస్పీ అపూర్వరావులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జడ్జీలు మాట్లాడుతూ, ఆర్అండ్బీ అధికారులు బిల్డింగ్ పనులు త్వరగా పూర్తి చేసి, ప్రహరీ నిర్మాణం చేపట్టాలని సూచించారు. పార్కింగ్ కోసం ఏర్పాట్లు చేయాలన్నారు. కోర్టు ప్రాంగణంలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. అనంతరం కోర్టు ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు రిజిస్ట్రార్ ఎస్.నర్సింగరావు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.నాగరాజు, అదనపు జడ్జి జయరాజు, తిరుపతి, సంపూర్ణ, ఆనంద్, కలెక్టర్ ఆర్.వి.కర్ణన్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేతి రఘుపతి, జ్యుడీషియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు మాతంగి వీరబాబు పాల్గొన్నారు.

- రామగిరి (నల్లగొండ)



డైనోసార్ పార్కు అద్భుతం: హరీశ్

త్వరలో గోవా తరహాలో సిద్దిపేటలో ఆర్టిఫిషియల్ బీచ్

డైనోసార్ పార్క్‌లో ప్రయాణం గొప్ప అనుభూతిని ఇచ్చిందని మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఆదివారంరాత్రి సిద్దిపేటలోని కోమటిచెరువు సమీపంలో డైనోసార్ పార్క్‌ను మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నర్సాపూర్ ఎమ్మెల్యే సీహెచ్ మదన్‌రెడ్డి, కలెక్టర్ ప్రశాంత్ పాటిల్‌తో కలిసి డైనోసార్ పార్క్‌లో వీల్‌ట్రాక్ ట్రైన్‌లో ప్రయాణించి వీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ డైనోసార్ పార్క్ అండర్ టన్నెల్‌లో ట్రైన్ ప్రయాణం ప్రతిఒక్కరికీ ఒక గొప్ప అనుభూతిని ఇస్తుందని అన్నారు. త్వరలో గోవా తరహాలో సిద్దిపేట కోమటిచెరువు ఒడ్డున ఆర్టిఫిషియల్ బీచ్ ఏర్పాటు చేయనున్నట్లు హరీశ్ తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

- సిద్దిపేటజోన్

స్కిల్ కుంభకోణం | సూత్రధారి చంద్రబాబే

- ఏపీ సీఐడీ అదనపు డీజీ సంజయ్
- ఆధారాలున్నందుకే అరెస్టు చేశాం
- దర్యాప్తు ప్రారంభించింది కేంద్ర సంస్థలే
- ముద్దాయిలు సెల్ఫ్ సర్టిఫికెట్లు: పొన్నవోలు



మీడియాతో మాట్లాడుతున్న ఏపీ సీఐడీ అదనపు డీజీ సంజయ్. చిత్రంలో పొన్నవోలు

సాక్షి, న్యూఢిల్లీ: టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) కుంభకోణం ప్రధాన సూత్రధారి అని నిర్ధారణ అయినందునే మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును అరెస్ట్ చేశామని సీఐడీ అదనపు డీజీ సంజయ్ స్పష్టం చేశారు. సీమెన్స్ అనే కంపెనీ ఉదారంగా రూ.3 వేల కోట్లు పెట్టుబడి పెడుతుందని చంద్రబాబు అసెంబ్లీలో చెప్పడంతోపాటు అలానే జీవోలు జారీ చేసి ఒప్పందం కుదుర్చుకున్నారని చెప్పారు. అయితే అందుకు విరుద్ధంగా 2015–16 ఆర్థిక సంవత్సరంలో మూడు నెలల వ్యవధిలో రూ.371 కోట్లు ప్రాజెక్టు నిమిత్తం హడావుడిగా విడుదల చేసి అవినీతికి పాల్పడ్డారని వెల్లడించారు. ఏపీ అదనపు అడ్వొకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డితో కలిసి ఆదివారం ఆయన ఢిల్లీలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీమెన్స్ కంపెనీ ద్వారా ఏపీలో ఆరు క్లస్టర్లుగా ప్రాజెక్ట్‌ను ఏర్పాటు చేస్తామని చంద్రబాబు ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుందన్నారు. జీవోలో నిధుల వెచ్చింపు 90:10 నిష్పత్తిగా చెప్పినప్పటికీ ఒప్పందంలో మాత్రం ఆ ప్రస్తావనే లేదని చెప్పారు. అయితే వాస్తవంగా సీమెన్స్ కంపెనీకి ఆ ప్రాజెక్ట్ గురించే తెలియదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 10 శాతం వాటా కింద రూ.371 కోట్లు విడుదల చేసి, 2015–16లో అందులోంచి రూ.271 కోట్లు ఇతర సంస్థలకు అక్రమంగా నిధులు మళ్లించారని చెప్పారు.

సీమెన్స్ కంపెనీకి తెలియదు

సీమెన్స్ కంపెనీకే తెలియకుండా ఆ కంపెనీ మాజీ ఎండీ సుమన్‌బోస్ ఈ కుంభకోణంలో ప్రధాన పాత్ర పోషించారని సంజయ్ తెలిపారు. ఆ విషయాన్ని సీమెన్స్ కంపెనీ కూడా గుర్తించిందన్నారు. నిందితుల్లో ఒకరైన సుమన్ బోస్.. ఒప్పందం కుదిరిన రోజున విద్యుత్తు లేనందున కొవ్వొత్తుల వెలుగులో సంతకాలు చేశామని.. కాబట్టి అందులో వివరాలు సరిగా చూడలేదని చెబుతుండటం విడ్డూరంగా ఉందన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ విద్యుత్తు రాలేదా అని ప్రశ్నించారు. అసలు ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు ప్రైవేటు వ్యక్తి అయిన గంటా సుబ్బారావుకు ఏకంగా నాలుగు పోస్టులు కట్టబెట్టి, ప్రభుత్వ అధికారులపై పెత్తనం అప్పగించడం.. ఆయన చెప్పినట్టే నిధులు విడుదల చేయాలని చెప్పడం ఏమిటని నిలదీశారు. నిధులు విడుదల చేయాలని చంద్రబాబు ఆదేశించినట్టు సమావేశం మినిట్స్ రికార్డులను గంటా సుబ్బారావు చూపించినట్టు ఆర్థిక శాఖ అధికారులు తెలిపారన్నారు.

త్వరలో మరో ఏడుగురి అరెస్ట్

కుంభకోణం తాలూకు ఫైళ్లలో చంద్రబాబు 13 డిజిటల్ సంతకాలు చేశారని సంజయ్ తెలిపారు. మొత్తం కుంభకోణంలో చంద్రబాబు పాత్ర ఆధారాలతోసహా బయట పడటంతోనే ఆయన్ను అరెస్ట్ చేశామని, ఏసీబీ న్యాయస్థానం రిమాండ్ విధించిందన్నారు. ఈ కేసులో మరో ఏడుగురిని అరెస్ట్ చేయాల్సి ఉందని చెప్పారు. స్కిల్ కుంభకోణంపై ఈడీ కూడా దర్యాప్తు చేస్తూ ఇప్పటికే సుమన్ బోస్, డిజైన్ టెక్ ఎండీ వికాస్ వినాయక్ ఖన్విల్కర్, స్కిల్లర్ ప్రైవేట్ లిమిటెడ్ మాజీ ఆర్థిక సలహాదారు ముకుల్ చంద్ర అగర్వాల్, సీఏ సురేష్ గోయెల్‌లను అరెస్ట్ చేసిందన్నారు. ఏఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ లక్షల డాలర్ల లాటరీ తగిలిందని చెప్పి అందులో పది శాతం కడితేనే మొత్తం ఇస్తాననే రీతిలో ఈ కుంభకోణానికి పాల్పడ్డారని చెప్పారు. తేదీ, లెటర్ నంబరు లేకుండా ఒప్పందం చేసుకోవడం ఎక్కడన్నా జరుగుతుందా.. అని ప్రశ్నించారు. ఈ కేసులో ముద్దాయిలు సెల్ఫ్ సర్టిఫికెట్లు ఇచ్చుకుంటున్నారని ఆయన ఎద్దేవా చేశారు.

సెంటిమెంట్ ‘అస్త్రం’.. గ్యారంటీ ‘మంత్రం’

రాష్ట్ర ప్రజలను ఆకట్టుకునే దిశగా కాంగ్రెస్ అడుగులు

రెండు రోజుల సమావేశాలు, సభతో హస్తం కేడర్‌కు కొత్త ఊపు

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల కదన రంగంవైపు కాంగ్రెస్ మరో ముందడుగు వేసింది. తుక్కుగూడ సభ వేదికగా తెలంగాణలోని అన్ని వర్గాల ప్రజలను ఆకట్టుకునేలా ఇటు సెంటిమెంట్ అస్త్రాన్ని, అటు గ్యారంటీ పథకాల మంత్రాన్ని ప్రయోగించింది. కాంగ్రెస్ పార్టీయే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చిందని, ఆ దిశగా సోనియా గాంధీ కీలక పాత్ర పోషించారని ప్రజల్లోకి వెళ్లేలా.. సోనియా, ఇతర నేతలు ప్రసంగించారు. ఇదే సమయంలో రైతులు, మహిళలు, పేదలు.. ఇలా అన్ని వర్గాల ప్రజలను ఆకర్షించేలా ఆరు గ్యారంటీల పేరిట కీలక హామీలను ప్రకటించారు. మరోవైపు బీజేపీతోపాటు బీఆర్ఎస్, మజ్లిస్ పార్టీలను టార్గెట్ చేస్తూ అగ్రనేతలు విమర్శలు గుప్పించడం గమనార్హం.

కల నెరవేర్చామంటూ..

విజయభేరి సభలో సోనియా కొంతసేపే మాట్లాడినా.. ప్రజలపై సెంటిమెంట్ అస్త్రాన్ని ప్రయోగించారు. తెలంగాణ ఏర్పాటులో తనతోపాటు కాంగ్రెస్ సహచరులు పాలుపంచుకున్నందుకు సంతోషంగా ఉందని వ్యాఖ్యానించారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావాలనేది తన కల అన్నారు. తెలంగాణ తన చొరవతోనే వచ్చిందని చెప్తూనే.. ప్రజల కల నెరవేర్చినందుకు బదులుగా అధికారాన్ని ఇచ్చి తన కల నెరవేర్చాలనేలా సోనియా ప్రసంగం ఉందని రాజకీయ వర్గాలు చెప్తున్నాయి. రాహుల్ గాంధీ కూడా తాము తెలంగాణ ఇస్తామని మాట ఇచ్చి నిలబెట్టుకున్నామని గుర్తుచేస్తూ.. తమను గెలిపిస్తే ఇప్పుడు ఇస్తున్న హామీలన్నీ నెరవేరుస్తామని ప్రకటించడం గమనార్హం. ఇక సోనియాతోనే మహిళలకు గ్యారంటీ ఇప్పించడం ద్వారా వారిలో భరోసా కల్పించే ప్రయత్నం చేశారని అంటున్నాయి. మహాలక్ష్మి పథకం కింద రూ.2,500 నగదు సాయం, రూ.500కే గ్యాస్ సిలిండర్, ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం హామీలను సోనియా గాంధీనే ప్రకటించారు. ఈ హామీలు మహిళల ఓట్లను రాబడతాయని కాంగ్రెస్ అంచనా వేస్తోంది. ఇక రైతులు, యువకులు, వృద్ధులు, పేదల కోసం మరో ఐదు గ్యారంటీలను కూడా కాంగ్రెస్ ప్రకటించింది. ఇవి ఆయా వర్గాలను ఆకర్షిస్తాయని భావిస్తోంది.

మూడు పార్టీలను టార్గెట్ చేస్తూ..

అటు సీడబ్ల్యూసీ సమావేశాల్లో, ఇటు తుక్కుగూడ బహిరంగసభలో రెండు అంశాలపైనే కాంగ్రెస్ పార్టీ ప్రధానంగా ఫోకస్ చేసింది. బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం పార్టీలు ఒక్కటేనని, అవసరమైనప్పుడు ఆ మూడు పార్టీలు సహకరించుకుంటాయని కాంగ్రెస్ నేతలు పదేపదే పేర్కొన్నారు. ఏఐసీసీ అధికార ప్రతినిధి పవన్‌ఖేరా, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తదితరులు మీడియాతో మాట్లాడినప్పుడు.. సభ వేదికపై రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే మాట్లాడినప్పుడు ఈ మూడు పార్టీలపై విమర్శలు గుప్పించారు.

పార్టీ కేడర్‌లో జోష్

సీడబ్ల్యూసీ సమావేశాల నిర్వహణ, తుక్కుగూడలో భారీ బహిరంగసభతో రెండు రోజుల పాటు జరిగిన హడావుడి రాష్ట్ర కాంగ్రెస్ శ్రేణుల్లో నూతన ఉత్తేజాన్ని నింపిందని ఆ పార్టీ వర్గాలు చెప్తున్నాయి. తుక్కుగూడ సభకు భారీ జనసందోహం రావడంతో కాంగ్రెస్ కేడర్‌లో నెలకొన్న జోష్‌కు నిదర్శనమని.. సోనియాగాంధీ పాల్గొన్న ఈ సభకు లక్షలాది మంది స్వచ్ఛందంగా తరలివచ్చారని అంటున్నాయి.

చంద్రబాబు అరెస్ట్ సక్రమమే

ఐటీ ఉద్యోగుల భారీ ర్యాలీ



సాక్షి, మేడ్చల్: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా హైదరాబాద్‌లో ఆదివారం ఐటీ ఉద్యోగులు భారీ ర్యాలీ నిర్వహించారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో టీడీపీ అధినేత చంద్రబాబును అరెస్ట్ చేయడం కరెక్టే అంటూ కార్లతో భారీ ర్యాలీ చేపట్టారు. ఈ క్రమంలో ఐటీ ఉద్యోగులు కీసర ఔటర్ రింగ్ రోడ్డు నుంచి కార్లలో ర్యాలీ ప్రారంభించి గచ్చిబౌలి వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా జై జగన్.. అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు ఐటీ ఉద్యోగులు మాట్లాడుతూ.. సంక్షేమాభివృద్ధి పథకాల వల్ల మళ్లీ అధికారంలోకి వచ్చేది సీఎం జగన్ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు.

చంద్రబాబు అవినీతి చేయకపోతే ఆయనకు అన్ని వేల కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయని ప్రశ్నించారు. నిన్న ఓఆర్ఆర్‌పై పెయిడ్ ఆర్టిస్టులు చంద్రబాబుకు మద్దతుగా ర్యాలీ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అచ్చెన్నాయుడు.. ప్లీజ్.. ప్లీజ్ అని బతిమాలుకుంటే, దండం పెడతాను అంటే వారలా ర్యాలీ చేపట్టారని చెప్పారు. ‘ఓఆర్ఆర్ కట్టింది.. తెచ్చిందే వైఎస్సార్. ఇక్కడ చంద్రబాబు చేసిన అభివృద్ధి ఏమీ లేదు. రానున్న కాలంలో చంద్రబాబు జైల్లోనే ఉంటారు. హైటెక్ సిటీ కమాన్ ఒక్కటే చంద్రబాబు కట్టారు. పక్కన ఫైనాన్షియల్ డిస్ట్రిక్, గచ్చిబౌలి వచ్చింది వైఎస్సార్, కేసీఆర్ హయాంలోనే. వైఎస్సార్ ఉన్న సమయంలోనే ఎయిర్ పోర్టు, రింగ్ రోడ్డు వచ్చాయి. చంద్రబాబు చేసిందేమీ లేదు. స్కామ్ ప్రూవ్ అయ్యింది కాబట్టే.. కోర్టు రిమాండ్ ఇచ్చింది కాబట్టే.. చంద్రబాబు జైలుకు వెళ్లారు. ఎంత మంది వచ్చినా.. ఎన్ని మాటలు మాట్లాడినా.. వైఎస్ జగన్ ఏపీలో మళ్లీ సీఎంఅవుతారు. ఇది ఫిక్స్’ అని ఐటీ ఉద్యోగులు వ్యాఖ్యానించారు.



కృష్ణా జలాలతో జలకళను సంతరించుకున్న నంద్యాల జిల్లా డోన్ మండలం వెంకటాపురం చెరువు

కరువు నేలకు ‘కృష్ణా’భిషేకం

రేపు 77 చెరువులకు కృష్ణా జలాలు

- ఈ పథకాన్ని జాతికి అంకితం చేయనున్న ఏపీ సీఎం వైఎస్ జగన్
- పాదయాత్రలో ఇచ్చిన మరో హామీ అమలుకు శ్రీకారం

కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని పశ్చిమ మండలాల నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి: రాష్ట్రంలో అత్యంత కరువు పరిస్థితులకు, వలసలకు మారుపేరైన కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని పశ్చిమ మండలాలు కృష్ణమ్మ స్పర్శతో పరవశించిపోతున్నాయి. ఇన్నాళ్లూ కరువుతో తల్లడిల్లిన నేలతల్లిని ఇప్పుడు కృష్ణా జలాలు అభిషేకిస్తుండటంతో పులకరించిపోతోంది. ట్రయల్ రన్ (ప్రయోగాత్మకంగా నడిపించడం) ద్వారా కృష్ణా జలాలను నింపిన చెరువుల కింద రైతులు పంటలు సాగు చేయడంతో నిన్నటి దాకా నోళ్లు తెరిచిన బీడు భూములు ఇప్పుడు కోనసీమను తలపిస్తున్నాయి. దశాబ్దాలుగా దుర్భిక్షంతో తల్లడిల్లుతున్న ఈ ప్రాంతాల ప్రజల దశ మార్చే మహత్తర పథకాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం జాతికి అంకితం చేయనున్నారు. ఆ ప్రాంతంలో 68 చెరువులను కృష్ణా జలాలతో నింపే పథకం ఫలాలను సీఎం వైఎస్ జగన్ రైతులకు అందిస్తుండటం కర్నూలు, నంద్యాల జిల్లాల చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగినదిగా సామాజికవేత్తలు ప్రశంసిస్తున్నారు. ఈ మహత్తర ఆశయంతో రూ.224.31 కోట్ల వ్యయంతో చేపట్టిన 77 చెరువులను నింపే పథకాన్ని ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసింది. ఈ పథకం వల్ల డోన్, పత్తికొండ, పాణ్యం, ఆలూరు నియోజకవర్గాల్లో నేరుగా 10,394 ఎకరాలకు నీళ్లందించనున్నారు. చెరువులు నింపడం వల్ల భూగర్భ జల మట్టం పెరుగుతుంది. దాంతో బోరు బావుల్లోనూ నీటి లభ్యత పెరుగుతుంది. దీని వల్ల వేలాది ఎకరాల భూములు సస్యశ్యామలం అవుతాయి. తాగునీటి ఇబ్బందులు తీరతాయి. దుర్భిక్షానికి, వలసలకు పెట్టింది పేరైన ఆ ప్రాంతంలో జీవనోపాధులు పెరగడం వల్ల ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతాయి. దాంతో వలసలకు పూర్తిగా అడ్డుకట్ట పడనుంది. పాదయాత్రలో ఆ ప్రాంతాల ప్రజల కష్టాలు కళ్లార చూసిన అప్పటి ప్రతిపక్ష నేత వైఎస్ జగన్.. అధికారంలోకి రాగానే కృష్ణా జలాలతో చెరువులను నింపి, సుభిక్షం చేయటం ద్వారా వలసలకు అడ్డుకట్ట వేస్తానని హామీ ఇచ్చారు. ఈ హామీతో అప్పటి టీడీపీ సర్కార్ ఎన్నికలకు ముందు హడావుడిగా చెరువులను నింపే పథకాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా జీవో ఇచ్చి కొబ్బరి కాయ కొట్టి చేతులు దులుపుకుంది. వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక ఇప్పటి వరకు రూ.224.31 కోట్లు వ్యయం చేసి.. 77 చెరువులను నింపే పథకాన్ని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేశారు.

డాక్టర్ పడే శ్రమ రోగికి అర్థమయ్యేలా చెప్పాలి: గవర్నర్

హైదరాబాద్ (రాంగోపాల్‌పేట్): ప్రాణాలు కాపాడేందుకు డాక్టర్ పడే శ్రమ, కృషి రోగికి కూడా అర్థం అయ్యేలా చెప్పాలని గవర్నర్ తమిళిసై అన్నారు. ఆదివారం సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో ద రాయల్ కాలేజ్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఎడిన్‌బరో ఆధ్వర్యంలో నిర్వహించిన నాన్ టెక్నికల్ స్కిల్ కోర్సు(నాట్స్)ను ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ సాంకేతికంగా ఎంత అభివృద్ధి చెంది అద్భుతాలు సృష్టించినా, దానిని రోగికి అర్థం అయ్యేలా చెప్పలేకపోతే ప్రయోజనం ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ అంతర్జాతీయ వ్యవహారాల కన్వీనర్ డాక్టర్ పి.రఘురాం, కిమ్స్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ భాస్కర్‌రావు, ఆర్‌సీఎస్ఎడ్ వైస్‌ప్రెసిడెంట్ మిస్‌క్లేర్ మెక్‌నాట్, ఏఎస్ఐ అధ్యక్షుడు డాక్టర్ సంజయ్, ప్రాబల్ నియోగి, డాక్టర్ శివమిశ్రా, డాక్టర్ సంతోష్ జాన్‌అబ్రహం, డాక్టర్ భన్వర్‌యాదవ్ పాల్గొన్నారు.

గవర్నర్ చెప్పిన ‘డాక్టర్’ ముచ్చట్లు

‘తాను గైనకాలజీతో పాటు ఫీటల్ థెరపీలో శిక్షణ పొందిన రెండవ డాక్టర్‌ను.. రెండు సొంత క్లినిక్స్‌లతో పాటు 10 ఆస్పత్రులకు కన్సల్టెంట్‌గా వెళ్లేదాన్ని.. ఒక్కోరోజు రాత్రి ఒంటిగంట అయ్యేది. నా భర్త నెఫ్రాలజిస్టు.. ఆయన రోగులతో సవివరంగా మాట్లాడేవారు.. పెళ్లిరోజు, పిల్లల పుట్టిన రోజులు కూడా వదిలేసేవారు.. కానీ కిడ్నీ మార్పిడి చేసిన రోగి నుంచి వచ్చే మొదటి చుక్క మూత్రం చూసి ఎంతో ఆనందపడేవారు. నేను పనిచేసే ఆస్పత్రిలో ఓ వ్యక్తికి గుండెపోటు వస్తే డాక్టర్లు రాత్రంతా కష్టపడి చికిత్స చేసి ప్రాణాలు కాపాడారు. అయితే ఉదయం రౌండ్స్‌లో ఇప్పుడు ఎలా ఉందని రోగిని అడిగితే తనకు ఉదయం నుంచి మోషన్ కావడం లేదని చెప్పాడు. కానీ రాత్రంతా వైద్యులు చేసిన కష్టం అతనికి తెలియలేదంటూ గవర్నర్ తన పాత జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు.

కేఎంసీ ర్యాగింగ్ ఘటనలో

ఏడుగురిపై కేసులు



ఎంజీఎం: వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాల(కేఎంసీ) ర్యాగింగ్ ఘటనలో ఏడుగురు వైద్యవిద్యార్థులపై మట్టెవాడ పోలీసుస్టేషన్‌లో కేసులు నమోదు చేసినట్లు వరంగల్ ఏసీపీ బోనాల కిషన్ తెలిపారు. కళాశాలలో ఫస్టియర్ చదువుతున్న మనోహర్ లైబ్రరీ నుంచి 14వ తేదీ రాత్రి హాస్టల్ గదికి వెళ్తుండగా సీనియర్ విద్యార్థులు అభినవ్ మొర, సిలువేరు శ్రీహరి, శ్రీచరణ్, సూర్యప్రకాశ్, కె.లోకేశ్, సాయికిరణ్, హరికృష్ణలు గమనించి పిలిచారు. తాము పిలిచినా రాలేదని తీవ్రంగా దూషించడమే కాక గదిలోకి వెళ్లి మనోహర్‌పై విచక్షణా రహితంగా దాడి చేశారు. అపస్మారకస్థితికి చేరుకున్న మనోహర్‌ను మిత్రులు ఎంజీఎం ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. ఈ ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా, మనోహర్‌పై దాడి జరిగిన రోజు హాస్టల్ ప్రధాన గేటు ఎదుట ఉన్న సీసీ ఫుటేజీలో పూర్తి వివరాలు రికార్డయ్యాయని అధికారులు పేర్కొంటున్నారు. ఈ ఘటనలో 10 మంది విద్యార్థులు మనోహర్‌ను ర్యాగింగ్ చేసినట్లు కళాశాల అంతర్గత కమిటీ ప్రాథమికంగా అంచనాకు వచ్చి డీఎంఈకి వివరించింది. వీరిపై సస్పెన్షన్ వేటు పడే అవకాశముందని అధికారులు చెబుతున్నారు.

నీటి పంపింగ్ పరిశీలనకు ఆపిన ‘పాలమూరు’ ఎత్తిపోతలు

కొల్లాపూర్: పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టు ఎత్తిపోతలు నిలిచిపోయాయి. శనివారం సీఎం కేసీఆర్ పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టులో భాగంగా నాగర్‌కర్నూల్ జిల్లా నార్లాపూర్ వద్ద ఏర్పాటు చేసిన మొదటి మోటార్‌ను స్విచ్చాన్‌చేసి సాయంత్రం 4.28 గంటలకు ప్రారంభించారు. రాత్రి 8 గంటల వరకు 250 క్యూసెక్కులకుపైగా నీటిని ఎత్తిపోశారు. అయితే ఆదివారం ఎత్తిపోతలను అధికారులు నిలిపివేశారు. నీటి పంపింగ్ ప్రక్రియ విజయవంతంగా కొనసాగడంతో మోటార్లు, పంపింగ్ సర్వీసింగ్‌ను పరిశీలించేందుకు ఎత్తిపోతలు నిలిపివేసినట్లు ప్రాజెక్టు అధికారులు వెల్లడించారు. అయితే దీనికి సంబంధించి పూర్తి వివరాలు వెల్లడించేందుకు సంబంధిత అధికారులు నిరాకరిస్తున్నారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.